# క్రాంతి

లోపలి పేజీల్లో...

కామ్రేడ్ ఆనందన్న నుండి నేర్చుకుందాం ........ 8
అంతర్జాతీయ అమరుల సంఘీభావ మాసం ........ 12
మణిపూర్ విధ్వంసం ........ 20
ఉక్రెయిన్ అణు యుద్ధ ప్రమాదం ........ 25
ఛత్తీస్‌గఢ్ ఎన్నికల బహిష్కరణ ........ 29
విద్యా విధానంపై వ్యాసాలు ........ 33
పార్లమెంట్‌లో చట్టాలు ........ 42

సీపీఐ (మావోయిస్టు) ఏపీ, తెలంగాణ, ఏఓబీ కమిటీల అధికార పత్రిక

సంపుటి: 47 సంచిక: 4 జులై-సెప్టెంబర్-2023 వెల: పది రూపాయలు

పార్టీ 19వ వార్షికోత్సవ సందేశం

# బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ఓడించండి!

# పార్టీ సంఘటితీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయండి!

**నోటు:** కేంద్రకమిటీ విడుదల చేసిన సవివరమైన సందేశాన్ని క్రాంతి పాఠకుల కోసం సంక్షిప్తం చేసి అందిస్తున్నాం. సం.మం.

ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్న కార్మికవర్గ అగ్రగామి దళమైన మన పార్టీ- భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని స్థాపించి 2023 సెప్టెంబర్ 21 నాటికి 19 సంవత్సరాలు నిండుతాయి. ఈ సందర్భంగా మన పార్టీ కేంద్రకమిటీ, 19వ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో విప్లవోత్సాహంతో, దృఢసంకల్పంతో నిర్వహించాల్సిందిగా పార్టీ శ్రేణులకు, విప్లవ ప్రజా నిర్మాణాలకు, విప్లవ ప్రజానీకానికి పిలుపునిస్తోంది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ఓడించాల్సిందిగా, అనుకూల పరిస్థితులను ఉపయోగించుకుంటూ వర్గ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని సంఘటితం, విస్తృతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిందిగా, పార్టీ సంఘటితీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిస్తోంది.

మన దేశంలో కుళ్లిపోయిన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేసే, ప్రపంచవ్యాప్తంగా సోషలిజం-కమ్యూనిజాన్ని స్థాపించే మహత్తర లక్ష్యాల సాధనకై మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో భారత విప్లవ నిర్మాతలు, మన పార్టీ సంస్థాపక నాయకులు, ఉపాధ్యాయులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ చటర్జీలు రూపొందించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో దృఢసంకల్పంతో మన పార్టీ కృషి చేస్తోంది. దేశంలో సామ్రాజ్యవాదులకు, దాని దళారీ పాలకవర్గాలకు పెనుసవాలుగా నిలిచింది. దీంతో మన పార్టీని, విప్లవోద్యమాన్ని రూపుమాపడం వారికి అనివార్యమైపోయింది. ఇందుకోసం వారు దశాబ్దాలుగా పలు విప్లవ ప్రతిఘాతుక, వ్యూహాత్మక దాడులు చేసి విఫలమయ్యారు. దీంతో గత అక్టోబర్ నెలలో 'సూరజ్‌కుండ్ చింతన్ శిబిర్'లో మరో విప్లవ ప్రతిఘాతుక పథకాన్ని రూపొందించారు. దేశంలోని పీడిత వర్గాలపై, సెక్షన్లపై, జాతులపై పాశవికంగా దాడులు చేస్తున్నారు. ఈ దాడులను ధైర్యసాహసాలతో ఎదుర్కొంటూ ఈ సంవత్సర కాలంలో 31 మంది మహిళా కామ్రేడ్స్ సహా 90 మంది కామ్రేడ్స్ అమరులైనారు.

ఆశయ సాధనలో అమరులైన వారిలో మన పార్టీ కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ కటకం సుదర్శన్ (ఆనంద్, దూల), రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ ఎల్.ఎస్.ఎన్. మూర్తి (ఆంధ్రప్రదేశ్), చండీ సర్కార్ (పశ్చిమ బంగ్), బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ గౌతమ్ పాశ్వాన్, చార్లీలు వున్నారు. దండకారణ్యంలో విప్లవ ప్రజా కళాకారుడు కామ్రేడ్ శంకర్ రావు, ఆయుధాల తయారీ రంగంలో నిపుణుడు కామ్రేడ్ వసంత్ అమరులయ్యారు. వీరితో పాటు మరో ముగ్గురు డీవీసీ, సీవైపీసీ సభ్యులు, నలుగురు సబ్ జోనల్ కమిటీ సభ్యులు, 17 మంది ఏసీ, పీపీసీ సభ్యులు, పార్టీ, పీఎల్‌జీఏ సభ్యులు 22 మంది, ప్రజా నిర్మాణాల కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు, ఇతరులు 32 మంది, వీరితో పాటు దేశవ్యాప్తంగా బహిరంగ ప్రజా ఉద్యమాలలో పని చేసే పలువురు విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విప్లవ సానుభూతిపరులు, మిత్రులు విప్లవోద్యమాన్ని పురోగమింపజేసే లక్ష్యంతో కృషి చేస్తూ కన్నుమూసారు. పార్టీ 19వ వార్షికోత్సవం సందర్భంగా ప్రజల విముక్తి కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరులందరికీ కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తున్నది.

అంతర్జాతీయంగా, ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ సంస్థాపక చైర్మన్ కామ్రేడ్ జోస్ మారియా సిసాన్ అనారోగ్యంతో అమరులయ్యారు. ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కామ్రేడ్ లాన్ (బెనిటో టియాంజోన్), పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బగోంగ్ -టావో

(విల్మా ఆస్ట్రియా)లను శత్రువు పక్కా సమాచారంతో ఎనిమిది మంది సహయోధులతో పట్టుకొని హత్య చేశాడు. ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు ఎంపోగ్ (ఇమ్యాన్యువల్ ఫెర్నాండెజ్) అనారోగ్యంతో కన్నుమూసారు. శత్రు డ్రోన్ దాడిలో ఆ పార్టీ కేంద్రమిటీ సభ్యురాలు కామ్రేడ్ ఎలే (హెలినితా పర్దాలిస్)తో పాటు ఐదుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. వారి అమరత్వం ఫిలిప్పీన్స్ విప్లవోద్యమానికి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి చాలా నష్టాన్ని కలిగించింది.

గ్రీసు కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ప్రధాన కార్యదర్శి ఆండ్రి ఒగియాజోలవ్, అఫ్ఘానిస్తాన్ (మావోయిస్టు) కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీలో ముఖ్యమైన సభ్యుడు కామ్రేడ్ సలీం, రీజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ ఫర్హద్ అనారోగ్యంతో కన్నుమూసారు. మార్క్సిస్టు-లెనినిస్టు కమ్యూనిస్టు పార్టీ (టర్కీ/కుర్దిస్తాన్) కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ అహ్మెట్ సోర్స్ (జెకీ గుర్బుజ్), కుర్దిస్తాన్ సాయుధ విప్లవ దళాల యువ కమాండర్ కామ్రేడ్ ఫిరాత్ నేవాల్ (ఒజగుర్ నమోగ్లు) శత్రు డ్రోన్ దాడిలో అమరులయ్యారు. ఈ గొప్ప కార్మికవర్గ నాయకులతో పాటు ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా వివిధ దేశాలలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు విప్లవాలలో, వివిధ సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతి విముక్తి పోరాటాలలో, ప్రజాతంత్ర, దేశభక్తి ఉద్యమాలలో ప్రాణాలను త్యాగం చేసిన యోధులందరికీ కేంద్రకమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తోంది. అమరులు నెలకొల్పిన కార్మికవర్గ ఆదర్శాల నుండి ప్రేరణ పొందుతూ, వారి నిస్వార్థ త్యాగాలను ఎత్తిపడుతూ, వారు నడచిన విప్లవ మార్గంలో దృఢంగా నిలబడి అంతిమ లక్ష్యం సాధించే వైపుగా ముందుకు సాగుతూ చివరి శ్వాస వరకు పోరాడుదామని శపథం చేద్దాం.

**పార్టీ:** భారత నూతన ప్రజాస్వామిక విప్లవ కేంద్ర కర్తవ్య సాధన కోసం కేంద్రకమిటీ రూపొందించిన రాజకీయ తీర్మాణాలలో, శత్రు విప్లవ ప్రతిఘాతుక సమాధాన్-ప్రహార్, సూరజ్ కుండ్ వ్యూహాత్మక దాడి పథకాలను ఓడించడంపై విడుదల చేసిన సర్క్యులర్లలో దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని పురోగమింపజేసేందుకు ఎత్తుగడలను అందించింది. శక్తిమేరకు ఈ ఎత్తు గడలను అమలు చేస్తూ పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటన-ఈమూడు విప్లవ అద్భుత ఆయుధాలను పటిష్టపరుచుకోవడానికి అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాలలో పార్టీ సంఘటితీకరణ క్యాంపెయిన్ కొనసాగింది.

2021లో సీసీ నూతనంగా ఆమోదించిన కేంద్ర రాజకీయ నిర్మాణ సమీక్ష (సీసీ పీఓఆర్), భారతదేశ ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన మార్పులు - మన రాజకీయ కార్యక్రమం (ఎంపీపీ), జాతుల సమస్య డాక్యుమెంట్లతో పాటు ఆవశ్యకమైన వివిధ ఇతర అంశాలపై వివిధ స్థాయిల కేడర్లకు క్లాసులు జరిగాయి. వివిధ ప్రాంతాలలో నిర్దిష్టంగా ఎంచుకున్న అంశాలపై కూడా క్లాసులు, సమష్టి అధ్యయనం నిర్వహిస్తూ కేడర్ల శక్తి సామర్థ్యాలను పెంపొందించే కృషి కొనసాగింది. నూతన డాక్యుమెంట్లలో పొందుపరచిన విషయాలను ఆచరణలోకి తీసుకెళ్లడం కోసం కొన్ని చోట్ల నిర్దిష్ట పథకాలను, కార్యక్రమాలను చేపట్టి అమలులోకి తీసుకెళ్లగలుగుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 15 ఎంఎల్ఎం పార్టీలు ప్రపంచ యుద్ధ/ అణు యుద్ధ ప్రమాద వ్యతిరేక అంతర్జాతీయ వేదికను నిర్మాణం చేయాలని నిర్ణయించడం, అందులో మన పార్టీ భాగస్వామ్యం కావడం, 2023 జనవరి మొదటి వారంలో సంయుక్త ప్రకటన వెలువడడం ఒక మంచి పరిణామం. ఈ అంతర్జాతీయ కృషి అంతటిలో ఐ.సీ.ఎస్.పీ.డబ్లు.ఐ. సంఘీభావ కృషి శ్లాఘనీయమైనది. ప్రపంచంలోని వివిధ ఎంఎల్ఎం పార్టీలు కూడా ఇందులో భాగస్వామ్యం వహించాయి. ఈ కృషి ప్రపంచ సోషలిస్టు విప్లవ శక్తుల పున:సమీకరణకూ, సంఘటితీకరణకూ, విప్లవోద్యమాల్ని పెంపొందించడానికి తప్పక తోడ్పడుతాయి.

**ప్రజాసైన్యం:** ఈ సంవత్సర కాలంలో వివిధ గెరిల్లాజోన్లు, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలో పీ.ఎల్.జీ.ఏ. బలగాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కిరాయి పారా మిలిటరీ, కమాండో, స్పెషల్ పోలీసు బలగాలపై చేసిన గెరిల్లాయుద్ధ చర్యలలో 64 మంది పోలీసులను నిర్మూలించి 154 మందిని గాయపరిచాయి. ప్రజా వ్యతిరేకులైన 13 మంది రాజకీయ నాయకులను, 28 మంది పోలీసు ఇన్‌ఫార్మర్లను, ఒక విప్లవ ద్రోహిని, ముగ్గురు ప్రజా శత్రువులను నిర్మూలించాయి. కార్పొరేట్ సెక్యూరిటీని విస్తరిస్తూ ఉద్యమ ప్రాంతాలలో డజన్ల కొలదీ పోలీసు, పారామిలిటరీ, కమాండో బలగాల క్యాంపులను ఏర్పాటు చేస్తూ మన పార్టీని, విప్లవోద్యమాన్ని తుదముట్టించడానికి శత్రువు చేస్తున్న దుష్ట ప్రయత్నాలను పీ.ఎల్.జీ.ఏ. తిప్పికొట్టింది.

2023లో చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ (టీసీఓసీ) కొన్ని ప్రాంతాలలో విజయవంతం కాగా, మరి కొన్ని చోట్ల పాక్షికంగా విజయవంతమైంది. శత్రు దాడుల మధ్యనే స్థానిక వనరులపై ఆధారపడి కొంత మేరకు ఇంప్రూవైజ్డ్ ఆయుధాలు, మందుగుండు తయారు చేసుకోవడం, శత్రువుపై ప్రయోగించడం ఇందులో చెప్పుకోదగినది. ఈ టీసీఓసీలో గెరిల్లా యుద్ధ నియమాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తూ, పథకం ప్రకారం గెరిల్లా యుద్ధాన్ని చొరవ, సమయస్ఫూర్తితో నిర్వహించి వుంటే మరింత ఎక్కువ సంఖ్యలో శత్రు నిర్మూలన, ఆయుధాల స్వాధీనం సాధ్యమై ఉండేది. అయినప్పటికీ, దేశంలో మన పార్టీ నాయకత్వంలో వివిధ ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలో, గెరిల్లా జోన్లలో గెరిల్లా యుద్ధంలో సాధించిన ఈ విజయాలు మన విప్లవ క్యాంపులో నూతనోత్సాహాన్ని పెంపొందించడానికి, శత్రు దాడిని ఒక మేరకు నిలువరించడానికి తోడ్పడ్డాయి.

**ఐక్యసంఘటన:** బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్.ఎస్.ఎస్.- బీజేపీ మోదీ ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమంపై, పీడిత ప్రజలపై కొనసాగిస్తున్న పాశవిక దాడులకు వ్యతిరేకంగా, వాటి ప్రజా వ్యతిరేక ప్రపంచీకరణ విధానాలను ఎండగడుతూ ఈ సంవత్సర కాలంలో ప్రజాసంఘాలు, వ్యూహాత్మక, ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనా నిర్మాణాలు నిరంతరం సాహసోపేతంగా పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజలను పెద్ద

సంఖ్యలో పలు పోరాటాలలో కదిలించాయి, రాజకీయ ప్రచారం చేసాయి. శత్రువు విస్తరిస్తున్న కార్పొరేట్ సెక్యూరిటీ నడుమనే ప్రజాపునాదిని పెంచుకునేందుకు కృషి చేసాయి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం, కార్పొరేటీకరణ, సైనికీకరణ, బలవంతపు విస్థాపన, విద్యార్థుల, రైతుల, మహిళల, కార్మికుల ముఖ్యమైన ప్రజా సమస్యలపై విశాల ప్రజా ఉద్యమాలను నిర్మించేందుకు, బలోపేతం-విస్తృతం చేసేందుకు కృషి చేశాయి.

దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడే సామాజిక కార్యకర్తలపై ఊపా చట్టాన్ని మోపడానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. హిందుత్వ శక్తులు మత మైనారిటీలపై, ప్రత్యేకించి దళితులు, ముస్లిములు, క్రైస్తవులు, ఆదివాసులు, మహిళలపై విచ్చిలవిడిగా కొనసాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా పలు పోరాటాలు జరిగాయి.

మణిపుర్‌లోని అడవులు, కొండలలో విలువైన ప్రకృతి వనరులను, సహజ సంపదను దేశ-విదేశీ కార్పొరేట్లకు అప్పగించే కుట్ర, ఓటు బ్యాంకును పెంచుకునే కుట్రలో భాగంగా మందబలంతో హిందుత్వ ఫాసిస్టులు సాగించే రాజ్య ప్రాయోజిత హత్యాకాండలు, మహిళలపై అమానవీయ అత్యాచారాలు, ఆస్తుల విధ్వంసం, ప్రార్థనా స్థలాల విధ్వంసంకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్రమైన నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇందులో యావత్తు పీడిత వర్గాల, సెక్షన్ల, జాతుల ప్రజలు కదులుతున్నారు. మన ఉద్యమ ప్రాంతాలలో విప్లవ ప్రజలు కదిలి నిరసన ప్రదర్శనలు, బంద్‌లు నిర్వహించారు.

నిజానికి మన దేశంలో అభివృద్ధికి కీలకమైన ఉపాధి, విద్య, వైద్యం వంటి రంగాలు మోదీ పాలనలో మరింత అధమ స్థానానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ సూచీల్లో చూస్తే కనుక ఆకలి సూచిలో 107వ స్థానం, ఆరోగ్య సూచీలో 146వ స్థానం, మానవ స్వేచ్ఛ సూచీలో 150వ స్థానం, ప్రపంచ సంతోష సూచీలో 139వ స్థానం, పర్యావరణ సూచీలో 180వ స్థానం, ప్రపంచ లింగ సమానత్వ సూచీలో 135వ స్థానం, మానవాభివృద్ధి సూచీలో 132వ స్థానం, పత్రికా స్వేచ్ఛ సూచీలో 142వ స్థానంలో వుంది.

కానీ ఈ వాస్తవాలను వెలుగులోకి తెచ్చే, ప్రశ్నించే గొంతులపై, పోరాడే కార్మికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాస్వామిక మేధావులు, మహిళలు, వకీళ్లు, మత మైనారిటీలు, సామాజిక రాజకీయ కార్యకర్తలపై ఊపా తదితర నిరంకుశ చట్టాల కింద కేసులు మోపడం హిందుత్వ ఫాసిస్టు పాలనలో సాధారణమైపోయింది. ప్రతిపక్ష పార్టీల ఉనికి కూడా ప్రమాదంలో పడింది. హిందుత్వ శక్తులు దేశాన్ని మత, కుల ప్రాతిపదికన విభజించి మత మైనారిటీలపై, దళితులపై దాడి చేస్తున్నాయి. మనుస్మృతిలో భాగంగా కులతత్వాన్ని, హిందుత్వ భావజాలాన్ని అమలు చేస్తున్నాయి. భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని మతోన్మాధంతో ధ్వంసం చేస్తున్నాయి.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం నుండి దేశాన్ని, ప్రజలను కాపాడడం నేడు దేశంలోని పీడిత వర్గాల, సామాజిక సముదాయాల, పీడిత జాతుల, ప్రజల, ప్రజాస్వామికవాదుల, దేశభక్తుల, లౌకికశక్తుల ముందున్న ప్రధాన కర్తవ్యం.

## కర్తవ్యాలు:

1. పార్టీ సంఘటితీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేద్దాం. 2. బహుముఖ ప్రతిదాడి పథకం ద్వారా సూరజ్‌కుండ్ వ్యూహాత్మక పథకాన్ని ఓడిద్దాం. 3. వ్యూహాత్మక, ఎత్తుగడలపరమైన ఐక్యసంఘటనలను, ప్రత్యేకించి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల ఐక్యసంఘటనను నిర్మిద్దాం, బలోపేతం చేద్దాం. 4. అంతర్జాతీయ కృషిని పెంపొందించాలి.

ఈ కర్తవ్యాల సాధన కోసం యావత్తు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ఐక్యసంఘటన శక్తులు, ప్రజా నిర్మాణాలు సమైక్యంగా పనిచేయాలి. ఒకరు పది మందిలా పనిచేయాలి. ఒకరు వందలు వేలమంది ప్రజానీకాన్ని కూడగట్టాలి. మన శక్తులను కాపాడుకుంటూ, నష్టాలను తగ్గించుకుంటూ శత్రుశక్తిని దెబ్బతీయడం కోసం సరైన ఎత్తుగడలతో, రహస్య పని శైలిని అనుసరించాలి. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న బలహీనతలను, పరిమితులను, లోపాలను అధిగమిస్తూ యథా లాపతకు గురికాకుండా దృఢ సంకల్పంతో కృషి చేయాలి. తద్వారానే అనుకూల పరిస్థితులను వినియోగించుకుని విప్లవోద్యమాన్ని తాత్కాలిక వెనకంజ నుంచి బయటపడేయగలం, దానిని పురోగమింపజేయగలం.

## ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

భారత హిందుత్వ ఫాసిస్టు పాలకులు భీషణ ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నప్పటికీ మన పార్టీనీ, విప్లవోద్యమాన్ని సమూలంగా వారు నిర్మూలించలేరు. దోపిడీ, పీడన, సామాజిక అసమానతలు, కుల మత వివక్షత, జాతుల అణచివేత వున్నంత వరకూ ప్రజా ప్రతిఘటన తప్పదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంక్షోభ సమస్యలను కేవలం సాయుధంగానే పరిష్కరించలేమని వారికి కూడా తెలుసు. అందువల్లనే పీడిత ప్రజల మధ్య ఐక్యతను చీలదీసి, ఒక సల్వాజుడుం, ఒక సేంద్ర, ఒక హర్మద్ వాహిని, మరో భైరవ వాహిని లాంటివి సృష్టిస్తూ ప్రజల మధ్యనే చీలకలను తెస్తున్నారు. హిందూ విష విద్వేష భావజాలాన్ని శరవేగంగా వ్యాపింప చేస్తూ రోజు రోజుకూ హిందుత్వ ఫాసిజాన్ని రెచ్చగొడుతున్నారు.

ప్రజలలోని సున్నితమైన మతపరమైన విశ్వాసాలను సొమ్ముచేసుకుంటూ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీని కొనసాగించేందుకు కులతత్వాన్ని పెంచి పోషించడం, దేశాన్ని మతపరంగా విభజించడం వారి తక్షణ ఎజండాగా కొనసాగుతోంది. పార్లమెంటరీ పార్టీలలో కూడా బ్రాహ్మణీయ హైందవ భావజాలమే ఆధిపత్యంలో వుంది. ఫలితంగా హిందుత్వ భావజాలానికి వ్యతిరేకంగా అవి దృఢంగా పోరాడలేవు. కనుక విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక పోరాట శక్తులు, సంస్థలే బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం వలన దేశానికి వాటిల్లుతున్న పెను ప్రమాదాన్ని ప్రజలకు అర్థం చేయించాలి. నాలుగు పీడిత వర్గాల కార్మికులు, రైతాంగం, పెటీబూర్జువా,

Edited with the trial version of Foxit Advanced PDF Editor
To remove this notice, visit: www.foxitsoftware.com/shopping

స్మరణలో

# వర్గ పోరాట కొలిమిలో ప్రతి నిత్యం రాటుతేలాలి (2011 డీకే ప్లీనం ముగింపు ఉపన్యాసం)

**కామ్రేడ్ ఆనంద్,**

**పొలిట్‌బ్యూరో సభ్యుడు**

**నోటు: కామ్రేడ్ ఆనంద్ డీకే పార్టీ ప్లీనం 2011లో మధ్య రీజియన్ బ్యూరో ప్రభారీగా సోదర సీఆర్‌బీ సభ్యులతో పాటు పాల్గొని గైడెన్స్‌ను అందించాడు. ప్లీనం ముగింపులో ఆయన ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించాడు. ఆయన ప్రసంగ పాఠానికి ఇవ్వటికీ ఉన్న ప్రాసంగికతను దృష్టిలో పెట్టుకొని పాఠకుల అవగాహన కోసం ఆయన సంస్మరణలో సంక్షిప్తం చేసి ప్రచురిస్తున్నాం -సం.మం.**

ఇప్పుడు నేను కొన్ని సిద్ధాంత విషయాలను మీ ముందుంచుతాను. మనం, ఒక ముఖ్యమైన, ప్రధాన గెరిల్లా జోన్‌లో అనేక విజయాలు సాధించి, ఒక కొత్త అనుభవాన్ని సంపాదించి, ముందుకు వెళ్లే క్రమంలో కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాం. వీటిని పరిష్కరించుకొని ముందుకు పోవాలనుకుంటున్నాం. ఇవన్నీ ఇపుడు మనం ఈ ప్లీనంలో చర్చించుకున్న పీ.ఓ.ఆర్.(రాజకీయ నిర్మాణ సమీక్ష) చెప్పింది. పీ.ఓ.ఆర్.లో చెప్పిన విషయాలను సిద్ధాంత పరంగా అర్థం చేసుకోవడానికి కొన్ని విషయాల మీద నేను ప్లీనం ముగింపు సందర్భంగా మాట్లాడుతాను.

1. సిద్ధాంతం- ఆచరణకు మధ్య వున్న సంబంధం
2. కార్య విధానం, శైలికి సంబంధించినది.
3. కేంద్రీకృత ప్రజాస్వామ్యం
4. దిద్దుబాటు ఉద్యమానికి సంబంధించినది.

పై నాలుగు అంశాలకు సంబంధించిన సైద్ధాంతిక అవగాహనలను మీ ముందుంచుతాను.

మన దండకారణ్య ఉద్యమం ఎదుర్కుంటున్న సమస్యలను ఈ ప్లీనంలో రాజకీయ, నిర్మాణ పరంగానే కాకుండా సైద్ధాంతిక కోణంలో కూడా పరిశీలించాం. సిద్ధాంతం వెలుగులో ఆచరణ ద్వారా లక్ష్యాన్ని చేరుకోవాలని మార్క్సిస్టు మహోపాధ్యాయులు మనకు చెప్పారు. మన మధ్య చాలా తరచుగా వచ్చే కొన్ని ప్రశ్నలు ఏంటంటే, 1. సిద్ధాంతం ఆచరణకు మధ్య సంబంధం ఏంటి? ఈ రెండింటి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునే పద్ధతి ఏంటి? కామ్రేడ్ మార్క్స్, లెనిన్‌లు చెప్పిన ప్రకారం ఏ పద్ధతిని అవలంబించాలి? అంటే మొదటిది విమర్శ: రెండవది, విప్లవీకరణ. ఈ సమస్యను మనం ఎంత లోతుగా అర్థం చేసుకుంటే మనకు అంతగా సిద్ధాంతమూ, ఆచరణల మీద పట్టు వస్తుంది. దీన్ని మార్క్స్ మొదట చెప్పాడు. లెనిన్ దాన్ని మరింత అభివృద్ధి చేశాడు. పాతదాన్ని ధ్వంసం చేయాలి, కొత్తదాన్ని నిర్మించాలి. కొత్తదాన్ని నిర్మించేప్పుడు విప్లవీకరణ జరగాలి. తప్పులను విమర్శించాలి. మనం చర్చించిన అనేక సమస్యలలో చాలా వరకూ మనం వాస్తవమైన సిద్ధాంతం, ఆచరణలకు చేరడం లేదు. మూల విషయాన్ని పట్టుకోవడం లేదు. ఇప్పటికీ మనం ఎదుర్కొంటున్న సమస్య వర్గపోరాట సమస్యే. అది ఇంకా ముందు కూడా వుంటుంది.

రష్యాలో, చైనాలో విప్లవం విజయవంతం అయ్యాక కూడా వర్గ పోరాటం అనే కీలక లింకు ఆధారంగానే పార్టీలో అంతర్గత పోరాటం నడిచింది, సమాజంలో పోరాటం నడిచింది, సామ్రాజ్యవాదంతో కూడా పోరాటం నడిచింది.

మనం వర్గపోరాటం నడుపుతున్నాం. దండకారణ్యంలో మనం ప్రజా రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేశాం. కానీ వర్గ శత్రువును ఎంత మేరకు తుడిచిపెట్టగలిగామనేది ఆలోచించాలి. పాతదాన్ని నాశనం చేయడం కొత్తదాన్ని నిర్మించడంలో మనకు పట్టు రావడం అనేది ముఖ్యమైనది. ఇది సైద్ధాంతిక సమస్య. ఇది ఆచరణలో

---

జాతీయ బూర్జువా వర్గం, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ప్రజలనందరినీ దానికి వ్యతిరేకంగా కూడగట్టాలి. విశాల ప్రాంతాలలో కార్మికవర్గ నాయకత్వంలో, జాతీయ, ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాల సాధన కోసం కార్మిక-కర్షక మైత్రిపై ఆధారపడి విశాల ప్రజా ఆందోళనలను, ప్రజా ప్రతిఘటనా పోరాటాలను, దీర్ఘకాలిక ప్రజా యుద్ధాన్ని పెంపొందించి అభివృద్ధి చేయాలి. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి ప్రజల ప్రజాస్వామ్యానికి గ్యారంటీ కల్పించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడం ద్వారా మాత్రమే బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ఓడించగలం.

**భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి! ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!**

**మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!**

ఆగస్టు 16, 2022

కేంద్రకమిటీ,

భారత

కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

★

క్రాంతి పత్రిక చదవండి అభిప్రాయాలు పంపండి. krantipatrika1985@gmail.com

కూడా ప్రతిఫలిస్తుంది. శత్రువు పట్ల ఎంత కఠినంగా వుంటున్నాం? ఎంత కసితో వుంటున్నాం? శత్రువును నాశనం చేయాలనే స్పష్టత తాత్వికంగా మనలో ఎంతుంది? ప్రజలకు ఎంత మేరకు అందించాం? ఎవరైనా చనిపోయారు అంటే, డప్పులు కొడితే సంతోషిస్తానని మావో అనేవాడు. పాతది ఏదైనా చనిపోవాల్సిందే. శత్రువైతే ముందే నాశనం చేస్తాం. పాతదాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, సైనికంగా ఎంతగా నాశనం చేస్తామో అంతగా నూతన వ్యవస్థను నిర్మించగలుగుతాం. అందుకే వర్గ పోరాటంలో అవతలి పక్షాన్ని నాశనం చేయడమనే లోతైన అవగాహనను ప్రతి నిత్యం, ప్రతి నిముషం మనం కల్గి వుండకపోతే మనలో వేరే భావజాలం చోటుచేసుకుంటుంది.

ఉదారవాదం వుందనేది అందరం గుర్తించిన విషయం. ఉదారవాదమంటే సాధారణమైనదేమీ కాదు. మనం నిత్యం శత్రువు పట్ల ఎంత మేరకు సరైన వైఖరిని అవలంబిస్తున్నామనేది చూడాలి. మా.లె.మా తత్వశాస్త్రంలో ఘర్షణ (రప్చర్) - గెంతు (లీప్) అంటున్నాం. ఏదేని ఒక విషయంలో ఘర్షణ లేకుండా గెంతు సాధ్యం కాదు. ఘర్షణ అంటే వర్గపోరాటమే. ఆ వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయకుండా ఎందులోనూ గెంతు రాదు. ఐక్యత-ఘర్షణ విషయంలో అంటే మనం ఎవరితో కలువాలి, ఎవరితో విభేదించాలి అనే విషయాలలో మనం స్పష్టంగా, సునిశితంగా మన విప్లవ రాజకీయాలనే ఆధిపత్యంలో వుంచాలి. అందుకే మన మహోపాధ్యాయులు కానీ, మన పార్టీ గానీ చెబుతున్నదేంటంటే రివిజనిజంతో మనం చాలా స్పష్టమైన విభజన రేఖను గీసుకోవాలి. రివిజనిజం చాలా ప్రమాదకరమైనది. మనం తీక్షణమైన వర్గపోరాటంలో కనుక లేకపోయినట్టయితే అది మనలో కూడా ఏదో ఒక రూపంలో ఉదారవాదం రూపంలో కావొచ్చు, మెతక వైఖరి రూపంలో కావొచ్చు, అలసత్వం రూపంలో కావొచ్చు, సంస్కరణవాద రూపంలో కావొచ్చు పొడచూపుతుంది. నేడు దండకారణ్యంలో మనం విప్లవాధికారాన్ని పెంపొందించాలి. అందుకు మనం చేపట్టాల్సిన ఎత్తుగడలు, కార్యాచరణ, మన లోపాలు, వర్గపోరాటంలో ఎదుర్కుంటున్న సమస్యలు వీటన్నింటి గురించి తీక్షణంగా ఆలోచించాల్సిన అవసరం వుంది.

ఒక సమస్య ఎడల మనం ఒక స్పష్టమైన వైఖరిని తీసుకొని మనం నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ముందుగా మనం దేని మీద ఆధారపడాలి? ఇప్పటిదాకా మనం చూసింది, సిద్ధాంతపరమైన సమస్య. అది ఆచరణ నుండి వచ్చినది, పారిస్ కమ్యూన్ నుంచి వచ్చినది, రష్యా విప్లవం నుంచి వచ్చినది. అదే నిశితమైన వర్గపోరాట సమస్య. దీన్ని చేపట్టడానికి కావల్సినది, సిద్ధాంత అధ్యయనం - దాని వెలుగులో మనం కొనసాగించాల్సిన ఆచరణ. మనం అధ్యయనం, అంటే సిద్ధాంత అధ్యయనం స్వీయాత్మకంగా వుండకూడదు. దానిని మనం వర్గపోరాట కోణం నుండే కొనసాగించాలి. నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగానే విశ్లేషించాలనే పద్ధతి ద్వారానే అధ్యయనం వుండాలి. అధ్యయనం ఎంతైనా చేయవచ్చు. ఎంతైనా జ్ఞానం సంపాదించవచ్చు. కానీ వర్గపోరాటానికి, కార్మికవర్గ నియంతృత్వాన్ని ఏర్పాటు చేయడానికి అది దారి సుగమం చేయాలి. సిద్ధాంత వెలుగులో ఆచరణకు వెళ్లడం, వర్గ పోరాటం సంబంధం లోనే ప్రతిదాన్నీ పరిశీలించడం, ఆ అనుభవాలపై ఆధారపడి తిరిగి సైద్ధాంతీకరించడం, పరిస్థితులను సంశ్లేషించడం అనే కోణంలో మన కృషి కొనసాగాలి.

మనం నేడు యుద్ధంలో ఉన్నాం. యుద్ధంలో వుండి అధ్యయనం చేయడం ఎలా అన్న సమస్యను ఎదుర్కుంటున్నాం. కానీ దానికి దూరంగా వుండి ఏమీ చేయలేం. మనం యుద్ధం మధ్యనే పరిస్థితులను సాకల్యంగా ఆకళింపు చేసుకోవడం ద్వారానే వచ్చిన నూతన అనుభవాన్ని, జ్ఞానాన్ని మళ్లీ సిద్ధాంతంగా మలచగలం. దానిని తిరిగి, తిరిగి అధ్యయనం చేయగలం. కార్యాచరణకు అన్వయించగలం. యుద్ధంలో పాల్గొంటూనే అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతగానో వుంది. అధ్యయనానికి విడిగా సమయాన్ని కేటాయించుకోవడం సాధ్యం కాదు. ఆచరణకూ సిద్ధాంతానికీ సమన్వయాన్ని సాధించాలంటే తుపాకీ పట్టుకుని పోరాడుతూ అధ్యయనం చేయాల్సి వుంటుంది. యుద్ధం తీవ్రమైన కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అందరూ చేసినదిదే. మన పరిస్థితి కూడా ఇప్పుడు అదే.

సిద్ధాంతం మనకు తెలుసా, లేదా? నేనయితే సిద్ధాంతం మనకు తెలుసు అనే అనుకుంటున్నా. సిద్ధాంతం అంటే ఏమిటి? ఆచరణలో మనం ఎదుర్కుంటున్న సమస్యలకు తగిన పరిష్కారం చూపెట్టడమే సిద్ధాంతం. మనం ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించ గలిగేవాళ్లే సిద్ధాంతకారులు. ఈ కోణంలో మీరు ఆలోచించండి. సిద్ధాంతం అంటే ఎక్కడో వుంది, పుస్తకాల్లోనే లభ్యమవుతుంది అని ఆలోచించకుండా మనకు ఆచరణ అనే గొప్ప వనరు వుంది. దానిని సిద్ధాంతంగా ఎలా మలచుకోవాలి అనేది ఆలోచించాలి? సమస్యలో దూరాలి. దానిని ఆకళింపు చేసుకోవాలి. సమస్యలోకి దూరినప్పుడే, దానిని ఆకళింపు చేసుకున్నపుడే మనకు నిజమైన జ్ఞానం వస్తుంది. సమస్యకు దూరంగా వుండి సిద్ధాంత అధ్యయనం చేసి సమస్యను పరిష్కరించాలంటే అది సాధ్యం కాదు. సమస్యలోకి దూరిన తర్వాత పరిష్కారం కోసం సిద్ధాంతంలోకి వెళ్ళాల్సిన అవసరం వుంటుంది. ఇదే మార్క్సిజం బోధించేది. పార్టీ ఈ కోణంలో అభివృద్ధి చెందాల్సి వుంది.

సిద్ధాంతపరంగా మనం బలహీనంగా ఉన్నామని పదే పదే చెప్పుకుంటున్నాం. కానీ దీన్నుండి బయటపడ్డానికి కృషి చేయాల్సింది ఎవరో పై నాయకత్వమే అని ఆలోచించకూడదు. ఇక్కడ వున్న పార్టీనే, ఇక్కడ వున్న కామ్రేడ్సే ఆ కృషి చేయాలి. ఇక్కడున్న కామ్రేడ్స్ యుద్ధ రంగంలో కొత్త కొత్త టెక్నిక్స్ ప్రవేశపెట్టారు. వాళ్లు ఏ సిద్ధాంతాన్ని చదివారు? వాళ్లు తమ ఆచరణలో ఎదురైన సమస్యలను పరిష్కరించుకోవడానికి వాళ్లకు వివిధ రూపాలలో ఒనగూరిన అవగాహన లలో నుండి ఎన్నో అద్భుతమై విజయాలను సాధించారు. వారికి మన పార్టీ అందించిన విప్లవ సాహిత్యం, శిక్షణ అందుకు గొప్పగా తోడ్పడింది. వాటి ద్వార వాళ్లు సమస్యలతో ఘర్షణ పడ్డారు, వాళ్లు ఆ ఘర్షణ పడ్డారు కాబట్టే వారు ఒక గెంతు తీసుకు రాగలిగారు. ఈ కోణంలో

ఆలోచించుకొని ప్లీనంలో వచ్చిన సమస్యలన్నింటినీ మనం గొప్ప విశ్వాసంతో పరిష్కరించుకోవాలి.

ఉద్యమంలో ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలంటే ముందు వాటిలో కీలకమైన విషయాన్ని పట్టుకోగలగాలి. ప్రజలను ప్రజా యుద్ధంలో మరింత క్రియాశీలంగా సమీకరించడం కోసం మన ప్రజా పునాదిని పటిష్టం చేసుకోవాలి. పార్టీ, ప్రజలతో మరింత మమేకం కావాలి. యుద్ధం చేస్తూనే ఈ పని చేయాలి. వర్గపోరాటంలో ఇదే కీలకమైన లింకు. దీని మీద ఆధారపడి ముందుకుపోవాలి.

ప్రజలతో సంబంధాలకు సంబంధించి చెప్పాను. ఇక పార్టీలో అంతర్గత పోరాటం గురించి మాట్లాడతాను. ఇది శత్రువుతో చేసే పోరాటం లాంటిది కాదు. వివిధ రకాల అభిప్రాయాల మధ్య ఘర్షణ ఇది. ఈ ఘర్షణ ఎందుకు జరగాలి అంటే పాతది ఏంటి? కొత్తది ఏంటి? వాస్తవం ఏంటి? అనేది తేల్చడం కోసం చర్చ జరగాలి. అంతర్గత పోరాటం సరిగా చేయాలంటే బేసిక్ (మౌలిక) విషయాల మీద పట్టు ఉండాలి. వాటి ఆధారంగా అంటే, సైద్ధాంతిక కోణంలో కార్యాచరణను విశ్లేషించగలిగినప్పుడు మనం నిశితమైన అంతర్గత పోరాటాన్ని సరిగ్గా చేయగలుగుతాం. అంతర్గత పోరాటం అంటే ఒకరిని ఒకరు ఓడించుకోవడం కాదు. అందరూ కలిసి ఒక కొత్త విషయాన్ని ఆవిష్కరించడం. అంతర్గత పోరాటం అనేది పంథా విషయంలో జరిగితే అక్కడ కూడా సరైన పంథా ఏంటో తేల్చుకోవడమే అవుతుంది. అంతర్గత పోరాటంలో కూడా ఒక గొంతును సాధించాలంటే అధ్యయనం చేయాలి. ఎవరో కొందరే చర్చలు చేయగలరని అనుకోవాల్సిన అవసరం లేదు. ఒక విషయం మీద పట్టు ఉంటే, దాని గురించి లోతుగా ఆలోచిస్తే ఎవరైనా మాట్లాడగలుగుతారు.

పార్టీలో అంతర్గత చర్చలకు సంబంధించిన పద్ధతి అదయితే మన పని శైలికి సంబంధించిన విషయాలను కూడ చూద్దాం. పని శైలి అంటే 'ఒక సాధారణత్వాన్ని నిర్దిష్టత్వానికి అన్వయించడం, నాయకత్వం కేడర్లతో మమేకం కావడం, పార్టీ ప్రజలతో మమేకం కావడం' అని మావో చెప్పాడు. పని శైలిలో ముఖ్యమైన అంశాలు ఏమంటే పరిశోధన చేయడం, ప్రచారం చేయడం, నిర్మాణం చేయడం. పరిశోధన చేయడం అంటే ప్రజల దగ్గరికి వెళ్లాలి. పార్టీ నాయకత్వం కేడర్లతో, ప్రజలతో ఐక్యం కావడం అంటే మామూలుగా స్నేహం చేయడమో, మాట్లాడడమో కాదు. నిత్య కార్యాచరణలో మన కేడర్లు మంచి అనుభవాన్ని సంపాదిస్తున్నారు. ప్రజలంటే ఒక విజ్ఞాన సర్వస్వం. కాబట్టి నాయకత్వం ప్రజల దగ్గరికీ, కేడర్ల దగ్గరికి వెళ్లడం అంటే నేర్చుకోవడానికి వెళ్లాలి. సమాజంలో నిరంతరం ముందుకొచ్చే కొత్త విషయాలను నేర్చుకోవడానికి, వర్గపోరాటం లో వాటి మూలాలను అన్వేషించడానికి మనం వెళ్లాలి. ఇది లెనినిస్టు కార్య శైలి. కానీ మన ఆచరణలో కొన్ని లోపాలు వున్నాయి. వాటిని మనం అధిగమించాలి. మనం పరిశోధించిన దాన్ని ప్రచారంలో పెట్టాలి. ప్రచారం చేయడం ద్వారానే నూతనాంశాలు వ్యాప్తిలోకి వస్తాయి. అంటే ప్రచారం ద్వార నూతనాంశాలు అందరికీ పంచగలుగుతాం అన్నమాట. ఇందులో మనం పట్టీ పట్టనట్టుగా ఉంటున్నాం. దీన్ని నిర్మాణానికి ఉపయోగించుకోవడంలో బలహీనంగా వున్నాం.


కాబట్టి కార్యశైలికి సంబంధించి లోతుగా ఆలోచించుకున్నప్పుడు మనకు నిర్దిష్ట కార్యాచరణ వుండాలి. పార్టీ శ్రేణులు, నాయకత్వం విప్లవం కోసమే ఉన్నారు. ప్రజలకు విప్లవం అత్యంత అవసరం. కాబట్టి ప్రజల విప్లవ ప్రయోజనాలతో మనం పూర్తిగా తాదాత్మ్యం చెందాలి. విప్లవ ప్రయోజనాలకు భిన్నంగా ఉన్న దేన్నైనా నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. ఇదీ కార్యశైలి అంటే. సాధారణ విషయాలను నిర్దిష్టంగా అన్వయించడంలో, పని విధానంలో, పని శైలిలో వస్తున్న సమస్యల గురించి ప్లీనంలో చాలా చర్చించాము. వీటి పైన తీర్మానాలు చేస్తాం. వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయాలి. క్షేత్ర స్థాయికి వెళ్లినపుడు నిర్దిష్ట పరిస్థితులను మనం సమగ్రంగా పరిశీలించాలి. కానీ అది తగినంతగా జరుగడం లేదు. అంటే ఇక్కడ మనం అవలంబిస్తున్న శైలి ఏంటి? సాధారణత్వాన్ని సాధారణంగా క్షేత్రస్థాయికి తీసుకుపోతున్నాము. అంతే తప్ప వాటిని నిర్దిష్టత్వానికి జోడించడం లేదు. కేడర్‌తో, ప్రజలతో పూర్తిగా మమేకం కావడం లేదు. అంటే సరైన శైలిని అనుసరించడం లేదని అర్థం. ఐక్యం కావడంలో ఏం లోపాలున్నాయి? కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో ఏం లోపాలున్నాయి? అనేది ఆలోచించాలి.

మనమంతా ఎంతో కష్టపడి పనిచేస్తున్నాం. కానీ, ఎక్కడ విఫలం అవుతున్నాం? లెనినిస్టు కార్యశైలిని మనం పూర్తిగా గ్రాహ్యం చేసుకోవడం లేదు. పని విధానంలో వర్గపోరాటమే కీలకమైన లింకుగా ఉంటుంది. దీనిని పట్టుకోగలగాలి. ఇలాంటి ఆచరణను మనం పెంపొంది చుకోవాలి. సాధారణంగా సమావేశాలలో తీర్మానాలు చేసుకుంటూ, పోతాం. కానీ ఆ తీర్మాణాలను తీసుకొని క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు అక్కడ వున్న కీలక సమస్య ఏంటి అనేది పరిశీలించి అన్వయిస్తే ఆ తీర్మానాలు ఆశించిన ఫలితాలను ఇస్తాయి. మంచి ఫలితాలు వస్తాయి. అయితే దీనికి సాహసం చేయాలి. సాధన చేయాలి. పార్టీ నిర్మాణాలకు భిన్నంగా పొమ్మని నేను చెప్పడం లేదు. పార్టీ నిర్ణయాలకు అనుగుణంగానే ఇటువంటి కార్యక్రమాలను కూడా మనం చేపట్టాలి. వాటి మీద కేంద్రీకరించాలి, ఫలితాలను రాబట్టాలి. నాయకత్వం శ్రేణులను కన్వీన్స్ చేసు కోగలగాలి. అటువంటి ఆచరణ, కార్యపద్ధతి, కార్యశైలిలను అలవర్చుకోవాలి. సంపూర్ణ ఆత్మ విశ్వాసంతో ముందుకుపోతే, విజయం సాధించగలుగుతాం.

కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో, ప్రజాస్వామాన్ని మనం ఏ మేరకు ఆచరిస్తున్నాం? ఏ మేరకు సరిదిద్దబడుతున్నాం అనేదే గీటురాయిగా వుంటుంది. ప్రజల్లోకి వెళ్లడం, కేడర్ దగ్గరికి వెళ్లడం, ప్రజాస్వామిక పద్ధతిని అనుసరించడం, అభిప్రాయాలు తీసుకోవడం అనేది ఎంత మేరకు సవ్యంగా జరుగుతున్నదనే చర్చ జరిపాము. ఇందంతా నాయకత్వం సమస్యనో, కేడర్ సమస్యనో కాదు. ఇక్కడున్న పార్టీలో, లేదా మన మొత్తం పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సవ్యంగా అర్థం చేసుకొని సమర్థవంతంగా అమలు చేసే విషయంలో మనలో ఉన్న పెటీబూర్జువా నేపథ్యం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నాం. పార్టీ నాయకత్వం అంతా పెటీబూర్జువా

సంపుటితో ఉంది. దీనివల్లనే పార్టీలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాము. వెనకబడిన ప్రాంతంలో పని చేస్తున్నాం కాబట్టి, కేడర్లలో, ప్రజల్లో ప్రశ్నించే స్వభావం సాపేక్షికంగా తక్కువగా వుంటుంది కాబట్టి, మనం చెప్పేవాళ్లం, వాళ్లు వినేవాళ్లు అనే వైఖరి మనకు తెలియకుండానే మనలో పని చేస్తుంది. దీని నుండి కొన్ని అదనపు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని మనం చైతన్యవంతంగా అధిగమించాల్సి వుంది.

కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని ఎంత వరకు అమలు చేస్తున్నాం? ఎంతవరకు కింది వాళ్లను మాట్లాడనిస్తున్నాం? అందరం ఏ మేరకు ప్రజాస్వామిక వాతావరణాన్ని, నేపథ్యాన్ని కల్పిస్తున్నాం? అనేది ఎప్పటికప్పుడు ఆలోచించాలి. దీంట్లో వాస్తవమైన సాధన చేయాలి. కాబట్టి ఓపెన్‌గా ఉండాలి. ఎవరు మాట్లాడినా ఏం మాట్లాడినా విప్లవం కోసమే మాట్లాడుతారు. కాకపోతే కొన్ని తప్పులు వుంటాయి. తప్పులను సరిదిద్దడానికి ఒక పద్ధతిని ఎంచుకోవాల్సి వుంటుంది. ఈ కోణంలో మనం ఓపికగా పరిశీలించుకోగలిగితే, మన పార్టీని ఇంకా బలోపేతం చేసుకోగల్గుతాం. ఇది ఒక్కరి సమస్య కాదు. మాతో సహా అందరి సమస్య కాబట్టి దీనిని మనం సాధన చేయాలి.



కేంద్రీకృత ప్రజాస్వామ్యం గురించి, కేంద్రీకృతంగా ఆలోచించి పనులు నిర్వహించడం వల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుందనీ, అది పార్టీలో ఐక్యతను దెబ్బ తీస్తుందనీ మనకు తరచుగా అనిపిస్తుంటుంది. కాబట్టి కేంద్రీకృతానికీ ప్రజాస్వామ్యానికీ మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడం చాలా అవసరం. ప్రజాస్వామ్యం ఉంటేనే కేంద్రీకృతం ఉంటుంది. అది ఐచ్ఛికంగా రావాల్సిన అవసరం వుంటుంది. ఇది చాలా ముఖ్యమైన అంశం. దీనిని మనం చర్చించుకున్నాం. అందరం ఐక్యం కావాలనేది మన లక్ష్యం. పై కమిటీలు కింది కమిటీలతో, మొత్తం పార్టీ ప్రజలతో ఐక్యం కావాలి. ప్రజల నుండి అభిప్రాయాలను స్వీకరించాలి. ప్రజల్లోకి ఎంత తరచుగా వెళతామనేది కాదు విషయం. ఏసీ మెంబర్లు తరచుగా వెళ్లొచ్చు. పై నాయకులు సంవత్సరానికి ఒకసారే వెళ్లొచ్చు. కానీ, అభిప్రాయాలను స్వీకరించడంలో వున్న సమస్యను మనం పరిష్కరించుకోవాలి. అంటే అభిప్రాయ సేకరణలో ఎలాంటి పక్షపాతం వుండకూడదు.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం సరిగా అమలు కానప్పుడు పెత్తందారీతనం రావొచ్చు, అతి ప్రజాస్వామికం రావొచ్చు. పెత్తందారీతనం , అతి ప్రజాస్వామికం అనేవి ప్రమాదకరమైనవి. వాటిని మనం దరిచేరనీయరాదు. వాస్తవంతో మనం జోడింపబడితే ఇవి మన దరిచేరవు. ఈ సమస్యలను విమర్శ-ఆత్మ విమర్శ పద్ధతులలోనే పరిష్కరించుకోవాలి. ఓపికతో పోరాటం చేయాలి.

☆

---

**"బోల్షివీకరణ అనేది నినాదం కాదు. వాస్తవంలో మన పార్టీని సరిదిద్దాల్సిన అవసరం వుంది. ప్లీనంలో వచ్చిన బేసిక్ విషయాలలోకి పోవాలి. బేసిక్ విషయాలలో మనలో వున్న లోపాలేంటి? ఈ టీం కనుక బోల్షివీకరణ చెందితే భారత సైన్యాన్ని సులువుగా ఓడించవచ్చు. మనకు అంత శక్తి, సామర్థ్యాలు వున్నాయి"**

**(అమరుడు కామ్రేడ్ ఆనంద్ ఉపన్యాసం నుండి)**

**"రష్యాలో అక్టోబర్ విప్లవం విజయవంతం అయితే దాని ప్రభావం ఏ స్థాయిలో వుంటుందో లెనిన్ ఊహించినట్టుగానే నేటి పరిస్థితి వుంది. లెనిన్ కూడా చాలా తక్కువ మంది బోల్షివిక్కులను తయారు చేసుకున్నాడు. లక్షలాది మంది వున్న పార్టీ కాదది. రెండు వందల మంది మంచి కమ్యూనిస్టులుంటే చైనా విప్లవాన్ని విజయవంతం చేస్తాను అంటాడు మావో. అది వాస్తవమే. అలాంటి పార్టీ కావాలి మనకు".**

# కామ్రేడ్ ఆనందన్న నుండి నేర్చుకుందాం

**సీసీ పిలుపు**

## జూన్ 5 నుండి ఆగస్టు 3 వరకు విప్లవ దీక్షతో జరిగిన కామ్రేడ్ ఆనందన్న సంస్మరణ సభలు విప్లవ స్ఫూర్తిని నింపాయి

భారత దేశంలోని వివిధ ప్రాంతాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ఆనందన్న సంస్మరణ సభలను పార్టీ శ్రేణులు, పీ.ఎల్.జీ.ఏ యోధులు, విప్లవ ప్రజలు ఘనంగా జరుపుకొని వినమ్రంగా విప్లవ జోహార్లర్పించారు. విదేశాలలోను విప్లవ పార్టీలు, భారత విప్లవోద్యమ మిత్రులు, శ్రేయోభిలాషులు, కార్మిక వర్గం విప్లవ దీక్షతో సంస్మరణ సభలను నిర్వహించి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటించారు.

ఆనందన్న పుట్టి పెరిగిన, విద్యాభ్యాసం చేసిన బెల్లంపల్లి ఆయన విప్లవ ప్రారంభ దినాల కార్యక్షేత్రం కూడా కావడంతో స్థానిక ప్రజలు, బంధు మిత్రులు, వివిధ రంగాలలోని ఆయన సన్నిహిత సహచరులు, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీలలో కొనసాగుతున్న ఆయన మిత్ర బృందం సంస్మరణలో ఒక బహిరంగ సభను నిర్వహించి కామ్రేడ్ ఆనందన్నతో తమ పరిచయాన్ని, ఆయన ఆదర్శాలను, పోరాట పటిమను, దృఢ దీక్షను కొనియాడారు. వారందరికి **క్రాంతి పత్రిక విప్లవాభివందనాలతో కృతజ్ఞతలు తెలుపుతోంది.**



సింగరేణి కార్మిక ఉద్యమాన్ని, విద్యార్థి-యువజన, రైతాంగ ఉద్యమాలతో సమన్వ యించడాన్ని, కార్మిక మహిళ రాజేశ్వరిపై బొగ్గుబావి దొర కొడుకు అత్యాచారం జరిపిన సంఘటనపై రాష్ట్ర వ్యాపితంగా ప్రజా ఆందోళన పోటెత్తడం, బెల్లంపెల్లిలో సింగరేణి యాజయాన్యాలకు వంత పాడే గూండాలను, పెత్తందార్లను ప్రజల మధ్య విచారించడం, శిక్షించడం లాంటి ఎన్నో అపూర్వ సంఘటనలను ఆనాటి ఉద్యమ విజయాలను, నిర్బంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు.

పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల ఉద్యమాలను సమన్వయించి నడపడంలో కామ్రేడ్ ఆనందన్న సామర్థ్యాలను, పార్టీని సంఘటితం చేస్తూ జగిత్యాల నుండి ఆదిలాబాద్, కరీంనగర్ ఉద్యమాలు, ఉత్తర తెలంగాణ, దండకారణ్య ఉద్యమాలు అభివృద్ధి కావడం, గెరిల్లా యుద్ధ తంత్రంలో ఆయన రాటు దేలడం, అఖిల భారత స్థాయిలో విప్లవోద్యమ విస్తరణ, అందులో భాగంగా ఆనందన్న ఎదుగుదలను, ఇంకా ఆయనతో వారి అనుబంధాన్ని, సాహిత్య ప్రక్రియలో ఆయన అభిరుచిని, కృషిని, ప్రోత్సాహాన్ని, పార్టీ సీనియర్ సభ్యురాలు కామ్రేడ్ గజ్జెల లక్ష్మమ్మ కుటుంబంతో లొలినాళ్ల నుండి పెనవేసుక పోయిన వర్గానుబంధాన్ని ఆ వేదిక దగ్గర ఆయన మిత్రులంతా కలబోసుకుని ఆనందన్న ఒక ప్రజానాయకుడు అంటూ, సిరులు నిండిన గనుల భూమి పుత్రుడని గర్వపడ్డారు.

మీడియాలో, సోషల్ మీడియాలో ఆయనతో అనుబంధం ఏర్పడిన పాత్రికేయులు, పూర్వ విప్లవ పార్టీ కార్యకర్తలు, విప్లవ ప్రజా సంఘాల నాయకులు ఆయన విప్లవ సేవల గురించి ఆనందన్న విప్లవ ప్రస్తానం గురించి విస్తారంగా మాట్లాడిన వివరాలు, వీడియోలు, పాటలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. ఇంటర్‌నెట్‌లో అనేకరకాల పోస్టర్లు, విదేశాలలో జరిగిన సభల వివరాలు వచ్చాయి. అన్ని రాష్ట్రాలలోను గ్రామాల్లో, పై స్థాయిలో జులై 28 అమరుల సంస్మరణ వారం సందర్భం పురస్కరించుకుని ఆనందన్న స్మృతిలో అనేక స్థూపాలను నిర్మించి సభలు నిర్వహించారు. దండకారణ్యంలోని దక్షిణ బస్తర్‌లో భారీ స్థూపాన్ని నిర్మించి, వేలాది ప్రజలు ఘనంగా నివాళులు అర్పించారు. వీటి నిర్మాణంలో, సభల నిర్వహణలో జనతన సర్కార్ల పాత్ర ప్రశంసనీయమైనది.

విప్లవ క్యాంపులో కేంద్ర కమిటీ నుండి వివిధ శ్రేణుల నాయకులు, వివిధ రంగాలలో ఆయనతో పని చేసిన కామ్రేడ్స్, ఆయన రక్షణ సిబ్బంది, పత్రికా రంగంలో ఆయనతో కలిసి పని చేసినవారు, ఆయన జీవిత సహచరి కామ్రేడ్ ఊరే వరకు ఎక్కడికక్కడే పెద్ద సంఖ్యలో కామ్రేడ్స్ పాల్గొని అమరుడు కామ్రేడ్ ఆనందన్న స్మృతిలో 50 సంవత్సరాల ఆయన ఆదర్శ వంతమైన విప్లవ జీవితాన్ని, నాయకత్వ పాత్రను, ఉద్యమ ప్రగతిలో ఆయన భాగస్వామ్యాన్ని, ఉద్యమ ఆటుపోట్ల మధ్యనే నిబ్బరంగా నిలబడి పురోగమనానికి బాటలు వేసిన ఆయన విప్లవ సేవల గురించి గుర్తుకు తెచ్చుకున్నారు.

విప్లవకారులు పదవుల కోసం, కీర్తి ప్రతిష్టల కోసం పని చేయరు. ప్రజల కోసం పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, మార్క్సిజం, లెనినిజం, మావోయిజం (ఎమ్.ఎల్.ఎమ్.) అనే విప్లవ సిద్ధాంతం

మార్గదర్శకత్వంలో, భవిష్యత్ పట్ల అచంచల విశ్వాసంతో, దృఢదీక్ష – పట్టుదలలతో, త్యాగనిరతితో పని చేస్తారు. ఆ కృషిలో కామ్రేడ్ ఆనందన్న చిరస్మరణీయుడని అందరూ బలంగా ప్రకటించారు. ఇంత మంది నాయకుల, కేడర్ల, విప్లవ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ఆయన కార్యశైలి నుండి మనం నేర్చుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ఆయన విప్లవ కార్యాచరణలో కేంద్రీకరణ ఏవిధంగా ఉండేది? అందుకనుగుణంగా ఆయన పని విధానం నిరంతరం ఎలా మెరుగుపరచుకున్నారు? అది భారత విప్లవోద్యమ పురోగమనానికి ఏ విధంగా తోడ్పడింది? అనే విషయాలను తెలుసుకుంటే భావి తరాలకు ఒక ప్రేరణగా, ఎడ్యుకేషన్‌గా ఉంటుంది. విప్లవకారుల జీవిత చరిత్రలు వారి మరణానంతరమే అనేక కోణాలలో వెలుగులోకి వస్తాయన్నది ఒక వాస్తవం.

**మొదటిది దృక్పథం అనుకుంటే,** ఆనందన్నకు జీవితం, సమాజం, విప్లవోద్యమాల గురించి స్పష్టమైన అవగాహన ఉంది. కామ్రేడ్ ఆనందన్న తనను తాను సమాజంలో భాగంగా గుర్తించాడు. సమాజంలో మౌలిక మార్పు అవసరాన్ని అర్థం చేసుకున్నాడు. అందుకు మార్క్సిజం అధ్యయనం చేయాలని, నక్సల్బరీ సాయుధ విప్లవ మార్గం అనుసరించాలని నిర్ణయించుకున్నాడు. అలా తీసుకున్న ఆనాటి ఆ నిర్ణయంలోని స్పష్టతే 5 దశాబ్దాల దృఢదీక్షకు, పట్టుదలకు, త్యాగనిరతికి, ఆదర్శవంతమైన విప్లవ కార్యాచరణకు చుక్కానిగా నిలిచింది. ఆ స్పష్టతతోనే ఆయన 50 వసంతాల విప్లవ జీవితం ఆదర్శప్రాయమైంది.

విద్యార్థిరంగం నుండి విప్లవ రాజకీయాలను తెలుసుకొని, కార్మిక వాడల్లో యువజనులను సంఘటితం చేయడంలో, మార్క్సిస్టు స్టడీ సర్కిల్స్ ద్వారా యువతను చైతన్యవంతం చేయడంలో ఆయన కృషి ఎంతో ప్రేరణనిస్తుంది. కార్మికులను సంఘటితం చేయడంలో గడించి అనుభవ జ్ఞానంతో సింగరేణి కార్మికుల ఉద్యమాన్ని, వారి 56 రోజుల చారిత్రాక సమ్మె పోరాటాన్ని నడపడంలో కామ్రేడ్ ఆనందన్న తనవంతు బాధ్యతను ఎంతో పట్టుదలతో నిర్వహించిన తీరు నేర్చుకోదగినది. ఇంద్రవల్లిలో వేలాది ఆదివాసీ రైతులపై పోలీసులు జరిపిన కాల్పుల సంఘటన, విప్లవోద్యమంపై నిర్బంధం పెరిగి ఎదురవుతున్న కష్ట పరిస్థితులలో ఆదిలాబాద్ రైతాంగ, కార్మిక ఉద్యమాన్ని ముందుకు తీసుకునిపోవడంలో ఆయన పట్టు సడలని దీక్ష కొనసాగించాడు. కార్మిక, కర్షక మైత్రిని సాధించి విద్యార్థి యువజన మేధావీ సెక్షన్‌లలో ఐక్యతను ఇనుమడింప చేసి అడవీ, మైదాన ఉద్యమాలను పార్టీ సమన్వయించింది. కామ్రేడ్ ఆనందన్న లీగల్, ఇల్లీగల్ పోరాటాలను సమన్వయంతో నిర్వహించి, గెరిల్లా పద్ధతుల్లో పోలీసులపై సఫల దాడులు చేస్తూ విప్లవ క్యాంపుని ఉత్సాహపరిచాడు. దళాలనంటి పెట్టుకుని, కేడర్‌కు రాజకీయ, సైనిక శిక్షణ ఇస్తూ, ఉద్యమ రక్షణ బాధ్యతలు నిర్వహించడంలో ఆనందన్న కేంద్రీకరణ ఎన్నదగినది.

నిత్య జీవితంలో సమయపాలన, కర్తవ్యనిర్వహణ సజావుగా జరిగేలా తన పనుల కేంద్రీకరణ ఉండేది. పనుల్లో గందరగోళం రాకుండా ఉండాలంటే యుద్ధం మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల పట్లా, బలాబలాల పట్ల నిరంతరం సరైన అంచనాతో కూడిన అప్రమత్తత, ప్రతిఘటన ఆవశ్యకత ను గుర్తించి పథకాలు రూపొందించడంలో సిద్ధహస్తుడు. ఆనందన్న ఎన్నో సార్లు ప్రమాదకర పరిస్థితుల్లో నుండి, పోలీసు కాల్పుల మధ్య నుండి తన బలగాలతో పాటు బయటపడడానికి చొరవతో కూడిన నాయకత్వ పాత్ర పోషించాడు. తనతో ఉన్న కేడర్‌ను కాపాడుకోగలిగాడు.

ఉద్యమ అవసరాలకు అనుగుణంగా ఆనందన్న కర్తవ్య నిష్టతో కేంద్రీకరించి పని చేయడం వలన ఉద్యమం అభివృద్ధితో పాటు ఆనందన్న నాయకత్వ బాధ్యతలు పెరుగుతూ వచ్చాయి. పెరిగిన బాధ్యతలకు అనుగుణంగా ఆయన సైద్ధాంతిక, రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ, వర్గపోరాట కొలిమిలో రాటుతేలుతూ నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేస్తూ, పార్టీ ముందున్న అనేక సవాళ్ళను ఒక నాయకత్వ కామ్రేడ్‌గా దీటుగా ఎదుర్కొన్నాడు. పార్టీ కాంగ్రెస్, కేంద్ర కమిటీ రూపొందించిన కేంద్ర కర్తవ్యానికి అనుగుణంగా తన బాధ్యతలలోని ఉద్యమ ప్రాంతాలలో తగిన విప్లవ కార్యక్రమాన్ని రూపొందించి, దానిని అమలు చేయడంలో శక్తి వంచన లేకుండా కృషి చేశాడు. క్షేత్ర స్థాయిలో వాటి ఫలితాలను బట్టి ఉద్యమాన్ని అంచనా వేసుకుంటూ సంఘటితం చేయడానికి అహర్నిశలు శ్రమించాడు.

గెరిల్లా జోన్ పెరస్పెక్టివ్ (1980) సందర్భంలోను, బేస్ ఏరియా లక్ష్యంతో పని చేయాలని (2001లో) కాంగ్రెస్ నిర్ణయించినపుడు, అలాగే ఆయా సందర్భాలలో చేపట్టిన దిద్దుబాటు క్యాంపెయిన్‌లను, ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌తో జమిలిగా నడిపి విజయవంతం చేయడంలోను కామ్రేడ్ ఆనందన్న ప్రత్యేక శ్రద్ద పెట్టేవాడు. పార్టీలో బోల్షెవీకరణ కేంపెయిన్ చేపట్టడంలో ఆయన చొరవ చెప్పుకోతగినది. దానికి అనుగుణంగా రాజకీయ శిక్షణ, అధ్యయన తరగతులు, సమావేశాలలో చర్చలు, ప్రజల మధ్య సంవాదాలను నడపుతూ వాటిని జయప్రదం చేయడానికి ఎంతగానో కృషి చేశాడు. శత్రు దాడులను తిప్పికొట్టడానికి అవసరమైన సైనిక కమాండ్ నిర్మాణాలు, టీ.సీ.ఓ.సీ. తయారీలు, అవసరమయిన సాహిత్యం సిద్ధం చేయడంతో పాటు కేడర్లను, వివిధ కమిటీలను మోటివేట్ చేయడంలో తనదైన ప్రత్యేక పాత్ర, పని విభజన ఉండేది. ఆయా క్యాంపెయిన్‌లలో వచ్చిన ఫలితాలను సమీక్షించి గుణపాఠాలు తీయడంలో, నష్టాలకు కారణాలను విశ్లేషించడంలో, క్రింది నుండి వచ్చిన అభిప్రాయాలను, నిర్దిష్ట పరిస్థితుల్లో ఉన్న సాధక బాధకాలను అర్థం చేసుకుని, అనుకూలతలపై ఆధారపడి ప్రతికూలతలను అధిగమించడానికి అవసరమైన గైడెన్స్ ఇచ్చేవాడు.

బెల్లంపల్లిలో స్టడీ సర్కిల్‌లో భాగమైన కామ్రేడ్ కటకలం సుదర్శన్ క్రమంగా పార్టీ సెల్ నిర్మాణం, కేంద్ర ఆర్గనైజర్ నుండి ఆదిలాబాద్ జిల్లా కమిటీ, ఫారెస్ట్ కమిటీ, రాష్ట్ర కమిటీలలోకి ఎదిగివచ్చి ఆయా కమిటీలకు అవసరమైనంత కాలం కారదర్శిగా పనిచేసి కేంద్ర కమిటీలోకి ఎదిగిన ఆనందన్న పొలిట్ బ్యూరో సభ్యుడుగా, సీ.ఆర్.బీ. ఇన్‌చార్జ్‌గా అనేక బాధ్యతలు నిర్వహించి ఒక మంచి దక్షత గల నాయకుడుగా కమిటీల, కేడర్ల విశ్వాసాన్ని చూరగొన్నాడు.

కార్మిక వర్గంలో పుట్టిన ఆనందన్న విద్యార్థి దశలో రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడు, బెల్లంపల్లి కార్మిక బస్తీల యువజనులను కూడగట్టి యువజన సంఘాలను నడిపాడు. కార్మికులతో సమ్మె పోరాటాలు చేయించాడు. అదిలాబాద్ ఆదివాసీ రైతాంగంతో మమేకమై వారి అభిమాన పాత్రుడయ్యాడు. వారి ఉద్యమాల నాయకుడిగా రూపొందాడు. రచయితలను, కళాకారులను, మేధావులను కలిపి అనేక ప్రజాస్వామిక సమస్యలపై ప్రచార ఆందోళన కార్యక్రమాలను గైడ్ చేశాడు. విద్యార్థి, ఉద్యోగ, మేధావీ సెక్షన్లలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న నినాదాల్లో ఒకటి "కార్మిక కర్షక విద్యార్థి మేధావి ఐక్యత వర్ధిల్లాలి". ఆ నినాదం అడవి, మైదాన గ్రామాల్లో, పట్టణాల్లో రణ నినాదంగా మారుమోగింది. రాష్ట్రంలో అన్ని చోట్ల అన్ని సెక్షన్ల ప్రజలు విప్లవ ప్రచార ఆందోళనల్లో, సంఘటిత ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆనాటి వర్గ పోరాట రాజకీయ వాతావరణంలో కామ్రేడ్ ఆనందన్న ఒక మంచి కార్యకర్తగా పార్టీ నాయకుడుగా ఎదిగాడు.

నక్సల్బరీ సెట్‌బ్యాక్ (వెనుకపట్టు) తర్వాతి కాలం నుండి అంటే 1975 నుండి ఆనందన్న 2023లో అమరుడయ్యేనాటికి (49 సంవత్సరాలలో) విప్లవోద్యమం విస్తృతిలో, ఉన్నతిలో నూతన ఎత్తులకు ఎదిగింది. ఆ ఉద్యమం ఆనందన్న లాంటి అనేక మంది విప్లవ కారులను గొప్ప ఉద్యమ నాయకులుగా తీర్చిదిద్ది అందించింది. అత్యవసర కాలం పిదప తొలితరం యువ విప్లవకారులలో కామ్రేడ్ కటకం సుదర్శన్ (ఆనందన్న) భారత విప్లవోద్యమం తొలివరం నాయకుల్లో ఒకరు. కామ్రేడ్ ఆనందన్న కార్మికవర్గ పుత్రుడు, సీనియర్ కామ్రేడ్, వర్గపోరాటంలో రాటుదేలిన ఉన్నత శ్రేణి నాయకుడు, కేడర్ల విశ్వసనీయమైన, ఆదర్శవంతమైన విప్లవ కార్యాచరణతో పీడిత ప్రజల ప్రియతమ నేతగా మంచి గుర్తింపు పొందాడు.

భారత విప్లవోద్యమ చరిత్రలో విడదీయరానంతగా సంలీనమైన ఆనందన్న విప్లవ కార్యాచరణ నుండి కొన్ని ముఖ్యమైన విషయాలను భావితరాలు అనుసరించడానికి ఇక్కడ చెప్పుకుందాం.

1. భారత దేశం వ్యవసాయక దేశం, ఇక్కడ భూస్వామ్య సంబంధాలు ఏ విధంగా మార్పు చెందుతున్నాయి అనే ప్రధాన అంశం మీద ఆనందన్న 1980ల నుండి 2022 వరకు 4 దశాబ్దాలకు పైగా అధ్యయనం చేశాడు.

ఆదిలాబాద్ జిల్లా లక్సెట్టిపేట, జన్నారం ప్రాంతాల గ్రామాల నుండి మొదలుపెట్టి తెలంగాణ వ్యాప్తంగా అధ్యయనం చేసి, దక్షిణ బస్తర్‌లోని గ్రామీణ ప్రాంతాలలోని వర్గ సంబంధాలను ప్రత్యక్షంగా పరిశీలించాడు. ఉత్తర తెలంగాణ మైదాన ప్రాంతాలు ముఖ్యంగా కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు మహబూబ్‌నగర్ తదితర జిల్లాలలో సామాజికంగా వచ్చిన మార్పులను అధ్యయనం చేశాడు. వీక్షణం గ్రూపు తయారు చేసిన 50 సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి పరిశీలన గ్రంథం, ఆర్.ఎస్. రావు గారు లాంటి వారి పరిశీలనాంశాలను, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారి పరిశీలనలను, అనేక రకాల చర్చలను, వివిధ రకాల పత్రాలను లోతుగా అధ్యయనం చేశాడు. 1990 ప్రాంతంలో నూతనంగా ముందుకు వచ్చిన పట్టా భూముల పంపకాల అనుభవాలను, ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజికంగా వచ్చిన మార్పులను సమన్వయించి "ఆంధ్రప్రదేశ్ భూసంబంధాలు – ఒక పరిశీలన" పేరుతో పరిశీలనా విషయాలను పుస్తిక రూపంలో పార్టీ విడుదల చేసింది. పరమేశ్వర్ పేరుతో భూమి సమస్య పై అనేక వ్యాసాలు రాసాడు.

దండకారణ్యంలో వివిధ ప్రాంతాలలో పార్టీ నాయకత్వం జరిపిన వర్గ పరిశీలనలను, రిపోర్టులను చర్చించి, పంజాబ్, హర్యానాలలో హరిత విప్లవ ప్రభావం మదింపు చేసి భారత దేశ సామాజిక సంబంధాలలో మౌలికంగా మార్పు రాలేదని, నయా వలస తరహా దోపిడీ విధాన ప్రభావంతో చోటు చేసుకున్న వక్రీకరించిన పెట్టుబడిదారీ సంబంధాలు భూస్వామ్యాన్ని ఆధారం చేసుకుని బలపడినవేనని విశ్లేషిస్తూ పార్టీ తన వైఖరిని స్పష్టం చేసింది.

2. రాజకీయ పంథా విషయంలో స్పష్టతతో నిర్ణయాత్మకంగా ఉంటూ మార్గదర్శకత్వాన్ని అందించాడు. 1972 తర్వాత భారత విప్లవోద్యమం సెట్‌బ్యాక్‌కు గురై తిరిగి విప్లవానికి బాట రూపొందుతున్న దశలో అంటే, 1974 తర్వాతనే విప్లవ పార్టీ సంబంధాలలోకి వచ్చిన తొలితరం నాయకుల్లో ఒకరైన కామ్రేడ్ ఆనందన్న 5 దశాబ్దాల విప్లవోద్యమ ఆటుపోటులన్నింటిలో ప్రత్యక్ష భాగస్వామిగా, నాయకత్వంలో ఒకరిగా నిలిచాడు. గెరిల్లా జోన్ పెర్‌స్పెక్టివ్‌కు అనుగుణంగా ఉద్యమాన్ని సంఘటిత పరచడంలోను, స్థావర ప్రాంతాల లక్ష్యంతో పని చేస్తూ గ్రామ రాజ్య కమిటీల నుండి జనతన సర్కార్‌ల పరివర్తన వరకు వాటి నిర్మాణం, పని విధానం, ఎదుగుదలలో మధ్య రీజినల్ బ్యూరో ఇంచార్జ్‌గా తగిన గైడెన్స్‌ను అందించాడు.

అలాగే 2001 తర్వాత తెలంగాణలోను ఆ తర్వాత ఏ.పీ., ఏ.ఓ.బీ.లలోను వచ్చిన తాత్కాలిక వెనుకంజ పరిస్థితుల్లో మంచీ చెడులు రెండింటికి బాధ్యత వహిస్తూ ఆటు కాలంలో వివిధ దేశాలలో అనుసరించిన ఎత్తుగడలు అధ్యయనం చేసి, నాయకత్వ కేడర్లకు దానిని అందించి వాటి వెలుగులో చేపట్టాల్సిన ఎత్తుగడలు, కర్తవ్యాలు – పని విధానాన్ని రూపొందించడంలో ఆనందన్న విశిష్ట పాత్రను పోషించాడు. మధ్య రీజియన్‌లోని ఆయా ప్రాంతాల ఉద్యమ పునర్వికాసానికి నిర్దిష్టంగా అన్వయిస్తూ ఎత్తుగడలు, పని విధానాన్ని అమలు చేశాడు. మిలటరీ రంగంలో కేడర్‌కు శిక్షణ నివ్వడం నుండి అనేక ఘటనల్లో, ఆంబుష్‌లలో (ఛత్తీస్‌గఢ్ లోని దర్భెకస, సీతాఫల్ నుండి 2021 జీరగూడలో జయప్రదం చేసిన ఆంబుష్‌వరకు ఆయన ప్రత్యక్షంగా బలగాల వెంట వుంటూ నాయకత్వం అందించాడు. 2020లో శత్రువు ఆపరేషన్ ప్రహార్ పేరుతో పెద్ద ఎత్తున సైనిక దాడికి ఉపక్రమించినపుడు ముందుగానే విప్లవ శిబిరాన్ని సమాయత్తం చేసి తిప్పికొట్టడంలో ప్రత్యక్షంగా బలగాల వెంట వుంటూ కీలక పాత్ర పోషించాడు.

పార్టీ అంతరంగిక చర్చలలో మొదట సత్యమూర్తి, కోబాడ్ గాంధీల ముఠా, తదుపరి పార్టీ సంస్థాపక నేత కే.ఎస్., సృష్టించిన అంతర్గత సంక్షోభాలను, వివిధ సందర్భాలలో పార్టీ ఎదుర్కొన్న మితవాద, అతివాద పెడ ధోరణుల సందర్భంగా కామ్రేడ్ ఆనంద్

తనకున్న స్పష్టమైన సిద్ధాంత రాజకీయ అవగాహనా పటిమతో, పార్టీ రాజకీయ, సైనిక, నిర్మాణ పంథా ఎడల ఉన్న స్పష్టతతో విప్లవ పక్షమే నిలిచి వాటిని ఓడించడంలో తన వంతు పాత్ర ఆయన పోషించాడు.

3. కేంద్రకమిటీ రూపొందించిన **"ప్రజాస్వామిక తెలంగాణ"** వైఖరిని ముందుపెట్టి మలి తెలంగాణ ఉద్యమానికి సారధ్యం వహించి నడిపాడు. అందులో భాగంగా వెలువరించిన **"వరంగల్ డిక్లరేషన్"** గైడెన్స్‌లో "ప్రజాస్వామిక తెలంగాణ" సాధనకై రోడ్‌మ్యాప్ తయారుచేశాడు. **భౌగోళిక తెలంగాణ** మౌలిక పరిష్కారం కాదని ప్రజాస్వామిక తెలంగాణ సాధనకై అవిరామ కృషి కొనసాగించాలని ఉద్యమ కార్యకర్తలకు పిలుపునిచ్చాడు.

అమరుడు కామ్రేడ్ ఆకుల భూమయ్య లాంటి వారి నాయకత్వంలో 'జాయింట్ యాక్షన్ కమిటీ'ని రూపొందించి నడపడంలోను, ప్రత్యేక తెలంగాణ పోరాట సంస్థలను గైడ్ చేస్తూ నడపడంలో విశేష అనుభవాన్ని పార్టీకి అందించాడు. తెలంగాణ విప్లవోద్యమం ఆటు, తాత్కాలిక వెనుకంజ పరిస్థితులను ఎదుర్కొంటుండగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టి భౌగోళిక తెలంగాణ సాధనానంతరం సమకూరిన సంఘటిత విప్లవశక్తులతో ప్రజాస్వామిక తెలంగాణ సాధన దిశలో విప్లవ కార్యకలాపాలు కొనసాగాలనే పార్టీ అవగాహనను స్పష్టంగా వారి ముందుంచాడు. ఉద్యమ వెనుకంజ పరిస్థితులలో నూతన విప్లవ శక్తులను సమీకరించుకోవడానికి ఆ ప్రజా ఉద్యమం గొప్పగా తోడ్పడింది. వివిధ ప్రజా ఉద్యమాలకు విప్లవ పంథానందించడమనే గొప్ప అనుభవం పార్టీకి లభించింది.

4. ఐక్య సంఘటనా కార్యకలాపాలు నిర్వహించడంలో ఆయన విశేష కృషి సలిపాడు. విప్లవ రాజకీయాలకు బలం చేకూరేలా, మిత్ర శక్తుల చొరవ, స్వతంత్రతకు భంగం కలుగ నీయకుండా, ఒంటెత్తు పోకడలకు అవకాశం ఇవ్వకుండా ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించడంలో, నూతన మిత్ర శక్తులను సంపాదించడంలో చేసిన కృషి తెలంగాణ విప్లవోద్యమ పునర్వికాసానికి బాటలు వేసిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాల పై, రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా, ముఖ్యంగా గత కొద్ది సంవత్సరాలుగా బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా రాష్ట్ర, దేశ వ్యాపిత వామపక్ష, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను సమీకరించుకొని వారితో కలిసి పని చేస్తూ విప్లవోద్యమంపై వారి విశ్వాసాన్ని పెంచాడు. ఆచరణలో జరిగే లోపాలను అర్థం చేసుకొని, విమర్శలను స్వీకరించి సరిదిద్దుకోవడంలో ఆయన అనుసరణీయమైన విప్లవ చైతన్యాన్ని ప్రదర్శించేవాడు.

5. పత్రికల నిర్వహణ, విప్లవ రాజకీయాల ప్రచారం రెండింటిలోను ఆనందన్నకు విశేష అనుభవం ఉంది. విప్లవ రాజకీయ ప్రచారానికి ఉన్న ప్రధాన్యతను వివిధ స్థాయిల పార్టీ కమిటీలతో, సంపాదక మండలిలతో చర్చించి పత్రికలు, విప్లవ సాహిత్యం రెగ్యులర్ వెలువరించేలా చూసేవాడు. 2000 తరువాత క్రాంతి ప్రచురణలుగా వెలువడిన **'నిషేధిత'** విప్లవ సాహిత్యంలో ఆయన కృషే ప్రధానం. ఆనందన్న సీ.ఆర్.బీ. ఇంచార్జ్‌గా ఉన్నంతకాలం 'క్రాంతి' పత్రికకు ప్రధాన సంపాదకుడుగా ఉంటూ పత్రికా నిర్వహణ, సంపాదక మండలికి రాజకీయ మార్గదర్శకత్వం ఇవ్వడంతో పాటు అనేక వ్యాసాలు రాశాడు. పత్రికా నిర్వాహకులతో ప్రజాస్వామికంగా ఉంటూ, వారిని రాజకీయంగా ఎదిగించుకునేందుకు కృషి చేశాడు. గత 2 సంవత్సరాలుగా పీపుల్స్ మార్చ్ (ఇంగ్లిష్) పత్రిక బాధ్యతను, పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా బాధ్యతలను నిర్వర్తిస్తూ జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై పార్టీ వైఖరిని ఎత్తిపడుతూ వ్యాసాలు, ప్రకటనలు ఇచ్చాడు. మార్క్సిస్టు ప్రామాణిక రచనల అధ్యయనం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టే ఆనందన్న ఇతరులను కూడా అటు వైపు ప్రోత్సహించేవాడు. తానొక వ్యక్తిగా కాకుండా పార్టీ నిర్మాణంలో భాగంగా ఉంటూ, సమష్టితత్వంతో అన్ని పనులు పూర్తయ్యే విధంగా చూసేవాడు.

ఆనందన్న సిద్ధాంత, రాజకీయాల అధ్యయనంతో పాటు కళా సాహితీ సాంస్కృతిక విషయాల పట్ల ఆసక్తిపరుడు. అభిమాని. సాహితీరంగంలోని మంచి చెడులను విశ్లేషించి, రచయితల మనోభావాలు దెబ్బతినకుండా సున్నితంగా వారి ముందుంచేవాడు.

భారత వివిప్లవోద్యమంలో ఆయుధాల తయారీతో సహా అనేక రంగాలను గైడ్ చేసిన అనుభవం, వివిధ ప్రాంతాలలో పని చేసిన అనుభవం ఉన్న ఆనందన్నలో చొరవతో కూడిన మిలటరీ, రాజకీయ నైపుణ్యాలు వున్నాయి. సిద్ధాంత రాజకీయ అధ్యయనం ఇచ్చిన లోతైన విశ్లేషణా జ్ఞానంతో పాటు అనుభవ జ్ఞానం వలన వచ్చిన వినయం ఉద్యమ పురోగమనంలో ఆనందన్నను దక్షత గల నాయకుడుగా నిలబెట్టి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాయి.

విద్యార్థిరంగం నుండి వచ్చి చిన్న వయస్సులోనే అమరుడైన కామ్రేడ్ వివేక్‌లోని చురుకుదనాన్ని చూసి ఆనందించాడు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన కొత్త యువతరాన్ని చూసి వారితో తన భావాలను, అనుభవాలను పంచుకున్నాడు. వారిని రాజకీయంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. 1974లో విద్యార్థి రంగం నుండి విప్లవోద్యమంలోకి వచ్చిన ఆనందన్న 50 సంవత్సరాల ఆర్.ఎస్.యూ. చరిత్రను రాయడానికి సీసీ ముందు ప్రతిపాదించి, చొరవగా తానే ఆ బాధ్యతను తీసుకొని అర్థాంతరంగానే భౌతికంగా మన మధ్య లేకుండా పోయాడు. ఆర్.ఎస్.యూ. చరిత్ర రచనతో పాటు ఇంతకాలం ఆయన నిర్వర్తిస్తూ వచ్చిన అన్ని కర్తవ్యాలను ఇకపై పూర్తి చేయాల్సింది మనం, మన భావి తరాలే.

తనకు వర్గ పోరాట రాజకీయాలను నేర్పిన విప్లవమాతగా సీనియర్ పార్టీ సభ్యురాలు గజ్జెల లక్ష్మమ్మను, అమరులు శ్యాం, గంగారాంలతో కూడిన తన విప్లవ ప్రస్థానాన్ని ఎప్పుడూ గుర్తు చేసేవాడు. ఆనందన్న అమ్మ చనిపోయినపుడు ఆర్తితో తన జ్ఞాపకాలను సోదర కామ్రేడ్స్‌తో పంచుకున్నాడు. వాటికి అక్షర రూపం ఇచ్చి విప్లవ పత్రికలకు అందించాడు.

**తరువాయి 14వ పేజీలో**

# అంతర్జాతీయ కార్మికవర్గ పోరాట విప్లవ నాయకుడు, ఉపాధ్యాయుడు కామ్రేడ్ ఆనంద్ అమరుడు

**నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ 15 జూన్, 2023**

అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో భాగంగా నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ (ఎన్.డీ.ఎఫ్.పీ) 'కామ్రేడ్ ఆనంద్' (కటకం సుదర్శన్)కు అత్యున్నత శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. కామ్రేడ్ ఆనంద్ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వ క్యాడర్, భా.క.పా (మావోయిస్టు) కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు. జాతీయ, సామాజిక విముక్తి కోసం భారతదేశ పోరాటంలో అత్యంత ముఖ్యమైన మార్గదర్శక వ్యక్తిగా ఉన్నారు.

1970లలో నక్సల్ ఉద్యమంలో చేరక ముందు కామ్రేడ్ ఆనంద్ ఉపాధ్యాయునిగా ఉన్నారు. (ఇది సమాచారం లోపం-సం). ఐదు దశాబ్దాల కాలం పాటు భారత విప్లవానికి చెక్కుచెదరని సేవలు అందించారు. దండకారణ్యం ప్రాంతంలో సాయుధ విప్లవాన్ని విస్తరించడం లో నాయకత్వ పాత్ర వహించారు. భారత భద్రతా బలగాలకు గట్టి దెబ్బలు ఇచ్చిన గెరిల్లా యుద్ధతంత్రంపై బలమైన పట్టుకు కామ్రేడ్ ఆనంద్ పేరు పొందారు.

దాదాపు రెండు దశాబ్దాల పాటు మధ్య రీజనల్ బ్యూరోకు కార్యదర్శిగా, పార్టీ విప్లవ పత్రిక పీపుల్స్ మార్చ్‌కు ఒక నాయకత్వ బాధ్యునిగా ఆయన భారత విప్లవ పోరాటం ప్రపంచవ్యాప్త గుర్తింపు, ప్రాముఖ్యత గడించేందుకు దోహదం చేశారు.

కామ్రేడ్ ఆనంద్ అస్తమయం తాయ్ పర్వతం కంటే ఎత్తైనది. సామ్రాజ్యవాదానికి, సమస్త ప్రతిఘాతుకతకు వ్యతిరేక పోరాటంలో ఆయన విజయాల నుంచి, చెరిగిపోని పాఠాల నుంచి ఎన్.డీ.ఎఫ్.పీ, యావత్తు ఫిలిప్పీన్ విప్లవోద్యమం ప్రేరణ పొందుతుంది. ఆయన వారసత్వానికి విప్లవ నాయకునిగా, నైపుణ్యమైన గెరిల్లా కమాండర్‌గా, అంతర్జాతీయ కార్మికవర్గ పోరాట గొప్ప ఉపాధ్యాయునిగా నిరంతరం పురోగమిస్తున్న భారత విప్లవం ఒక స్పష్టమైన సూచిక.

కామ్రేడ్ ఆనంద్ వర్ధిల్లాలి!

భాకపా (మావోయిస్టు) వర్ధిల్లాలి!

అంతర్జాతీయ కార్మికవర్గ పోరాటం వర్ధిల్లాలి! ★

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ఆనంద్ అమరత్వంపై

**అఫ్ఘనిస్తాన్ (మావోయిస్టు) కమ్యూనిస్టు పార్టీ**

ప్రియమైన కామ్రేడ్స్,

భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ ఆనంద్ కన్నుమూత అనే అత్యంత విచారకరమైన సందేశం మాకు అందినది. 69వ యేటా గుండెపోటుతో కన్ను మూసిన ఆయన అకాల మరణం పట్ల మేం సంతాపాన్ని ప్రకటిస్తున్నాం. భారతదేశంలో సామ్రాజ్యవాదాన్ని, ప్రతిఘాతుకత్వాన్ని విప్లవ పోరాటాల ద్వారా ఎదిరించడానికి కామ్రేడ్ ఆనంద్ నిస్వార్థంగా అంకితమయ్యాడు. ఆయన లేని ఈ విషాదకర పరిస్థితులలో, మేం మా తీవ్ర సంతాపాన్ని తెలియచేస్తూ ఆయన సహచరులతో, కుటుంబంతో ఆయన లేని తీవ్ర లోటును పంచుకుంటున్నాం.

కామ్రేడ్ ఆనంద్ ఒక దృఢమైన కార్మికవర్గ విప్లవకారుడిగా ఎదిగాడు. 1978 నుండి 2023 వరకు తనదైన చలించని కమ్యూనిస్టు వారసత్వాన్ని మనకు వదలి వెళ్లాడు. ఆయన విప్లవ సేవలు కేవలం భారత విప్లవోద్యమాన్ని పరిరక్షించడానికే కాదు, ఆయన సైద్ధాంతిక అవగాహనలు కార్మికవర్గ అంతర్జాతీయతకు ఎంతగానో తోడ్పడినాయి. ఆయన అచంచలమైన అంకితభావం బలమైన భారత ప్రజాయుద్ధానికి మరింత సత్తువ నిచ్చి అంతర్జాతీయ మావోయిస్టు ఉద్యమ పునాదులను గట్టిపరిచింది,

కామ్రేడ్ ఆనంద్‌కు మనమంతా కలిసి దుఃఖంతో వీడ్కోలు చెప్పినట్టే సమష్టిగానే మనం మన బాధను ప్రజా వ్యతిరేకులపై ఒక నూతన సంకల్పంగా మలచుకొని విప్లవ స్ఫూర్తిని ఎత్తిపడుదాం. న్యాయం, సమానత్వం కోసం నిబద్ధతతో సాగుతున్న పోరాటంలో మేం మా దృఢమైన సంఘీభావాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కామ్రేడ్స్‌తో మరోమారు ఈ కీలక సమయంలో పంచుకుంటున్నాం.

కామ్రేడ్ ఆనంద్ స్మృతులు మాకు మా కష్టాలలో ప్రేరణనిచ్చే ఒక ప్రోత్సాహక వనరుగా వుంటాయి. కామ్రేడ్ ఆనంద్ చెరిగిపోని వారసత్వాన్ని గౌరవిస్తూ ఆయన ఏ లక్ష్య సిద్ధి కోసమైతే నిస్వార్థంగా అంకితమయ్యాడో దానిని ముందుకు తీసుకెళ్లడానికి మనం సమష్టిగా కృషి చేద్దాం.

సంఘీభావంతో,

అఫ్ఘనిస్తాన్ కమ్యూనిస్టు (మావోయిస్టు) పార్టీ,

27 జూన్, 2023.

★

# అమరుల సంస్మరణ, రాజకీయ ఖైదీల విడుదల డిమాండ్‌తో కేంపెయిన్ చేపట్టండి

భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ యూనిట్లు ఏ దేశాలలోనైతే పని చేస్తున్నాయో, అక్కడ చిన్నా, పెద్ద చర్యలతో భారత, ఫిలిప్పీన్స్ ప్రజాయుద్ధాలలో అమరులైన వారి సంస్మరణలో జులై మాసాంతం జులై 1 నుండి కేంపెయిన్ చేపట్టండి. ఆ కేంపెయిన్‌లో రాజకీయ ఖైదీల విడుదల డిమాండ్‌ను కూడ తీసుకోండి. గత కేంపెయిన్‌ల కొనసాగింపులో భాగంగా, పురోగామి కార్మికులతో, పోరాట ప్రజలతో, వారి వర్గ స్వభావానికి తగినట్టు కేంపెయిన్ చేపట్టండి. ఇటలీలో వర్గ కార్మిక సంఘాలతో, మహిళా ఉద్యమ శక్తులతో, శ్రామికులతో, భారత, ఫిలిప్పీన్స్‌ల నుండి వలస వచ్చిన మార్క్సిస్టు లెనినిస్టు – వాళ్లు ఇంకా మావోయిస్టులు కాలేదు – యువజన సంఘాలతో సామాజిక కూడళ్లలో కార్యక్రమాలను నిర్వహించడం చాలా ముఖ్యం. వాళ్లు ఇంకా మావోయిస్టులు కానప్పటికీ, రాజకీయ ఖైదీల విడుదల, భారత ప్రజా పోరాటాలకు వారి సమర్థనను అందించేవారైతే మనం సంవాదాలు చేయడం అవసరం. ఇటలీ, గెలీషియా, కొలంబియా, ఫిలిప్పీన్స్, ఫిలిప్పీన్స్ వలస కార్మికులు వున్న టునీషియా, అఫ్ఘానిస్తాన్, ఇరాన్, బంగ్లాదేశ్, టర్కీ, జర్మనీ, బెల్జియం, స్విట్జర్లాండ్, నార్వే, రష్యా, ఆస్ట్రియా, గ్రేట్ బ్రిటన్‌లలో మనం చర్యలకు, సంఘీభావ ప్రకటనలకు పూనుకోవచ్చు. ఉరుగ్వే, నేపాల్, శ్రీలంక, పాలస్తీనా, బల్గేరియా, గ్రీస్, చైనా దేశాలు చర్యలు లేకుండా సంఘీభావం అందిస్తాయి. ఐసీఎల్ (అంతర్జాతీయ కమ్యూనిస్టు లీగు)లో భాగమైన శక్తులు సంకీర్ణతతో ఈ కేంపెయిన్ నుండి వైదొలగడం అనేది ప్రధాన సమస్యగా వుంటుంది. ఎలాంటి చర్యలు లేకుండా వారి నుండి చాలా ఉత్తమమైన ప్రకటనలు ఇవ్వడం మేరకు వుంటుంది. భవిష్యత్తులో కూడ ఇలాగే వుంటుంది. అందుకు వారితో ఓపికతో కూడిన కృషి మనకు అవసరం. మన పిలుపులలో, వివరణలలో, రెండు పంథాల మధ్య పోరాటంలో ఈ వైఖరిని అవలంబించాలి. అంతర్జాతీయంగా ఈ కృషి సాధారణ వర్గ సంఘాలలో, ప్రజా వుద్యమాలలో కొనసాగాలి. అన్ని దేశాలలో ప్రత్యేకించి ఫ్రాన్స్‌లో యుద్ధ వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టాలి. ☆

స్వాగతం

# సంఘీభావ కమిటీ ఇచ్చిన సంస్మరణ మాసం పిలుపులో భాగమవుతున్నాం

పోరాటంలోని ఫిలిపినో ప్రజల మిత్రులుగా మేం, భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీ ఇచ్చిన సంస్మరణ మాసం పిలుపులో భాగస్వాములమవుతున్నాం. అందులో భాగంగా:

- ఫిలిప్పీన్స్, భారత విప్లవోద్యమ అమరులను సంస్మరించుకుందాం
- రాజకీయ ఖైదీల విడుదల కోసం నినదిద్దాం
- ఫిలిప్పీన్స్, భారత ప్రజాయుద్ధాలకు అండగా వుందాం.

ఫిలిప్పీనో, భారత ఉభయ దేశాల విప్లవకారులు సామ్రాజ్యవాద వ్యతిరేక విముక్తి ఉద్యమాలను కొనసాగిస్తున్నారు. అమెరికాలాంటి సామ్రాజ్యవాద శక్తులు వారి (అర్ధ) వలసల దోపిడీపై ఆధారపడివున్నారు. ఈ దేశాలలోని ప్రజలను వారు క్రూరంగా అణచివేస్తు, వనరులను కొల్లగొడుతు, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. కానీ, పీడిత దేశాల ప్రజలు సాయుధమై వారిని తిప్పికొడుతున్నారు. ప్రత్యేకించి సామ్రాజ్యవాద సంకెళ్లను ఆ దేశాలలోని ప్రజాయుద్ధాలు బలహీనపరుస్తూ వాటి అనివార్య పతనానికై అక్కడి వ్యవస్థలపై దాడులను తీవ్రతరం చేస్తున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, అంటే స్వేచ్ఛ, నిజమైన శాంతి కోసం పోరాటం.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అధికార ప్రతినిధి, అమరుడు కామ్రేడ్ ఆజాద్ అపహరణ జరిగి 13 యేళ్లు నిండుతున్న సందర్భంగా కేంపెయిన్ జులై 1 నుండి ప్రారంభం అవుతుంది. భారత ఫాసిస్టు బలగాలు తర్వాత ఆయన్ని చంపేశాయి. ఈ హత్య గత సంవత్సరం ఫిలిప్పీన్స్‌లో టియాంజోన్స్, మరో ఇద్దరు నాయకత్వ కామ్రేడ్స్ హత్యలను గుర్తు చేస్తున్నాయి. సీ.పీ.ఐ. (మావోయిస్టు), సీపీపీ రెండూ విముక్తి పోరాటాలలో ముందుపీఠిన నిల్చి ముఖ్యమైన విప్లవ నాయకత్వాన్ని సమకూరుస్తున్నాయి.

సంఘీభావ సంస్థలాగా, ఫిలిప్పీనో, భారత ప్రజల, ప్రజాయుద్ధాల, ప్రపంచంలోని సమస్త సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల పక్షం సమరశీలంగా నిలబడడం మాకు చాలా ముఖ్యమైనది. ప్రజల విప్లవోద్యమాల ద్వార లభించే నిజమైన శాంతి కోసం శాంతి నిలబడడం మాకు చాలా ముఖ్యమైనది.

ఫిలిప్పీన్స్, భారత విప్లవాల కోసం అనేక మంది వీరోచిత అమరులు, రాజకీయ ఖైదీలు తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను ప్రజా సేవలో, వారి విముక్తి కోసం త్యజించారు. మేం ఆ వీరులను గౌరవిస్తూ, వారి విప్లవ స్ఫూర్తితో వారి లోటును తీరుస్తూ వారు కొనసాగించిన విముక్తి పోరాటాన్ని కొనసాగిస్తూ , సమర్థిస్తూ అందులో భాగస్వాములవుతాం.

విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరులు సదా స్మరణీయులే.

భారత ప్రజాయుద్ధం వర్థిల్లాలి.

ఫిలిప్పీన్స్ ప్రజాయుద్ధం వర్థిల్లాలి.

ఫిలిప్పీన్స్, భారత రాజకీయ ఖైదీలను తక్షణం విడుదల చేయాలి. ☆

# భారత, ఫిలిప్పీన్స్ ప్రజాయుద్ధ అమరుల గౌరవార్థం చేపట్టిన అంతర్జాతీయ కేంపెయిన్ కర్తవ్యాలు

కేంపెయిన్ పూర్తయిన వెంటనే ఈ నివేదికను అంతర్జాతీయ కమ్యూనిస్టు మూవ్‌మెంట్ కు, ప్రత్యేకించి భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీకి సమర్పించనందుకు మేం క్షంతవ్యులం. కేంపెయిన్ ముగిసిన రోజులలోనే మా ప్రియమైన కామ్రేడ్ జైమే రంగేల్ కన్ను మూయడం మీకు తెలిసిందే. ఆయన మరణంతో అనేక బాధ్యతలు ప్రభావితమైనట్లే ఈ పని కూడ అయింది.

మేం ఆ బాధను శక్తిగా మలచుకోవడానికి ఘర్షణ పడుతూ ఆ కామ్రేడ్ బోధించినట్లు వివిధ కర్తవ్యాలను క్రమశిక్షణతో కొనసాగిస్తున్నాం. క్రమశిక్షణను పాటించడంలో, అంతర్జాతీయ వ్యవహారాల పట్ల శ్రద్ధ పెట్టడంలో ఆయన నిష్ణాతుడు.

మేం జూలై 1కి రెవల్యూషన్ ఒబెరా వెబ్‌సైట్‌పై పేర్కొన్నట్టుగానే, వ్యాన్‌గార్డు ఒబెరా రూపొందించిన అంతర్జాతీయ కేంపెయిన్, ప్రత్యేక కార్యక్రమ కర్తవ్యాల ప్రాధాన్యతను పేర్కొంటూ మా అధికార ప్రతినిధి పిలుపునిచ్చారు.

కేంపెయిన్ మాసం సందర్భంగా అధికారిక పోస్టర్‌ను తయారుచేసి వివిధ సైట్లపై వుంచాం. ఈ విషయాన్ని విప్లవ ఒబెరా పోర్టల్ కూడ తన నెట్వర్క్‌పై పేర్కొంది. కొలంబియా ట్విట్టర్ అకౌంట్‌పై కూడ వుంచారు.

కేంపెయిన్ ముగింపు సందర్భంగా జులై 28నాడు, బొగోటా నగరంలో అమెరికా దౌత్య కార్యాలయం ముందు ప్రదర్శన జరిగింది. అందులో తాము అనుభవిస్తున్న ప్రత్యేక సమస్యలతో ఈ కేంపెయిన్ ను జోడిస్తూ స్పందించిన కార్మికులు పాల్గొన్నారు. పెప్సికో, జీ4ఎస్ మున్నగు సామ్రాజ్యవాద కంపెనీలలో దినసరి కూలీపై పని చేస్తున్నవారు తమ వేదనాభరిత జీవితాలను పేర్కొన్నారు.

భారత, ఫిలిప్పీన్స్ దేశాలలోని పేద రైతాంగం అనుభవిస్తున్న పరిస్థితులను ప్రదర్శన సందర్భంగా కొలంబియాలోని కార్మికులు తమ నిర్దిష్ట అనుభవాలతో పంచుకున్నారు. కొలంబియా, ఇండియా, ఫిలిప్పీన్స్ దేశాలలోని రాజకీయ ఖైదీల విడుదలను నినదించారు. ఆ విధంగా, "ప్రపంచానికి మరో వైపున" సహోదరులు కొనసాగిస్తున్న ప్రజాయుద్ధాలకు సంఘీభావాన్ని అందించాల్సిన ప్రాధాన్యతను, ప్రపంచ శ్రామికుల, ప్రజల ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమైక్యతను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను ప్రదర్శన ప్రతిబింబించింది.

కామ్రేడ్స్, అంతర్జాతీయ నిబద్ధతకు కట్టుబడి కమ్యూనిస్టు సంస్థకు ఉపయోగపడేవాటిని మేం నిరంతరం కొనసాగించడానికి పూనుకుంటాం.









11 వ పేజీ తరువాయి

కామ్రేడ్స్ రామన్న, సాకేత్, దీపక్, లక్మా సహ వేలాది అమరుల విప్లవసేవలు శ్లాఘనీయమనీ కేడర్‌కు ధైర్యం చెబుతూ, వాళ్లంతా తుదివరకు ప్రజల మధ్య పని చేశారని, అనారోగ్యాలు, భీకర శత్రు దాడుల కారణంగా వారు మనకు దూరమయ్యారని చెప్పి వారి ఆశయసాధనలో ఆదర్శవంతంగా నడవాలని తుది సందేశంలోనూ కోరాడు.

చివరి రోజుల్లో మన తల్లి తండ్రులు మన గురించి ఏం ఆలోచిస్తారో అది మనకు వారిచ్చే సర్టిఫికేట్ అని, మన కార్యాచరణ వారూ మెచ్చేదిగా ఉండాలని, విప్లవోద్యమాన్ని మనం కొనసాగిస్తే వారు మనతోనే ఉంటారని బలంగా నమ్మాడు. కుటుంబానికి ఆ విధంగా చివరి సందేశం అందించాడు. విప్లవ ప్రజలు చరిత్ర నిర్మాతలని, పార్టీ మంత్రసాని పని మాత్రమే చేస్తుందని వినయంగా చెప్పాడు. ఆయనకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అందించిన ఈ గొప్ప పాఠాలు సదా ప్రేరణాదాయకంగానే వుంటాయి.

**జోహార్ కామ్రేడ్ ఆనందన్న , ఆనందన్న ఆశయాలను కొనసాగిద్దాం.** ★

# ఎన్.పీ.ఏ. ఎర్ర యోధులకు సీ.పీ.పీ. శ్రేణుల జేజేలు

ఫాసిస్టు బలగాలపై మాటుదాడిని జయప్రదం చేసిన '*నూతన ప్రజా సైన్యం*' (ఎన్.పీ.ఏ) ఎర్ర యోధులకు ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, విప్లవ శ్రేణులు జేజేలు పలుకుతున్నాయని ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫిలిప్పీన్స్ ఫాసిస్టు బలగాలైన 85వ బెటాలియన్ (ఐ.బీ)పై 2023 సెప్టెంబర్ 1న బరంగాయ్ యాపులాట్, టగ్కవాయన్, క్యూజాన్‌లో నూతన ప్రజా సైన్యం ఒక పెద్ద ఆంబుష్‌ను విజయవంతం చేసింది.

క్యూజాన్‌కు చెందిన ఎన్.పీ.ఏ. (అపోలోనియో మెండోజా కమాండ్) రిపోర్టు ప్రకారం కనీసం 5గురు ఫాసిస్టు ప్రభుత్వ సైనికులు మట్టి కరిచారు. 4గురు గాయపడ్డారు. 5 శక్తిమంతమైన ఆయుధాలు స్వాధీనమయ్యాయి. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనను బలోపేతం చేయడానికి ఆ ఆయుధాలు ఎన్.పీ.ఏ.కు ఉపకరిస్తాయి. క్వీజాన్ ప్రావిన్స్‌లోనూ, దేశం మొత్తంగానూ దీని ప్రభావం, ఉత్సాహం గొప్పగా ఉంటుంది. ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి నిస్తుంది. క్వీజాన్‌లో జరిగిన ఈ విజయవంతమైన ఎన్.పీ.ఏ. ఆంబుష్ ఫిలిప్పీన్స్ రైతులకు, విశాల ప్రజలకు సంతోషాన్ని కలిగించింది. సాయుధ బలగాలు చేసిన వేలాది చట్టవ్యతిరేక హత్యలకు, చిత్రహింసలకు, మిలటరీ స్థావరాల స్థాపనకు, అంతులేని నిర్బంధానికి, వైమానిక దాడులకు, ఇంకా ఇతర అనేక రకాల రాజ్య నిర్బంధానికి ఇది సరైన తీర్పుగా వారు తమ ఉత్సాహాన్ని పంచుకున్నారు.

ఈ మాటుదాడిని ఎక్కడో దూరంగా ఉన్న బైకోల్ ప్రాంతం నుండి వచ్చి చేసారనీ క్వీజాన్‌లోని ఎన్.పీ.ఏ. చేయలేదనీ, ఇది వారి ఆఖరి తెగింపు చర్య అనీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. క్వీజాన్‌లో ఇప్పటికే తిరుగుబాటుదారులు ఖాళీ అయ్యారు అని అబద్ధ ప్రచారం చేసుకుంటున్నది.

క్వీజాన్‌లో జరిగిన ఆంబుష్ ప్రభుత్వ బలగాలైన ఏ.ఎఫ్.పీ., ఎన్.టీ.ఎఫ్.లకు చెంపపై బలంగా కొట్టినట్లైంది. క్వీజాన్‌లోను, దేశంలోను రైతులు, విశాల ప్రజలు సాయుధంగా ప్రతిఘటిస్తారన్న సందేశాన్ని అందించింది. గత 2,3 దశాబ్దాలుగాను, నిన్న కూడా మార్కోస్ జాతీయ సలహాదారు '**మార్కోస్ పాలనలో ప్రతిఘటన పూర్తిగా నాశనమవుతుందన్న**' మాటల్లోని డొల్లతనం బయటపడింది.

ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ తన ప్రకటనలో ఎన్.పీ.ఏ. దేశవ్యాపితంగా సాయుధ ప్రతిఘటనను మరింత కసితో, పట్టుదలతో కొనసాగించాలని పిలుపు నిచ్చింది. ఎన్.పీ.ఏ.కి చెందిన అన్ని విభాగాలు రైతాంగంతో మరింతగా సమైక్యమై అనేక చిన్న, పెద్ద ఘటనలు, ఎత్తుగడల దాడులు చేయాలని, శత్రు ఏజెంట్ల నుండి తుపాకులు స్వాధీనం చేసుకోవాలని కోరింది.

యూ.ఎస్. మార్కోస్ పాలనలో రాజ్య బీభత్సపు ఆల్ అవుట్ క్యాంపెయిన్‌తో గ్రామీణ ప్రాంతాలను, భూములను కొల్లగొట్టే, విచ్ఛిన్నం చేసే మరియు మైనింగ్ కంపెనీలు, ప్లాంటేషన్స్ ద్వారా ఆర్థిక చౌరబాటుకు ఇతర ప్రాజెక్టులు నిర్మించాలన్న ఆలోచనలకు ఈ చర్యతో ఎదురు దెబ్బతగిలింది. సాయుధ ప్రతిఘటన అవసరాన్ని వేగవంతం, తప్పనిసరి అని ఈ చర్య నిర్ధారించింది.

యూ.ఎస్. మార్కోస్ పాలనలో మానవ సంహారం, మానవ హక్కుల ఉల్లంఘనలు కారణంగా ప్రజలకు ఎన్.పీ.ఏ.లో చేరడం తప్ప మరో దారి లేకుండా పోయింది. పీడకులను, దోపిడీ దారులను ఓడించి తమ హక్కులను కాపాడుకోవలసిన అవసరాన్ని ప్రజలు గుర్తించారు. సమాజాన్ని, దేశాన్ని విముక్తి చేయాలనే తమ ఆకాంక్షను, హక్కును ప్రజలు గుర్తించారు.




**( ప్రపంచమంతటా ప్రతీఘాతుకత పెచ్చరిల్లి పోతున్న ప్రస్తుత పరిస్థితులలో పిలిప్పైన్ దేశం క్వీజాన్ ప్రావిన్స్‌లో 2023 సెప్టెంబర్ మొదటి రోజున విజయవంతంగా ఆంబుష్ చేసిన నూతన ప్రజా సైన్యం కు 'క్రాంతిపత్రిక' విప్లవ జేజేలు పలుకుతున్నది.)** ★

ఎన్.పీ.ఏ. ఎర్ర యోధులకు సీ.పీ.పీ. శ్రేణుల జేజేలు

# యేడాది మార్కోస్ పాలనలో 97 మంది హత్య

ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ సమాచార బ్యూరో విడుదల చేసిన పత్రికా ప్రకటనను క్రాంతి పాఠకుల కోసం అనువదించి అందిస్తున్నాం. సం.మం.

ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ) వార్తా పత్రిక ఆంగ్‌బయాన్ నిన్న ఒక ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. జూన్ 15 వరకు చట్టవిరుద్ధ ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ తొలి సంవత్సర కాల పాలనలో కనీసంగా 97 మందిని ఫిలిప్పీన్స్ సాయుధ బలగాలు (ఏఎఫ్‌పీ), ఇతర రాజ్య ప్రాయోజిత శక్తులు నేరపూరితంగా హత్య చేశాయని అందులో పేర్కొంది. అంటే, గడచిన 12 మాసాల లోపే వారానికి ఇద్దరి చొప్పున హత్యకు గురయ్యారు.

ఈ హత్యలు అంతర్జాతీయ మానవీయ చట్టాల, యుద్ధ నియమాలతో పాటు సాయుధ ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాలలోని పౌరులకు, పోరాటకారులు కాని వారికి సమకూరిన ప్రత్యేక రక్షణ చర్యల ఘోర ఉల్లంఘనంటూ ఆ నివేదిక పేర్కొంది.

ఆంగ్‌బయాన్ ప్రకారం 19 ప్రాంతాలలో 62 రాజకీయ హత్యా సంఘటనలు నమోద య్యాయి. ఐదు నరసంహార సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటిలో ఇటీవలి కాలంలో జూన్ 14నాడు బరంగే బ్యూనావిస్టాలోని హిమాలయన్ నగరంలో ఫిలిప్పీన్స్ సాయుధ బలగాలకు (ఏఎఫ్‌పీ) చెందిన 94వ ఐబీ శక్తులు ఫాస్టో కుటుంబాన్ని క్రూరంగా హత్య చేసిన సంఘటన ఒకటి.

మార్కోస్ హంతక రాజ్యంలో 53 మందితో అత్యధిక బాధితులే రైతులే. గత 12 నెలలలో ఆరుగురు మైనర్లను కూడ హత్య చేశారని నివేదిక పేర్కొంది. **"ఐదు మాసాల గర్భవతి మహిళను కూడ సైనికులు ఫాసిస్టు దాడులలో ఉపేక్షించలేదు"** అని నివేదిక పేర్కొంది.

మొత్తం బాధితులలో నివేదిక ప్రకారం 47 మంది సైనిక నిర్బంధంలో అంతమొందారు. **"వారంతా హత్యకు ముందు అపహరణకు లేద చట్టవిరుద్ధ అరెస్టుల బాధితులై భౌతికంగా, మానసికంగా చిత్రహింసల పాలైనవారే".** మధ్యలో, ఎనిమిది మంది బాధితులు సైనికుల నిర్విచక్షణ కాల్పులలో అంతమొందారు.

సీపీపీ పత్రిక పేర్కొన్నదాని ప్రకారం నీగ్రోస్ ఒక్సిడెంటల్‌లో 31 మంది బాధితులతో అత్యధిక రాజకీయ హత్యలు జరిగాయి. తరువాతి స్థానం మస్బాటే, సమర్‌లలో 12-12 మంది బాధితులు నమోదయ్యారు.

"ఈ ప్రాంతాలు 2018లో ముందరి డుటెర్టె పాలనలో మెమొరాండం నంబర్ 32 కింద పరిగణించబడేవి. దాని మూలంగా చాలా ప్రభావయుతంగా అదనపు సైనిక బటాలియన్‌లను నీగ్రోస్ ద్వీపకల్పం, తూర్పు విసయాస్ ప్రాంతం, బైకోల్‌లలో మొహరించారని", నివేదిక పేర్కొంది.

2022 నవంబర్ అత్యధిక సంఖ్యలో 16 మందిని హత్య చేసినట్లు, 2023 మేలో 15 మందిని హత్య చేసినట్లు నివేదిక తెలిపింది.

"ఫిలిప్పీన్స్ సాయుధ బలగాలు జనావాసాలలో సైనిక చర్యలపై కేంద్రీకరించినపుడు, కమ్యూనిస్టు సహాయ కార్యక్రమం అనే కొత్త పద్ధతిని ప్రవేశపెట్టినపుడు అధిక కేసులు నమోదయ్యాయి" అంటూ నివేదిక చెప్పింది.

★

41వ పేజీ తరువాయి

స్త్రీ-పురుష సమానతను వ్యతిరేకించే; మహిళలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను నిరాకరించే దాని కరుడుగట్టిన పితృస్వామిక భావజాలం తెలిసినదే.

సామ్రాజ్యవాద, సీబీబీ ప్రయోజనాల పరిరక్షణ కోసం దేశంలోని చిన్న, మధ్య పెట్టుబడిదార్లను అణచివేస్తూ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను, చిన్న వ్యాపారస్తులను దెబ్బతీసి దేశ పారిశ్రామిక పురోగతిని అడ్డుకున్న చరిత్ర దానిది.

ఆదివాసీ, దళిత, తదితర శ్రామిక ప్రజా సముదాయాల చారిత్రక ప్రజా పోరాటవీరుల చరిత్రలను హైందవీకరిస్తూ తనలో కలిపేసుకుంటున్న అవకాశవాద కుట్ర దానిది. భగత్‌సింగ్, అంబేద్కర్, బిర్సాముండా తదితర చారిత్రక పోరాట వీరులు, వ్యక్తుల జయంతి, వర్ధంతులను జరిపే నైతిక హక్కు దానికి లేదు. జనజాతీయ గౌరవ్ దివస్ పేరుతో ఆదివాసుల అస్తిత్వాన్ని రూపుమాపే కుట్రలను చేస్తుంది.

రాజ్యాంగ సంస్థలన్నింటిలో పథకం ప్రకారం హిందుత్వ శక్తులను నింపివేస్తూ, వీటన్నింటిని తన రాజకీయార్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ తన వ్యతిరేకులందరిపై, ప్రతిపక్షాలపై వాటితో దాడులు చేయిస్తున్నది. హిందూ రాష్ట్ర ఏర్పాటుకు తోడ్పడేలా అది రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు చేస్తూ ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక ఫాసిస్టు చట్టాలను రూపొందిస్తూ అది ప్రజలపై ఫాసిస్టు దాడులకు తలపడుతుంది. మనుధర్మ స్మృతిని, భగవద్గీతను దేశ రాజ్యాంగంగా మార్చే కుట్ర చేస్తున్నది. దేశ రాజ్యాంగంలో నామమాత్రంగానయినా మిగిలిన సమాఖ్య (ఫెడరల్) విధానాలను రద్దుచేసి, నిరంకుశ, ఏకీకృత రాజ్యాన్ని (ఆటోక్రటిక్ యూనిటరీ స్టేట్) ఏర్పాటు చేయడం కోసం అది ప్రయత్నాలు చేస్తున్నది.

విప్లవోద్యమం బలంగా వున్న ప్రాంతాలలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు సంఘ్ పరివార్ విస్తరణ, దేశవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న దాని దాడులు, ముస్లిం మతస్థుల ఆస్తులను బుల్డోజర్‌లతో ధ్వంసం చేస్తున్న దాడులు పెరిగిపోతున్నాయి.

**దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని తుదికంటా ఓడించడానికి కార్మిక వర్గం నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడమే ఒక ప్రాతిపదిక అవుతుంది.**

★

# ఫిలిప్పీన్స్ దేశంలోని నీగ్రోస్ ఐలాండ్‌లో రైతుల రక్తం పారుతోంది

2023 రెండవ భాగంలో (ఏప్రిల్-జూన్) లో ప్రభుత్వ యంత్రాంగం, సాయుధ బలగాలు సంయుక్తంగా హింసాకాండకు తలపడ్డాయి. ఫిలిప్పీన్స్ ఆర్మ్‌డ్ ఫోర్స్, నేషనల్ ఫోర్స్, నేషనల్ టాస్క్ ఫోర్స్‌లు సంయుక్తంగా నూతన ప్రజాసైన్యాన్ని (ఎన్.పీ.ఏ.ని), మొత్తం విప్లవోద్యమాన్ని ఈ సంవత్సరం చివరి నాటికి పూర్తిగా తుడిచివేయాలనే సంకల్పంతో పని చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాన్ని విపరీతంగా సైనిక బలగాలతో నింపి ప్రజలలో భయ బీభత్స వాతావరణాన్ని, సృష్టిస్తున్నారు.

2023 ఏప్రిల్ నుండి జూన్ వరకు 92 మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగి 3 వేల మంది ప్రజలు ఫాసిస్టు ప్రభుత్వ బలగాల హింసా-దౌర్జన్యాల బాధితులు అయ్యారని 'అంగ పగిమకాస్' డాక్యుమెంటు పేర్కొన్నది. గతంలో ప్రభుత్వం అంగీకరించి రూపొందించుకున్న 'సమగ్ర మానవ హక్కుల పరిరక్షణా ఒప్పందం, అంతర్జాతీయ మానవీయ చట్టాల పాలన' (కాంప్రహెన్సివ్ అగ్రిమెంట్ ఆన్ రెస్పెక్ట్ ఫర్ హ్యూమన్‌రైట్స్ అండ్ ఇంటర్‌నేషనల్ హ్యూమాని టేరియన్ లా-సీ.ఏ.ఆర్.హెచ్.ఆర్.ఐ.హెచ్.ఎల్)అవగాహనకు ఇవి ఉల్లంఘనలు. యూ.ఎస్., మార్కోస్-2 పాలనలో నీగ్రోస్ ఐలాండ్ కోసం మొదటి సంవత్సరం చేసుకున్న ఒప్పందం ఫలితమే ఈ దాడులు అనేది గమనార్హం.

2023 మొదటి భాగం కన్నా, రెండవ భాగంలో ప్రతిఘాతుక దాడులు మరింత తీవ్ర తరమయ్యాయి. ఏ.ఎఫ్.పీ. చీఫ్ జనరల్ ఆంద్రిన్ సెంటినో మే నెలలో నీగ్రోస్ ఐలాండ్‌కు వచ్చి 'ఈ సంవత్సరం చివరికి ఎన్.పీ.ఏ.ని పూర్తిగా రూపుమాపుతా'మన్నాడు. కాని వాస్తవంలో, సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని చంపడం, భౌతికంగా హింసించడం, చట్ట వ్యతిరేకంగా నిర్బంధించడం, వేధించడం లాంటి అనేక దుశ్చర్యలకు పాల్పడుతున్నారు.

ఇప్పటికే దేశంలోని మధ్య, దక్షిణ భాగాల్లో ఎన్.పీ.ఏ. బలహీనపడిందని ఏ.ఎఫ్.పీ ప్రకటించినప్పటికి ప్రభుత్వ సాయుధ బలగాలను అదనంగా దించుతునే ఉన్నారు. ఉత్తర, దక్షిణ, తూర్పు భాగాల్లో ఎన్.పీ.ఏ. తుడిచి పెట్టుకు పోయిందని అంటూనే ఇప్పటికీ మిలటరీ బలగాలను వినియోగిస్తు ఎడతెరిపిలేని దాడులు చేస్తునే వున్నారు. కమ్యూనిటీలలోకి (జనసము దాయాలు) బెటాలియన్ సంఖ్యలో బలగాలు ప్రవేశిస్తునే ఉన్నాయి.

ఎన్.పీ.ఏ.ను వీలైనంత తొందరగా తుడిచి వేయడానికి అన్ని రకాల సాయుధ బలగాలు సిద్ధపడ్డాయి. వాళ్ళు రక్తసిక్తమైన ప్రతిఘాతుక క్యాంపెయిన్స్ చేపట్టారు. పోరాటకారులకు, పౌరులకు మధ్య నున్న తేడానైనా వాళ్ళు చూడడం లేదు. మీడియా ద్వారా, కిరాయి ప్రచార యంత్రాంగం ద్వారా తప్పుడు సాక్ష్యాలు సృష్టించి, నాటకాలాడుతూ ప్రజలను మాయ చేస్తున్నారు.

రోగిలోపొసాదాస్ ఎన్.డీ.ఎఫ్.పీ. సలహాదారును, సహచరి లింగ్రేన్ మార్టు రిల్లాస్‌లను ఎత్తుకెల్లి హత్య చేసారు. తరువాత వారిద్దరూ ఏప్రిల్ 19న బ్రిగైలో ఎన్.పీ.ఏ.కు 94 ఐ.బీ., 62 ఐ.బీలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు ప్రకటించారు. సంతోల్ బినాల్, బగాన్ అనే ఇద్దరిని రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు ఏప్రిల్ 20న ప్రకటించారు. ఇంకా కనబడని వారి కోసం వారి కుటుంబాలు నిరంతరం వెదుకుతునే ఉన్నాయి. వారి జాడ దొరకడం లేదు. సంఘటన తాలూకు వాస్తవాలను పూడ్చిపెట్టి 303 బ్రిగేడ్ నిర్దయగా వ్యవహరిస్తున్నది.

2023 ఏప్రిల్-జూన్ మధ్య 10కిపైగా చట్ట వ్యతిరేక హత్యలు జరిగాయి. మధ్య ద్వీపకల్పంలో హత్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలు కేంద్రీకరించి జరిగాయి. కిరాతక ఫాసిస్టు 94వ ఐ.బీ, 62 ఐ.బీలు ఉంటున్న మధ్య ఐలాండ్‌లో ఇవి జరిగాయి. ఎన్.పీ.ఏ.కి బలమైన ప్రాంతంగా ప్రభుత్వ బలగాలు దీనిని గుర్తిస్తున్నాయి.

తాజాగా ఆగస్టు 5న నీగ్రోస్ ఐలాండ్‌లోని గుయిహోల్‌గాన్ పట్టణం, గ్రామాలపై సాయుధ బలగాలు బాంబింగ్ చేయడాన్ని ఆగస్టు 6న ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటనలో ఖండించింది. ఇది ప్రజల ప్రాణాలకు, పంట పొలాలకు నష్టం చేయడం, వారి ద్రవ్యవరమైన హక్కులను, ప్రాణాలను కొల్లగొట్టడమే అని నిరసించింది. స్థానిక ప్రజలు కూరగాయలు పండించుకుంటున్న భూములపై 62వ బెటాలియన్ ఉదయం 5 గంటల నుండి 6.30 గంటల వరకు బాంబింగ్ చేసింది. ఫలితంగా, ప్రజలు, పశువులకు రక్షణ లేకుండా పోయింది.

2023 ఏప్రిల్-జూన్ మధ్య 92 మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయనీ, 3వేల మందికి పైగా బాధితులు నిర్బంధానికి గురయ్యారనీ, 50 మందికి పైగా మైనర్లను వేధింపులకు గురిచేశారనీ అంటున్నారు.

మార్కోస్ మొదటి సంవత్సరం నిర్బంధంలో 300 ఘటనల్లో 3 వేల మంది బాధితులున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

1. 94వ బెటాలియన్ చేసిన హక్కుల ఉల్లంఘనలు 24, ఆ సంఘటనల్లో బాధితులు 1,418 మంది.

2. 62వ బెటాలియన్ చేసిన 40 సంఘటనల్లో బాధితులు 1,315 మంది.

3. 15వ బెటాలియన్ చేసిన 11 సంఘటనల్లో బాధితులు 358 మంది.

4. 11వ బెటాలియన్ చేసిన 15 సంఘటనల్లో బాధితులు 466 మంది ఉన్నారు.

ఇలా వందల ఉల్లంఘనలు జరిగి పౌరుల మాన ప్రాణాలకు, స్థిర-చరాస్తులకు ప్రమాదం ఏర్పడింది. ఈ ప్రతిఘాతుక దాడులను విప్లవోద్యమం, ప్రజలు ప్రతిఘటించక తప్పదు.

★

# ఫ్రాంక్ ఫెర్నాండేజ్, అతని సహచరి క్లియోఫెల శిక్షలను ఖండించండి

నోట్: ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన సమాచార అధికారి (అధికార ప్రతినిధి) మార్కోఎల్. వల్బ్నా జూన్ 29నాడు విడుదల చేసిన ప్రకటనను యధాతథంగా క్రాంతి పాఠకుల కోసం అనువదించి అందిస్తున్నాం. సం.మం.

ఈరోజు విప్లవ ప్రతిఘాతుక కోర్టు ఫిలిప్పీన్స్ జాతీయ ప్రజాస్వామిక వేదిక (ఎన్.డీ.ఎఫ్.పీ) శాంతి సలహాదారు ఫ్రాంక్ ఫెర్నాండేజ్, అతని భార్య క్లియోఫె లాగ్టపాన్‌లు చట్ట వ్యతిరేకంగా ఆయుధాలు కలిగివున్నారనే పూర్తిగా నిరాధారమైన ఆరోపణలపై శిక్ష విధించడాన్ని పార్టీ, సమస్త విప్లవ శక్తులు ఖండిస్తున్నాయి. 2000ల నుండి ఇటీవలే కొద్ది సంవత్సరాల క్రితం ఆయన విశ్రాంత జీవనం పొందేవరకు ఫెర్నాండేజ్ నీగ్రోస్‌లో ఎన్.డీ.ఎఫ్.పీకి అధికార ప్రతినిధిగా కొనసాగాడు.

75 సంవత్సరాల ఫెర్నాండేజ్, 69 ఏళ్ల లాగ్టపాన్‌లను 24 మార్చ్, 2019 నాడు లాగునాలోని లిలివ్‌లో అరెస్టు చేసే సమయానికి వారు అనేక వ్యాధులతో బాధపడుతు చికిత్స పొందుతున్నారు. ఆ వృద్ధ జంట వద్ద మారణాయుధాలు, విస్ఫోటకాలను పొందుపరిచి, అవి వారు కలిగివున్నారనడం ఎంత అప్రతిష్ఠాకరమైన ఆరోపణలనేది తెలిసినప్పటికి వారి అరెస్టుకు సాధికారతను కల్పించడానికి రాజ్య శక్తులు ఆ పని చేశాయి.



వాస్తవాలపై శీతకన్ను వేసి టాగైగ్ నగరంలో జరిపిన విచారణను మేం ఖండిస్తున్నాం. విప్లవోద్యమంలో భాగమైన విప్లవకారులపై లేద ప్రజలపై "ఉగ్రవాదులకు సహాయం" అందిస్తున్నారనే బాధకరమైన ఆరోపణలను మోపుతూ నేషనల్ టాస్క్ ఫోర్స్-ఇల్కాక్ టాగైగ్ కోర్టుపై వత్తిడి చేసి విన్పించిన కోర్టు తీర్పు ఒక "న్యాయపర దాడి".

ఫెర్నాండేజ్‌ల దంపతులకు విధించిన శిక్ష ఫిలిపినో ప్రజల దేశభక్తియుత, ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచివేయడానికి మార్కోస్ పాలనలోని ప్రతిఘాతుక రాజ్యం తెంపరితనంతో విప్లవ, ప్రగతిశీల శక్తులను నేరస్థులను చేసి శిక్షలు విధించే విధాన కొనసాగింపులో భాగమే.

ఫిలిప్పీన్స్‌లో ఫెర్నాండేజ్, లాగ్టపాన్‌లు సహ 800 మంది రాజకీయ ఖైదీలకు న్యాయం జరుగాలనీ తక్షణం వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న వివిధ రంగాల వారితో, సంస్థలతో మేం భాగమవుతున్నాం. రాజ్య బీభత్సాన్ని అంతమొందించే వరకు, అణచివేత విధానాలు, విరామమెరుగని సైనిక దాడులు, ప్రభుత్వ విధానాల దాడుల పర్యవసానంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న హత్యలు, మానవ హక్కుల హననానికి చరమగీతం పాడాలనే పోరాటాన్ని కొనసాగించాలనీ పిలుపునిస్తున్నాం. ☆

# సీనియర్ కామ్రేడ్స్ అరెస్టులు, తప్పుడు మరణవార్తలను ఖండిస్తున్నాం

సీ.పీ.ఐ మావోయిస్టు కేంద్ర కమిటీ, పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ప్రమోద్ మిశ్రాను, బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ (ఎస్.ఏ.సీ.) సభ్యుడు కామ్రేడ్ అనిల్ యాదవ్‌లను ఆగస్టు 10న బిహార్ రాష్ట్రం గయా జిల్లాలో పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా అరెస్టు చేసినట్లు ప్రకటించారు. వారిపై పదుల సంఖ్యలో తప్పుడు కేసులు పెట్టి జైలులో నిర్బంధించారు. నిజానికి కామ్రేడ్ ప్రమోద్ మిశ్రా తప్పుడు కేసులలో 2009లో అరెస్టయి దశాబ్ద కాలానికి పైగా దేశంలోని అనేక జైళ్లలో వుండి నిర్దోషిగా బయటకి వచ్చాడు. ఆయన వయసు రీత్యా సీనియర్ సిటిజన్ శ్రేణిలోకి వస్తాడు. ఆయన ప్రజాసేవకు అంకితమైన విప్లవకారుడు. ఆయనను తప్పుడు కేసులలో అరెస్టు చేసి శారీరకంగా, మానసికంగా హింసించి, జైలుకు పంపడాన్ని మధ్య రీజినల్ బ్యూరో తీవ్రంగా ఖండిస్తున్నది. ఆయనను, ఆయనతో పాటు అరెస్టయిన కామ్రేడ్ అనిల్ యాదవ్‌ను తక్షణం బేషరతుగా విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీనియర్ కామ్రేడ్ తోట సీతారామయ్య (సమర్, ఆనంద్)తో పాటు విద్యార్థి పదం రాజకుమార్ (అమరేందర్)ను పోలీసులు ముందే అరెస్టు చేసి, కొన్ని రోజుల తర్వాత జులై 20న ఆంధ్రప్రదేశ్‌లోని చర్ల పట్టణ బస్టాండ్ వద్ద దొరికినట్లు ప్రకటించారు. చాలా వరకు జ్ఞాపకశక్తి కోల్పోయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సమర్ దాదాకు వెంటనే వైద్య సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉండగా పదుల కొద్ది కేసులు మోపి ఆయనను అన్ని రకాలుగా హింసించి, జైలుకు పంపడాన్ని సీఆర్‌బీ తీవ్రంగా ఖండిస్తున్నది. ముందు ఆయనకు అన్ని విధాలా చికిత్సను అందించి ఆయనపై మోపిన కేసులన్నీ ఉపసంహరించుకొని ఆయనను తక్షణం విడుదల చేయాలనీ, ఆయనతో పాటు విద్యార్థి పదం రాజ్‌కుమార్‌ను సైతం విడుదల చేయాలనీ డిమాండ్ చేయాల్సిందిగా విద్యార్థి, మేధావులకు, హక్కుల కార్యకర్తలకు మా మధ్య రీజినల్ బ్యూరో విజ్ఞప్తి చేస్తోంది.

సీనియర్ కామ్రేడ్ దేవేందర్ రెడ్డి (మాస దాదా) అరెస్టును ఖండించండి. బేషరతుగా ఆయనను విడుదల చేయాలనీ డిమాండ్ చేయండి. వయసు రీత్యా 60లలో వున్న కామ్రేడ్ దేవేందర్ రెడ్డి

గత కొన్నేళ్లుగా మధుమేహం, బ్లడ్ ప్రెషర్‌తో పాటు ఇటీవలి సంవత్సరాలలో కంటి చూపు పూర్తిగా దెబ్బతిని వైద్యం కోసం హాస్పటల్‌కు వెళ్ళి చికిత్స పూర్తి చేసుకొని విశ్రాంత జీవితం గడుపుతున్నాడు. తప్పుడు సమాచారంపై ఆయనను పోలీసులు ఇంటి వద్ద నుండి అరెస్టు చేసి చికిత్సకై వెళుతుండగా, మార్గమధ్యంలో వరంగల్ జిల్లా హనుమకొండలో సుబేదారి పోలీసులు ఏప్రిల్ 21, శుక్రవారం అరెస్టు చేసినట్లు ప్రకటించడాన్ని మా పార్టీ సీఆర్‌బీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఆయన గతంలో దాదాపు మూడేళ్లు వివిధ జైళ్లలో వుండి ఆయనపై వున్న అనేక తప్పుడు కేసులలో విచారించబడ్డాడు. కొన్ని కేసులు కొట్టుడుపోగా, పలు కేసులలో బెయిల్‌పై బయటికి వచ్చి ప్రజల మధ్య విప్లవ జీవితాన్ని గడిపాడు.

ఆ కామ్రేడ్‌పై మోపిన తప్పుడు కేసులన్నీ ఉపసంహరించుకొని వెంటనే ఆయనను విడుదల చేయాలనీ మా పార్టీ సీఆర్‌బీ డిమాండ్ చేస్తున్నది.

అనారోగ్య కారణాలతో 2023 ఆగస్టు మధ్యలో వైద్యం కోసం వెళ్ళిన కామ్రేడ్ అశోక్ రెడ్డి (బల్దేవ్)తో పాటు ఆయన జీవిత సహచరి కామ్రేడ్ రైమతిని మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌లో ఆగస్టు 20న ఏ.టీ.ఎస్. (ఉగ్రవాద వ్యతిరేక దళం) పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఆయన గతంలో ఆరేళ్లకు పైగా దేశంలోని పలు రాష్ట్రాల జైళ్లలో అమానవీయ పరిస్థితుల మధ్య గడపడంతో ఆయన ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. ఆయనపై అప్పుడే పోలీసులు పార్టీ రహస్యాలు చెప్పించడానికి విఫల నార్కో పరీక్షలు జరిపారు. పదుల కొద్ది తప్పుడు కేసులు పెట్టగా ఆయన వాటిలో నిర్దోషిగా నిరూపణై బయటకు వచ్చాడు. తన జీవితాన్ని పీడిత ప్రజల కోసమే అంకితం చేసిన విప్లవకారుడు కామ్రేడ్ అశోక్ రెడ్డి గత కొన్నేళ్లుగా ఆదివాసీ ప్రజల చట్టబద్ధ హక్కుల సాధన కోసం వారిని సంఘటితం చేస్తూ పోరాటాలు నిర్మిస్తున్నాడు.

ఆయన జీవిత సహచరి కామ్రేడ్ రైమతి ఆదివాసీ ప్రజల కోసం దాదాపు 24 సంవత్సరాలుగా వివిధ రూపాలలో విరామమెరుగని సేవలందిస్తున్నది. ఆమె ప్రధానంగా ఆదివాసీ పిల్లలకు ఒక అభిమాన ఉపాధ్యాయినిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆమె కూడ వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ తన జీవిత సహచరునితో చికిత్సకు వెళ్లింది. వారిని పోలీసులు అరెస్టు చేయడాన్ని సీ.ఆర్.బీ తీవ్రంగా ఖండిస్తూ ఆదివాసీ ప్రజల హక్కుల కోసం, వారి అభివృద్ధి కోసం అత్యంత అంకితభావంతో పని చేస్తున్న ఆ జంటకు మెరుగైన చికిత్సను అందించి వారిపై మోపిన కేసులన్నీ ఉపసంహరించుకొని వారిని బేషరతుగా విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తున్నది.



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ మల్లా రాజరెడ్డి, కాతా రాంచంద్రరెడ్డిలు అనారోగ్యాలతో మరణించినట్లు ఆగస్టు మూడవ వారంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిరాధారమైన తప్పుడు వార్తలను విస్తృతంగా ప్రచారం చేశారు. సీనియర్‌మోస్ట్ నాయకులలో ఒకరైన కామ్రేడ్ మల్లా రాజరెడ్డి ఇంటికి వెళ్లి మీడియా మిత్రులు ఆయన సోదరునితో, ఊరి వాళ్లతో ఆయన (తప్పుడు) మరణవార్తను పంచుకున్నారు. మరి కొన్ని ఛానళ్లు ఆ కామ్రేడ్స్ విప్లవ జీవితాలకు వున్న ప్రాధాన్యత, వారి అంకితభావం, వారి లోటును గాఢంగా అనుభూతి చెందుతూ పరిచయస్తులతో ఇంటర్వ్యూలు జరిపాయి. పోలీసులు సృష్టించిన తప్పుడు వార్తలతో విప్లవ శిబిరంలో కొద్ది రోజులు ఆందోళన నెలకొంది. వారి మిత్రులు, బంధువులు బాధాపరితప్త హృదయాలతో చివరిచూపు కోసం అమరుల శవాలైనా అందివ్వాలనీ కోరారు.

పోలీసులు సృష్టించిన నిరాధారమైన వార్తలను ఖండిస్తూ వాటి డొల్లతనాన్ని వెల్లడిస్తూ వారి ఫేక్ న్యూస్ బండారాన్ని బయటపెడుతూ అనేక వివరాలతో అనేక మంది మిత్రులు ముందుకు వచ్చారు. మీడియా ప్రచురించిన అమరుడి ఫోటో కామ్రేడ్ మల్లా రాజరెడ్డిది కాదనీ, అది 2012లో అమరుడైన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కామ్రేడ్ హరక్ (ఉత్తర్‌ప్రదేశ్ లోని గోరఖ్‌పుర్ వాస్తవ్యుడు)దేనని స్పష్టం చేశారు. వారందరినీ సీఆర్‌బీ అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలుపుతోంది.

పార్టీ కేంద్రకమిటీ విడుదల చేసిన ప్రకటనలో పోలీసులు సృష్టిస్తున్న పుకార్లను నమ్మవద్దనీ, విప్లవోద్యమంలో ఏ స్థాయి కామ్రేడ్ అసువులు బాసిన, అరెస్టయినా వెంటనే వీలు కాకపోతే, కాస్తా ఆలస్యంగానైనా పార్టీ ప్రకటిస్తుందనీ, అప్పటివరకు నిరాధారమైన వార్తలతో మోస పోకూడదనీ, పోలీసు వార్తలను నమ్మకూడదనీ, ఫేక్ న్యూస్‌తో గందరగోళపడకూడదనీ విప్లవ క్యాంపును కోరింది. విప్లవ పార్టీపై, విప్లవోద్యమంపై విశ్వాసాన్ని సన్నగింపచేసే కుట్రలతోనే పోలీసులు ఇలాంటి వార్తలను ప్రకటిస్తున్నారు. మా కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కటకం సుదర్శన్ అమరత్వ నేపథ్యంలో పోలీసులు దురుద్దేశపూర్వకంగానే ఇలాంటి వార్తలను, పుకార్లను పుట్టిస్తున్నారు. వీటిని మా పార్టీ సీఆర్‌బీ తీవ్రంగా ఖండించింది.

☆

# కార్పొరేటీకరణ ఫలితం మణిపూర్ విధ్వంసం

## మనువాదుల దాష్టీకాల పర్యవసానం మహిళల నగ్న ప్రదర్శన

మణిపూర్‌లోని కాంగ్పోక్పి జిల్లాలో ఇద్దరు మహిళల (తల్లీ, కూతురు) నగ్న ప్రదర్శన, వారి లో 21 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం నాగరిక ప్రపంచాన్ని కుదిపివేసింది. ఆమె 56 ఏళ్ల తండ్రిని, 19 ఏళ్ల సోదరున్ని కాల్చి చంపి కన్న తల్లి ఎదుటే, హిందుత్వ గూండాలు కూతురుపై అత్యాచారానికి పాల్పడ్డారు. తల్లితో పాటు కూతురును నగ్నంగా వందలాది మంది ఊరేగారు. ఆ ప్రదర్శనను చూపుతూ 26 సెకన్ల వీడియో జులై 19 నాడు వైరల్ కావడంతో మణిపూర్‌లో ఆధునిక ఆయుధాలను చేతపూనిన భద్రతా బలగాల రక్షణలో కార్పొరేటీకరణ ప్రయోజనాల కోసం మనువాదం ఎలా బుసలు కొడుతుందో నగ్నంగా వెల్లడైంది. "కనిపిస్తే కాల్చివేత" ఆదేశాలు, వేలాది మంది అదనపు భారత సైన్యాల మొహరింపు మధ్య ఈ ఘోర దారుణం జరిగిందంటే, వాళ్లంతా ఏ లక్ష్యంతో వున్నారు? ఎవరిని కాపాడుతున్నారు? ఎవరిని కాల్చివేస్తున్నారో ఆలోచించాల్సిన విషయాలు.

దేశంలోని దాదాపు 5,500కు పైగా ప్రముఖ ప్రజాహిత వేధావులు, రచయితలు, కళాకారులు, హక్కుల కార్యకర్తలు, సినీ దర్శకులతో కూడిన **"కన్సర్న్ సిటిజన్స్ ఆన్ మణిపూర్"** ఆ ఘటనపై చలించిపోయి తమ సంతకాలతో ఒక పత్రాన్ని గవర్నర్‌కు అందజేసి దానిని ప్రజల ముందుంచారు. అనేక హక్కుల సంఘాలతో, ప్రముఖులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీలు సభ్య సమాజం చలించిపోయే వాస్తవాలతో, గ్రౌండ్ రిపోర్టులను వెలికితీశాయి. మణిపూర్ మారణహోమంపై **యురోపియన్ పార్లమెంట్** స్పందిస్తూ భారతదేశంలో మైనార్టీలకు భద్రత కల్పించాలనీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మణిపూర్ గవర్నర్ అనసూయ ఉయికే ఇద్దరూ మహిళలు కావడమే కాకుండా ఆదివాసీలు కావడం, వారు మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలను కుకీ చొరబాటుదారులపై జరుగుతున్నవిగా నమ్మిస్తూ సమర్థించడం అధికారంలో ఆదివాసీలున్నా, మహిళలున్నా కార్పొరేట్ వర్గాల, భూస్వామ్య పితృస్వామ్య పల్లకి మోయాల్సిందేనని రుజువు పర్చారు.

మణిపూర్‌లో కుకీ తెగ ప్రజలపై మే 3 నుండి ఇప్పటి వరకు నిరవధికంగా హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న కాకి లెక్కల ప్రకారమే ఇప్పటి వరకు (సెప్టెంబర్ 15) 160 మందికి పైగా ప్రధానంగా కుకీ-జో తెగ వారు హత్యల పాలయ్యారు. 300కు పైగా వారి ప్రార్థనా మందిరాల (చర్చీలు) ను తగులబెట్టారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వుంటున్న 70 వేల మంది కుకీ ప్రజలను తమ ఇండ్ల నుండి 'సహాయ' (నిర్బంధ) శిబిరాలకు తరలించారు. కొందరు పొరుగు రాష్ట్రాలకూ పారిపోయారు. దేశంలో ఇంతటి విధ్వంసం జరిగిపోతున్నా విదేశీ పర్యటనలో మునిగిపోయిన ప్రధాని మోదీ 78 రోజుల వరకు వాటిపై పల్లెత్తు మాట మాట్లాడలేదు. తుదకు అనాగరిక పద్ధతులలో మహిళలపై జరిగిన అమానవీయ కృత్యంపై విధిగా పెదవి విప్పక తప్పలేదు. కాకపోతే, ఆ సందర్భాన్ని కూడా ఆయన రాజకీయమే చేయడం క్రూర పరిహాసమే అయింది. మరోవైపు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం అదే విధంగా స్పందిస్తూ అలాంటి అత్యాచారాల కేసులు వందల కొద్ది జరుగుతున్నాయనీ అవన్నీ తన గమనంలో వున్నాయన్న విధంగానే మీడియా ముఖంగా గుట్టు విప్పాడు. అంటే, అక్కడ అంతర్జాలాన్ని నిలిపివేసి అక్కడి ఘోర కృత్యాలేవీ బహిర్గతం కాకుండా చేయగలిగామనీ ఆయన నిస్సిగ్గుగా చెప్పకనే చెప్పాడు. అవి వరుసగా ఇపుడు వెలుగు చూస్తున్నాయి.

మణిపూర్‌పై ప్రధాని మౌనం వీడాలని పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్షాలు ఎంత డిమాండ్ చేసినప్పటికీ మోదీ పెదవి విప్పలేదు. ఉభయ సభలలో సభాధ్యక్షులు నిరంతరం కార్యకలాపాలను వాయిదా వేస్తూ పాలక పక్షం వారు బిల్లులు ప్రవేశపెట్టడాన్ని మాత్రం అనుమతిస్తూ వచ్చారు. ప్రతిపక్షాలు సభలను బహిష్కరించి బయటికి వెళ్లినప్పటికీ తమకున్న మందబలంతో అధికార పార్టీ 23 బిల్లులను ఆమోదించి నిరంకుశంగా చట్టాలు చేసేసింది. ఇలాంటి స్థితిలో ప్రతిపక్షాలు మణిపూర్ సమస్యపై సభలో అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టగా సూటిగా జవాబు చెప్పలేని పాలక పక్షం మహిళలు **ఫ్లైయింగ్ కిస్** పై రాద్ధాంతం చేసి అసలు సమస్యను దురుద్దేశపూర్వకంగా దారి మళ్లించారు.

మోదీ తన వాచాలత్వంతో తన ప్రభుత్వ గొప్పతనంపై అసందర్భంగా అపూర్వస్థాయిలో (2 గంటల 14 నిముషాలు) ఉపన్యసించి సభా సమయాన్ని దుర్వినియోగపర్చాడు. దానిపై ది టెలిగ్రాఫ్ వార్తా పత్రిక తీవ్ర నిరసనతో బ్లా...బ్లా...బ్లా (బీరాలు పలకడం) అంటూ అపూర్వమైన సంపాదకీయాన్ని ప్రకటించింది. మోదీని అంటకాగే రాజకీయ పార్టీల మద్ధతుతో లోక్‌సభలో అవిశ్వాస తీర్మాణం వీగిపోయింది. మరోవైపు అధికారికంగా కేంద్ర, రాష్ట్ర మంత్రుల దండు, భాజపా మీడియా సెల్ ఎడతెరిపి లేకుండా మణిపూర్ విషయాలను పక్కతోవ పట్టించే పుకార్లు పుట్టిస్తూ, అనేక తప్పుడు ప్రకటనలు నిరంతరం వెలువరిస్తునే వున్నాయి. 'ప్రధాన స్రవంతి' మీడియాలో (గోది మీడియా) మణిపూర్ దారుణాలను తెగల మధ్య ఘర్షణలుగా, మతాల మధ్య చిచ్చుగా, చొరబాటుదారుల సమస్యగా, రిజర్వేషన్‌ల సమస్యగా చిత్రిస్తుండగా, హై కోర్టు తీర్పు కెటలిస్టు చర్యగా వాటికి నిప్పు రాజేసిందని అనేక మంది విశ్లేషిస్తున్నారు. కానీ వాస్తవ సమస్య మూలాల్లోకి వెళ్లి వివరిస్తున్నవారు అరుదుగానే వున్నారు. మనం ఆ విషయాలను ఇక్కడ చూద్దాం.

### చరిత్రలో మణిపూర్:

మణిపూర్ ఒక స్వతంత్ర దేశం. మన దేశాన్ని బ్రిటిష్ వారు ఆక్రమించిన కాలంలో అది భారతదేశానికి బయటి దేశం. అది

భారతదేశంలో ఎన్నడూ భాగం కాలేదు. ఇది అత్యంత ప్రాథమికమైన విషయం. దానిని 1947లో అధికార మార్పిడి తరువాత భారత విస్తరణవాద విధానాలలో భాగంగా నెహ్రూ, పటేల్‌ల నాయకత్వంలోని భారత ప్రభుత్వం సైనిక శక్తితో దానిని విలీనం చేసుకుంది. ఈ విలీనం అక్కడి ప్రజల అభిష్టానికి పూర్తి భిన్నంగా జరిగింది. అందుకే వారు నేటికి తమ విడిపోయే హక్కుతో సహ స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నారు. వారి పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం 1958లో **'సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని'** (అఫ్స్‌పా) రూపొందించింది.

మణిపూర్ అత్యంత విలువైన, అపార ప్రాకృతిక వనరులను కలిగిన సుసంపన్నమైన దేశం. ఇక్కడి నుండి సమస్యను ఆలోచించాలి. మణిపూర్‌లో మైథేఈ, కుకీ, నగా తెలగతో పాటు ముస్లింలు స్వల్ప మైనార్టీగా వున్నారు. 2011 జనగణనాల ప్రకారం అక్కడి జనాభా 32 లక్షలుగా నమోదైంది. వారిలో 53 శాతం మైథేఈలు, 40 శాతం కుకీలు కాగా అతి తక్కువ సంఖ్యలో నగాలు వుంటారు. 60 మంది గల మణిపూర్ అసెంబ్లీలో 40 మంది మైథేఈలే కావడం వారి నిరంకుశ విధానాల అమలుకు తిరుగులేని అధికారిన్ని కట్టబెడుతున్నది.

## మణిపూర్‌లో ప్రజల సంస్కృతి, హిందూ మత విస్తరణ:

18వ శతాబ్దంలో రాజా చోంగ్బా కాలంలో పొరుగున వున్న బెంగాల్ ప్రాంతం నుండి విస్తరించిన బ్రాహ్మణ (హిందూ) మతంలోని 'వైష్ణవ' శాఖ మణిపూర్‌లోని 'మైథేఈ' లలో బలపడింది. బెంగాల్ నుండి 1704లో మణిపూర్ వెళ్లిన నింబార్కా అనే మత ప్రవక్త అక్కడ హిందూ మత బీజాలు నాటాడు. చోంగ్బా తరువాతి రాజు గరీబ్ నివాజ్‌కు ఆనాటి పూజారీ శాంతిదాస్ గోస్వామిపై ఏర్పడిన అంధ విశ్వాసం, ఆయన దీవెనలతో రాజు నివాజ్ పరమ వైష్ణవ భక్తుడయ్యాడు. పాలకుల ప్రాపకం పొందిన మతం కావడంతో మైథేఈ ప్రజలు వైష్ణవ మతావలంబకులయ్యారు. ప్రజలకు మతం మత్తు ఎక్కించడానికి కావలసిన ధార్మిక విషయాలను బంగ్లా భాష నుండి అందించారు. రాధ-కృష్ణల రసక్రీడను మైథేఈ భాషలో **రాసలీల** నృత్యంగా మలిచి మైథేఈ ప్రజల ఆదివాసీ నృత్యాలను జోడించి భక్తులకు రక్తి కట్టించి గాఢంగా హైందవ మత మత్తెక్కించారు.

వైష్ణవ మత ప్రభావంతో గతంలోని మైథేఈ మందిరాల విధ్వంసం, విగ్రహాల చౌర్యం అన్నీ జరిగిపోయాయి. 1919 నాటికి **'విశ్వకవి'** రవీంద్రుడు మహాభారతం ఆధారంగా **చిత్రాంగద** నాటకం రూపొందించాడు. 1940లలోని రాజు చుర్చంద్‌సింగ్ కూతురు వినోదిని శాంతికేతన్‌లో అభ్యసించడం వరకు చరిత్రను పరికిస్తే మణిపూర్ మైథేఈలలో జరిగిన హిందూ మత విస్తరణ, ప్రభావవ బోధ పడుతుంది. మరోవైపు బ్రిటిష్ వారి కాలంలోనే కుకీ, నగాలలో క్రైస్తవమతం వేళ్లూనుకుంది.

## మణిపూర్‌లో కమ్యూనిస్టు, జాతి విముక్తి ఉద్యమాల నేపథ్యం:

మరోవైపు, అక్కడి రాజు చుర్చంద్ సింగ్ సోదరుడు **"హిజం ఇరాబత్ సింగ్"** (1896-1951) కమ్యూనిస్టు విప్లవ భావాలు కలిగినవాడు. ఆయనను 'లెజెండరీ మణిపూర్ కమ్యూనిస్టు రెవల్యూషనరీ'గా గుర్తిస్తారు. ఆయన 1940లో కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. 1943-44లో జైలు జీవితం అనుభవించాడు. భారత-బ్రిటిష్ అధికార మార్పిడి తరువాత నెహ్రూ-పటేల్‌ల నాయకత్వంలో సైనికంగా, దౌర్జన్యపూరితంగా భారత్‌లో మణిపూర్ విలీనాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. విలీనానంతరం 1948లో ఆయన రహస్య మణిపూర్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించాడు. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాడు. భారత పాలకవర్గాలు విస్తరణవాద కాంక్షతో మణిపూర్ దేశాన్ని బలవంతంగా విలీనం చేసుకోవడం అక్కడ సాయుధ ప్రజా ప్రతిఘటనకు రంగం సిద్ధం చేసింది. నెహ్రూ హయాంలోనే భారత ప్రభుత్వం రూపొందించిన భారత "సైనిక బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం-1958" ని ప్రయోగిస్తూ మణిపూర్ ప్రజల స్వయం నిర్ణయాధికార ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా అణచివేయ దానికి వ్యతిరేకంగా మొదట 1964లో, **'సంయుక్త జాతీయ విమోచనా సంఘం'** (యూ.ఎన్.ఎల్.ఎఫ్.) ఏర్పడింది. తర్వాత్తర్వాత అక్కడ ఏర్పడి పోరాడు తున్న అనేక ఉద్యమ సంస్థలకు మూలం ఇదే.

యూ.ఎన్.ఎల్.ఎఫ్ సార్వభౌమాధికారాన్ని (సావర్నిటి) సామ్యవాదాన్ని (సోషలిజం) తన లక్ష్యంగా ప్రకటించుకుంది. అందులో నుండి 1977లో **'కంగ్లీపాక్ ప్రజా విప్లవ పార్టీ'** (ప్రీపాక్) ఆవిర్భవించింది. మైథేఈ భాషను అధికార భాషగా ప్రకటించడం, పరాయివారిని అక్కడి నుండి పంపించివేయడం దాని తక్షణ డిమాండ్‌లుగా అది పేర్కొంది. తరువాత 1978లో విప్లవ ప్రజా వేదిక (ఆర్.పీ.ఎఫ్) నాయకత్వంలో 'ప్రజా విముక్తి సైన్యం' **(పీఎల్ఏ)** ఏర్పడింది. తదనంతర కాలంలో, వివిధ రాజకీయ విభేదాలతో ఆ సంస్థ అనేక గ్రూపులుగా చీలిపోయింది. వాటిలో 1980లో ఏర్పడిన ప్రత్యేక సామ్యవాద మణిపూర్ దేశ **'కంగ్లీపాక్ కమ్యూనిస్టు పార్టీ'** (మావోయిస్టు) ఒకటి. 2011లో "మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ మణిపూర్" ఏర్పడింది. అది నూతన ప్రజా మిలీషియా (**ఎన్.పీ.ఎమ్.**) పేరుతో సాయుధ సంస్థనూ ఏర్పర్చుకుంది. ఇవన్నీ భారతదేశం నుండి విడిపోయే లక్ష్యంతోనే పని చేస్తున్నవి. కానీ, విషాదం ఏమంటే, ఇవన్నీ ఇంఫాల్ లోయ లోని మైథేఈ ప్రజల మధ్య, వారితోనే ఏర్పడి కొండ ప్రాంతాలలోని ఆదివాసీ ప్రజలతో ముఖ్యంగా కుకీ తెగతో మమేకం కాలేకపోయాయి. ఆ ప్రజలను తమ ఉద్యమ సంస్థలలో భాగం చేయలేకపోయాయి. మణిపూర్ ప్రజలలో ఈనాటికి నిలబడి పని చేస్తున్న సంస్థలలో యూ.ఎన్.ఎల్.ఏ; పీ.ఎల్.ఏ; ప్రిపాక్‌లు ముఖ్యమైనవి. ఒకే లక్ష్యంతో ఏర్పడిన ఈ సంస్థలు సమైక్యం కాకపోవడమే కాకుండా తమలో తాము ఘర్షణలకు పూనుకోవడం ఒక సాధారణ దృశ్యంగా మారింది. పాలక వర్గాలు సృష్టించిన ఎత్నిక్ గ్రూపుల ఘర్షణలలో భాగంగా కుకీలు కూడా **"కుకీ జాతీయ సంస్థ"** (కే.ఎన్.ఓ) **"కుకీ జాతీయ సైన్యం"** (కే.ఎన్.ఏ)లను ఏర్పర్చుకున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే, చైనాలో మావో బతికుండగా చైనా కమ్యూనిస్టు పార్టీకి ఈ ఉద్యమ సంస్థల

అనేక మంది నాయకులతో సంబంధాలుండడమే కాకుండా, శిక్షణ సైతం లభించిందనేది బహిరంగ రహస్యమే.

### మణిపూర్‌లో ఛాంధసవాద సంస్థల ఆవిర్భావం:

పై పరిణామాలకు సమాంతరంగా మైథేఈ ప్రజలలో నుండి మైథేఈ ఛాందసవాద (ఛావనిస్టు) ఉగ్రవాద సంస్థలు కూడ పుట్టుకు వచ్చాయి. వాటిలో 'మైతీ లీపున్', 'అరంబై టెంగోల్' లు అత్యంత కరుడుగట్టిన హిందుత్వ సంస్థలుగా నిలిచాయి. అవి ఆర్.ఎస్.ఎస్.తో ముడిపడిన సంస్థలు. కేంద్రంలో, రాష్ట్రంలో హిందుత్వ ప్రభుత్వాలు ఏర్పడడంతో ఈ సంస్థలు అధికార అండతో అనేక రకాల విచ్చలవిడి విధ్వంసానికి పాల్పడుతూ పాలక వర్గాల చేతిలో చట్టాతీత పనిముట్లుగా తయారయ్యాయి.

### మణిపూర్ హిందుత్వ రాజకీయ పరిణామాలు:

2014లో హిందుత్వ శక్తులు కేంద్రంలో అధికారాన్ని చేపట్టాక ఈశాన్య ప్రాంతంపై ప్రత్యేకంగా కేంద్రీకరిస్తున్నాయి. అక్కడి 'రాష్ట్రాల'లో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అనేక కుట్రలకు పాల్పడుతున్నాయి. తమ అధికార కాంక్షలో భాగంగానే మణిపూర్‌లో అధికారాన్ని కైవశం చేసుకోవడానికి భారతీయ జనతా పార్టీ 2017లో వేగంగా పావులు కదిపింది. అప్పటికే ఈశాన్య ప్రాంతంలోని అసోంలో హేమంత విశ్వ సర్మ భాజపా తీర్థం పుచ్చుకొని వుండడంతో, ఆయనతో పాటు బీజేపీ కేంద్ర నాయకత్వం కరుడుగట్టిన ఆర్.ఎస్.ఎస్ ఆలోచనాపరుడైన రాంమాధవ్‌ను కశ్మీర్ నుండి మణిపూర్‌కు తరలించింది.

మొదట బీజేపీ నాయకులు మణిపూర్‌లోని మైథేఈలను కాంగ్రెస్ పట్టు నుండి తమ పట్టులోకి తెచ్చుకొని అవకాశవాద బీరేన్ సింగ్‌ను తమ పార్టీ నాయకుడిగా ముందుకు తెచ్చారు. కుకీల ఓట్లను సొమ్ము చేసుకోవడానికి అనేక కసరత్తులు చేశారు. 2005లో మూడు పక్షాల మధ్య (కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, రెండు కుకీ ఉద్యమ సంస్థలు) కుదరిన "సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్" (ఎస్ఓఎస్) గౌరవిస్తామనీ హామీ ఇచ్చారు. మణిపూర్‌లో శాంతి స్థాపనకు జరిగిన కాల్పుల విరమణ ఒప్పందమే సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్. బీజేపీ నాయకులు ఇచ్చిన హామీని నమ్మి ప్రజలు ఓట్లు వేసి తమ ప్రాంతం నుండి ఇద్దరు బీజేపీ విధానసభ సభ్యులను గెలిపించారు. లోకసభకు ప్రతినిధిని పంపారు. కానీ, బీజేపీ అధికారం చేపట్టాక ముందు ఇచ్చిన హామీలన్నీ వల్లకాడయ్యాయి. శాంతిని కోరుకుంటూ కుకీ ప్రజలు 'సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్'ను తక్షణం తిరిగి అమలులోకి తేవాలనీ న్యాయసమ్మతంగా డిమాండ్ చేస్తుంటే మణిపూర్‌లోని 40 మంది మైథేఈ విధానసభ సభ్యులు (ఎమ్.ఎల్.ఏ) ఇటీవలే ఆగస్టు చివరలో మోదీని కలిసి సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్‌ను కొనసాగించాలనీ విన్నవించుకున్నారంటే, మోదీ "మేక్ ఇన్ ఇండియా"ను 'మేక్ ఇన్ మణిపూర్" గా మార్చడానికి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ సహ ఆయన బ్రిగేడంతా కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం ఎలా పాటు పడుతున్నారో అర్థమవుతుంది.

### మణిపూర్‌లో అశాంతికి మూలం కార్పొరేటీకరణ:

మణిపూర్‌లోని ఉఖ్రూల్, చందేల్, చుర్చంద్‌పూర్ జిల్లాల కొండ ప్రాంతాలలో క్రోమైట్, సున్నపురాయి, నికెల్, రాగి, ప్లటీనం గ్రూప్ ఆఫ్ ఎలిమెంట్స్ (పీ.జీ.ఈ) సహ ఇతర పలు రకాల అమూల్యమైన గనులున్నాయి. ఈ ప్రాంతాలు తరతరాలుగా కుకీ, నగా ఆదివాసీ ప్రాంతాలు. ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ ప్రభుత్వం ఈ ప్రాంతాలలోని గనుల తవ్వకాల కోసం 2017 నవంబర్ 21-22 రెండు రోజులు ఇంఫాల్‌లో మదుపుదారుల సమావేశాలు జరిపింది. ఇటీవలి సంవత్సరాలలో ప్రతి రాష్ట్రంలో ఇలాంటి సమావేశాలు (వైబ్రంట్ సమావేశాలతో పేరుతో) జరుగడం చూస్తున్నాం. దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులు హజరై లక్షల కోట్ల రూపాయల యం.ఓ.యూ లు కుదుర్చుకోవడం చూస్తున్నాం. మణిపూర్‌లో కూడా ప్రభుత్వం అనేక ఒప్పందాలు (యంఓయూ) కుదుర్చుకుంది. ఉదాహరణకు, ఒడిశాలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, వాటిలో అధిక శాతం మైనింగ్ రంగంలోనే సమకూరాయి. ఉత్తర ప్రదేశ్‌లో రూ. 20 లక్షల కోట్లు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర మున్నగు అనేక రాష్ట్రాలలో ఇలాంటి మదుపుదారుల సమావేశాలు జరిగాయి.

మణిపూర్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు అమలులోకి రావాలంటే, అక్కడి కుకీ, నగా ప్రజల కొండ ప్రాంతాలలో గనుల తవ్వకాలు జరగాలి. అందుకు ప్రజలు, చట్టాలు అనుమతించాలి. చట్టాలలో మార్పులైతే, చట్టసభలలో మందబలంతో సునాయసంగానే చేయగలరు. చేస్తున్నారు. కానీ, ప్రజల అనుమతి దగ్గరే, విధ్వంసం చేలరేపుతున్నారు. బస్తర్ డివిజన్‌లోని ఆదివాసీ ప్రాంతాలను కార్పొరేట్ వర్గాల కోసం ఖాళీ చేయించడానికి అక్కడి ఆదివాసీ భూస్వామి, మాజీ రాష్ట్ర పరిశ్రమల మంత్రి మహేంద్రకర్మ నాయకత్వంలో నాలుగేళ్ల శ్వేత బీభత్సాన్ని సృష్టించిన సల్వాజుడుం ఈ కోవలోకే వస్తుంది. నేటి మణిపూర్ దారుణాలనే హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు, పంటలకు నిప్పంటించడం బస్తర్ ఆదివాసులు అనుభవించారు. ఎస్.పీ.ఓల పేరుతో ప్రభుత్వం నూతనంగా ఒక సాయుధ శక్తినే సృష్టించింది. వెయ్యికి పైగా ప్రజలను ఘోరంగా హత్య చేశారు. 650 గ్రామాలను బలవంతంగా సైనిక చర్యలతో ఖాళీ చేయించారు.

మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్ రాష్ట్రంలో సాయుధ దాడులతో నిరాశ్రయులవుతున్న కుకీల పునరావాసానికి 4 వేల ఇండ్లు నిర్మాణమవుతున్నాయనడం గమనార్హం. గతంలో నెత్తురు ఏరులై పారిన విప్లవోద్యమ బస్తర్‌లో కార్పొరేట్ వర్గాలు చేయలేకపోయింది వర్తమాన మణిపూర్‌లో జరిగిపోతోంది.

### మణిపూర్‌లో కార్పొరేటీకరణను కాపాడుతున్న సైన్యీకరణ:

పై చారిత్రిక పరిణామాల నేపథ్యంలో నడుస్తున్న చరిత్రను చూడాలి. మణిపూర్‌లో తరచుగా పాలకవర్గాల ప్రయోజనాల కోసం 'ఎత్నిక్' ఘర్షణలు జరగడం తెలిసిందే కానీ, మత ఘర్షణల చరిత్ర గతంలో లేదక్కడ. ఇపుడు సామ్రాజ్యవాద, దేశ కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం అక్కడ మొదలైన ఘర్షణలు మతం రూపం ధరించి అపూర్వ స్థాయిలో విధ్వంసానికి పాల్పడు తున్నాయి. కొండ ప్రాంతాలలోని అపార ప్రాకృతిక వనరులను కార్పొరేట్ వర్గాలు కైవశం చేసుకోవడం కోసం, అక్కడి నుండి కుకీలను తరిమికొట్టే లక్ష్యంతోనే వర్తమాన దాడులు ఉగ్ర రూపం ధరిస్తున్నాయి. ఉ

ద్దేశపూర్వకంగానే అధికార పక్షం ధావనిస్తు సంస్థలను కుకీలపై దాడులకు పురికొల్పింది. అందుకే మోదీ, అమిత్ షా, బిరేన్ సింగ్ సహా పాలకవర్గాలలోని హిందుత్వ శక్తులు అక్కడి భయంకర విధ్వంసంపై మౌనం వహిస్తూ వాటిని రెచ్చగొడుతున్నారు. పోలీసు స్టేషన్‌లపై బడి హిందుత్వ ఉగ్రవాద సంస్థలు వేలాది ఆధునిక తుపాకులు ఎత్తుకెళుతున్నప్పటికీ రాజ్యం (పోలీసులు) ప్రేక్షక పాత్ర పోషిస్తున్నది. అక్కడ సుదీర్ఘకాలంగా అఫ్సోపాను చేతబూని తిష్ట వేసిన జాతి వ్యతిరేక భారత సైన్యాలు, అదనపు బలగాలు వుండగా ఇవన్నీ జరుగుతున్నా యంటే, అన్నీ రాజ్య ప్రోద్భలంతోనే జరుగుతున్నాయన్నది యధార్థం.

పెట్టుబడి సంచయనంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలోని రెడ్ ఇండియన్‌ల నుండి మన దేశంలోని సంతాల్, ముండా, బిల్, ఉరావ్, మాడియా, మురియా, కువ్వీ, కుకీ తెగల వరకు వేలాది తెగల ప్రజానీకం పెట్టుబడికి బలైన చరిత్రలే అగుపడుతాయి. ప్రతిఘాతుక శాంతి యాత్రలు, సల్వాజుడుంలు, సేంద్రాలు, గ్రీన్‌హంట్‌లు, సమాధాన్‌లన్నీ ఆదివాసీ ప్రాంతాలలో కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు, ప్రైవేట్ సైన్యాలు సృష్టించిన నరమేధాలేనన్నది బోధపడుతుంది. మహేంద్రకర్మలు, బలిరాం కశ్యప్‌లు, ఆత్రం ధర్మారావులు, హేమంత సోరేన్‌లు, అర్జున్ ముండాలు, బీరేన్ సింగ్‌లు వారి కావలికుక్కలన్నది అర్థమవుతుంది.

## మణిపూర్‌లో శరవేగంగా ప్రభుత్వ చర్యలు:

2023 మార్చ్ 10, నాడు బీరేన్ సింగ్ ప్రభుత్వం సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందాన్ని రద్దు చేసింది. అక్కడ రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న కాల్పుల విరామానికి స్వస్తి చెప్పింది. మారణకాండకు దారులు సుగమం చేసి తెర లేపింది. ఇది కుకీల అణచివేతకు వారికి అనివార్యమైన తొలి చట్ట సడలింపు. మరోవైపు వెంటనే మైథేఈలకు బిరేన్ ప్రభుత్వం తుపాకీ లైసెన్స్‌లు మంజూరు చేసింది. ఇది గూండా రాజ్యానికి, నరసంహారానికి 'లైసెన్స్' ఇవ్వడం తప్ప మరేం కాదు. ప్రభుత్వ భూమిలో అన్యాక్రాంతంగా చర్చీలను కట్టారంటూ మార్చ్‌లోనే డబుల్ ఇంజన్ సర్కారు బుల్‌డోజర్లతో మూడు చర్చీలను కూల్చింది. ముఖ్యంగా కుకీలు పవిత్రంగా భావించే చుర్చంద్‌పూర్ జిల్లాలో గల **"భారత-కుకీ యుద్ధ స్మృతి చిహ్నం"** కూల్చింది. కాంగ్ పోక్పీ, తెంగౌపాల్ జిల్లాలలో అడవులు, వన్యప్రాణుల రక్షణ పేరుతో ప్రభుత్వం వందలాది కుకీల ఇండ్లు కూల్చి వాళ్లను తరిమివేసింది. 16 సంవత్సరాలు మణిపురి యువతి ఇరోన్ షర్మిలా నిరవధిక ఉపవాసదీక్ష జరిపినా రద్దుకాని సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని 24 మార్చ్ నాడు బీరేన్ సింగ్ ఉపసంహరింప చేశాడు. వీటన్నింటికి తోడు తక్షణం కెటలిస్టిక్ చర్యగా హైకోర్టు న్యాయాధీశుడు జస్టిస్ మురళీధరన్ తీర్పు మార్చ్ 27 నాడు వెలువడింది. మైథేఈ ప్రజలకు ఆదివాసీ హోదా కల్పించడాన్ని కేంద్రం పరిశీలించాలనీ తన పరిధిలోకి రాని విషయంపై ఆయన ఆ తీర్పును వినిపించాడు. ఈ పరిణామాలన్నీ అత్యంత వినాశకరమైనవి. కుకీ ప్రజావ్యతిరేక ప్రభుత్వ చర్యలన్నీ వారిని ప్రతిఘటనా పోరాటాలకు నెడుతున్నాయి.

మణిపూర్ విధ్వంసానికి సుప్రీంకోర్టు కావాలసినంత అవకాశాన్ని ఇచ్చింది. జస్టిస్ మురళీధరన్ వెలువరించిన తీర్పు తన పరిధిలోది కాదనీ మే 17నాడు సుప్రీంకోర్టు వ్యాఖ్యానించి ఆ తీర్పు చెల్లదంది. నిజానికి ఈ మాత్రం తెలువకుండానే ఆ మహానుభావుడు హైకోర్టు న్యాయమూర్తి అయ్యాడనుకోగలరా! ఇలాంటి అత్యంత సున్నితమైన ప్రజల సమస్య విషయంలో సుప్రీంకోర్టు రెండు మాసాలు జాప్యం చేయడం. మోదీ మౌనం వహించడం ఎంత మాత్రం విడివిడి అంశాలు కావు. దోపిడీ పాలకవర్గాల రాజ్యాంగయంత్రంలో భాగమైన చట్టసభలు, పోలీసులు, న్యాయ వ్యవస్థ వారి ప్రయోజనాలను నెరవేర్చడానికే అంకితమైనాయనే విషయాన్ని ఈ అన్ని సంఘటనలు మనకు మరోసారి ఎరుక చేస్తున్నాయి.

## మణిపూర్‌లో కుకీ ప్రజల ప్రతిఘటన:

మణిపూర్‌లో 4 ఆగస్టు, 2020నాడు "మూలవాసీ ప్రజా రక్షణ యువ కార్యాచరణ కమిటీ" ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిపి తవ్వకాలను ఆపాలనీ విజ్ఞప్తి చేశారు. "ట్రైబల్ ఏరియాల రిజర్వు ఫారెస్టు 1966" చట్టాన్ని అమలు చేయాలనీ కోరారు. ఈ చట్టం ప్రకారం మూలవాసుల భూములను మూలవాసేతరులు ఏ రకంగానూ పొందలేరు. కాబట్టి ప్రభుత్వం ఇపుడు దీనిని మార్చాలి. దీని కోసం మెజార్టీ మైథేఈ ప్రజలను రంగంలోకి దింపి ఆదివాసుల జాబితాలో వారిని కలుపాలన్న డిమాండ్‌ను ముందుకు తెస్తున్నారు. నిజానికి కార్పొరేట్ వర్గాలకు భూములు దక్కాలంటే, ఈ చట్టం అడ్డుకుంటుంది. చట్ట సభలలో ఆ చట్టాన్ని మార్చడానికి పూనుకుంటూనే, కోర్టులను ఆశ్రయిస్తూనే, ప్రత్యక్షంగా తెల్ల బీభత్స కార్యాచరణకు దిగారు.

2023 మార్చ్ నెలలో శరవేగంగా జరిగిన పరిణామాలకు నిరసనగా మే 3నాడు "అఖిల మణిపూర్ ఆదివాసీ విద్యార్థి సంఘం" మొదట భారీ ప్రదర్శన జరిపింది. ఆ రోజు నుండే మణిపూర్‌లో మారణహోమం రగుల్కొంది. హత్యలు, అత్యాచారాలు, కుకీల ఇండ్లపై, విద్యా లయాలపై, హాస్టళ్లపై దాడులు, ఊచకోతలు, మహిళల నగ్న ఊరేగింపు, పెద్ద ఎత్తున ఇండ్లు, చర్చీలు కూల్చివేయడం అపూర్వ స్థాయిలో జరిగిపోయాయి. మైథేఈ ఛాందసవాద హిందుత్వ సంస్థలు పోలీసు స్టేషన్‌లపై పడి వందలాది తుపాకులు దోచుకెళ్లాయి. కుకీ పోరాట సంస్థలు శక్తి వంచన లేకుండా ప్రతిఘటిస్తున్నాయి. కానీ, ఇవేవీ ప్రపంచానికి తెలియకుండా దాదాపు రెండున్నర మాసాలు అంతర్జాలాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. అంతర్జాలం పాక్షికంగా పని చేయడం ప్రారంభించాక అక్కడి దారుణాలన్నీ క్రమంగా ప్రపంచం ముందుకు వస్తున్నాయి. బాధితులు తాము ఎదుర్కొన్న భయ, బీభత్స, దారుణ పరిస్థితులను ప్రపంచం ముందుంచు తున్నారు.

మణిపూర్‌లో జరిగిన దారుణాలను ఖండిస్తూ అక్కడి ప్రభుత్వాన్ని తక్షణం రద్దు చేయాలనీ, మోదీ, అమిత్ షాలు తమ పదవులకు రాజీనామాలు ఇవ్వాలనీ దేశం డిమాండ్ చేస్తోంది. ఎక్కడి కక్కడే ప్రజలు వేల సంఖ్యలో వీధుల్లోకి వస్తున్నారు. అనేక ప్రజా సంఘాలు, పోరాట సంస్థలు, హక్కుల సంఘాలు మణిపూర్ దారుణాలకు వ్యతిరేకంగా బందులు పాటిస్తున్నారు. మణిపూర్‌లో పోలీసులు

పని చేయడం లేదనీ, అక్కడ ఎంతో ఆలస్యంగా నమోదైన 6,523 ఎఫ్.ఐ.ఆర్.లే తెలుపుతున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ప్రజల ఆక్రోషాన్ని చూసి శాంతి భద్రతలు కరువైనపుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండలేం అంటోంది. మణిపుర్ డీజీపీని తమ ఎదుట హాజరు కావాలనీ ఆదేశించింది. బీజేపీ నాయకులు, మైథేఈ మహిళా సంస్థలు సైతం అక్కడ జరిగిన ఘోరకలిని ఖండిస్తున్నాయి. దిల్లీలో కుకీ ప్రజలను కలుపుకొని భారీ ప్రదర్శనలు జరిగాయి. **'రేపిస్టులతో, హంతకులతో మేం కలసి వుండం'** అని కుకీలు స్వతంత్ర పాలనను డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ఆక్రోషాన్ని గమనించిన హిందుత్వ శక్తులు విషయాన్ని మార్చడానికి వెంటనే తమ బీజేపీ పాలనలోని హర్యానాలో నూహ్, మేవాత్‌లలో హిందూ-ముస్లిం మత ఘర్షణలకు తెర లేపాయి. అక్కడ విధ్వంసం చోటుచేసుకుంది. మణిపుర్ కోసం మేవాత్ ముస్లింలను బలి తీసుకున్నారు. క్రైస్తవాన్ని చల్లబర్చడానికి ఇస్లాంను మంటలకు ఆహుతిచ్చారు. బైబిల్ బదులు ఖురాన్‌ను తగులబెడుతున్న గీతా రహస్యం నూహ్‌లో వెల్లడైంది. మధ్యలో హోం మంత్రి అమిత్‌షా మణిపుర్‌లో స్కూల్లు తెరిచారనీ, ప్రభుత్వ కార్యాలయాలు పని చేస్తున్నాయనీ, అంతర్జాలం అందుబాటులోకి వచ్చిందనీ, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయనీ అక్కడ సాధారణ పరిస్థితులు వేగంగా నెలకొంటున్నాయనీ మోసకారి ప్రకటనలు చేయడం గమనార్హం. ప్రభుత్వం కూల్చినట్టు చెపుతున్న బంకర్లలో నుండి నేటికీ హిందుత్వ ఉగ్రవాదులు కాల్పులు జరుపుతునే వున్నారు. కుకీలను హత్య చేస్తునే వున్నారు. ఇండ్లు తగులబడిపోతునే వున్నాయి. మరోవైపు మోదీ **"సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్"** జపిస్తునే వున్నాడు. ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా దేశం పరుగు పెడుతుందనీ ఊదరగొడుతున్నాడు. జీ-20 దేశాలకు అధ్యక్ష పదవిని అలంకరించడం భారతదేశానికి వన్నె తెచ్చిందని పొంగిపోతున్నాడు. మణిపుర్‌ను మరిచిపొమ్మంటున్నాడు. కానీ, మణిపుర్ మంటలు చల్లారేవీ కావు. ఏ హిందుత్వ శక్తి అక్కడి ప్రజల ఆకాంక్షలను చెరిపివేయలేదు.

## మణిపుర్ ప్రజా సమస్యకు మౌలిక పరిష్కారం:

మణిపుర్‌లో తక్షణం శాంతి నెలకొనాలంటే, మార్చ్‌లో రద్దు చేసిన 'సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్' ను వెంటనే అమలులోకి తేవాలి. గనుల కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ ప్రభుత్వం రద్దు చేయాలి. 1966 నాటి ట్రైబల్ ఏరియాల అటవీ సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలి. నగ్నంగా ఊరేగించిన మహిళలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్షమాపణలు చెప్పాలి. బాధిత కుటుంబాలకు, గాయాల పాలైన వారికి సరైన వైద్యంతో పాటు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలి. ఛాందసవాద సంస్థలను తక్షణం నిషేధించి తుపాకులను స్వాధీనం చేసుకోవాలి. కుకీలను శాశ్వితంగా బందీలుగా మార్చే కుట్రతో మైదానాలలో ఏర్పర్చిన సహాయ శిబిరాలను తక్షణం మూసివేసి కుకీ ప్రజలను తమ ఇళ్లలోకి సురక్షితంగా తరలించాలి. మైథేఈలను ఆదివాసీలుగా ప్రకటించడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ఇవి అన్నీ ఖచ్చితంగా అమలు చేయాలి. అయినప్పటికీ ఇవి కేవలం తాత్కాలిక ఉపశమన చర్యలు మాత్రమే కాగలవు.

మణిపుర్ ప్రజల సమస్యకు **మౌలిక పరిష్కారం** వారు కోరుతున్న విడిపోయె హక్కుతో సహ స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వడమే అవుతుంది. అక్కడి తెగలు తమ జీవన విధానాన్ని, వనరుల వినియోగాన్ని, పాలనా పద్ధతులను ప్రజాస్వామిక పద్ధతులు రూపొందించుకొని స్వేచ్ఛగా నిర్ణయించుకుంటాయి. కార్పొరేటీకరణ, దాని ప్రయోజనాల సంరక్షణకు సైన్యకరణ, సమస్యను పక్కదారులు పట్టించడానికి హైందవీకరణ దుష్ట త్రయం పీడ విరుగడ కాకుండా దేశంలోని పీడిత తాడిత ప్రజల ప్రయోజనాలు నెరవేరవు.

ఇటీవలే భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పైన పేర్కొన్న వైఖరిని ప్రకటిస్తూ అక్కడి పోరాట సంస్థలు ఈ దిశలో పని చేయాలనీ కోరింది. ☆

---

**46వ పేజీ తరువాయి**

నాయకత్వంలో సంఘటితమై పోరాడుతున్నారు. వారు బురహన్ పుర్‌లోని ఇంద్రజిత్ హాస్టల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు వేలాది స్త్రీ-పురుషులు ప్రదర్శన జరిపారు. ఆదివాసుల న్యాయ సమ్మతమైన డిమాండ్‌ను సమర్థిస్తూ వారి పోరాటానికి నాయకత్వం వహిస్తున్న జెఏడీఎస్ నాయకురాలు మాధురీ బెహన్‌ను జిల్లా బహిష్కరణకు గురి చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

కామ్రేడ్ మాధురీ బెహన్‌కు విధించిన జిల్లా బహిష్కరణను రద్దు చేయాలనీ కోరుతూ కలెక్టర్ వద్దకు సాగిన ప్రదర్శనలో **"సర్కారీ తేరీ డిక్టేటర్‌షిప్ నహీ చలేగీ", "హక్ నహీతో జేల్ సహీ"** నినాదాలు మారుమోగాయి. తమ ప్రాంతం రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో భాగమనీ, ఇక్కడ పెసా అమలులో వుందనీ, అటవీ హక్కులు తమవేననీ, గ్రామసభల అనుమతి లేకుండా అడవుల నరికివేత నేరమనీ ఆదివాసీ ప్రజలు వేలాది ఎకరాల అటవీ భూముల సంరక్షణకు పోరాడుతున్నారు. తమ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే యం.ఎల్.ఏ రాష్ట్ర మంత్రివర్గంలో సామాజిక న్యాయశాఖ మంత్రిగా వున్నాడనీ, ఆయన తమకు న్యాయం చేయడం లేదనీ, గుణ జిల్లాలో సెహరియా అనే ఆదివాసీ మహిళ మరణంపై కానీ, భీషన్ బిల్ మరణంపై కానీ ఆయన నేరస్థులపై ఎలాంటి చర్య తీసుకోలేదనీ వాళ్లు విమర్శించారు. జెఏడీఎస్ కార్యకర్త హర్‌సింగ్ భాయి మాట్లాడుతూ, స్థానిక ఆదివాసీలు భీమా నాయక్ వారసులనీ, ఆయన బ్రిటిష్ పాలనలో జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన యోధుడనీ, ఆయన వారసులు ఆ అధికారం నుండి వంచింపబడి పొరుగు రాష్ట్రాలకు గుజరాత్, మహారాష్ట్రలకు వలసలు పోతున్నారనీ ప్రభుత్వ వైఖరిని ఖండించాడు. మాధురీ బెహన్‌ను విడుదల చేయాలనీ, వేలాది ఎకరాల అడవిలో చెట్ల నరకడం నిలిపివేయాలనీ పోరాడుతున్న ఆదివాసీలకు నర్మద బచావో ఆందోళనో సమర్థించింది. గడ్‌చిరోలీ గ్రామసభలు సంఘీభావం ప్రకటించాయి.

☆

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 570వ రోజు (19 నెలలు)

# ఉక్రెయిన్‌కు ఆధునాతన, నిషేధిత ఆయుధాలను అందిస్తూ ప్రపంచాన్ని అణు యుద్ధం వైపు నెడుతున్న అమెరికా, నాటో కూటమి

ఉక్రెయిన్‌పై యుద్ధం వారం రోజులలో ముగుస్తుందనీ ప్రత్యేక సైనిక చర్యకు దిగిన రష్యాకు యుద్ధంలో అపార నష్టాలు, రక్తసిక్తమవుతున్న భూభాగాలు, విశ్వాసఘాతుకాలు, ఎదురుదెబ్బలు, ప్రజలలో యుద్ధం పట్ల పెరుగుతున్న వ్యతిరేకత శిఖరాగ్రం చేరుకుంటున్నది. మరోవైపు ఉక్రెయిన్ స్థితి ఇందుకు ఎంత మాత్రం భిన్నంగా లేదు. కాకపోతే, దేశ ప్రజలను నియో నాజీ విధానాలతో రెచ్చగొట్టడంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కృతకృత్యుడవుతున్నాడు. ఎప్పటి కప్పుడు అమెరికా, నాటో సామ్రాజ్యవాద దేశాల నుండి అపూర్వస్థాయిలో సైనిక సహాయాన్ని పొందుతూ పశ్చిమ దేశాల ప్రాపకం కోసం నిత్యం అర్రులు చాస్తునే వున్నాడు.

సామ్రాజ్యవాద దేశాలు ముఖ్యంగా అమెరికా-నాటో కూటమి యుద్ధ విరామాన్ని అన్ని విధాలా అడ్డుకుంటూ తమ ఆయుధాల వ్యాపారాన్ని యధేచ్ఛగా కొనసాగించుకుంటున్నారు. తమ దేశ ప్రజలను సమస్యల సుడిగుండపు లోలోతులలోకి నెడుతున్నారు. ఆర్థికంగా మాంద్యం పరిస్థితులు, రాజకీయంగా ఫాసిస్టు విధానాలు, సామ్రాజ్యవాద దేశాల మధ్య అతి వేగంగా మారిపోతున్న భౌగోళిక రాజకీయ సమీకరణలను నిశితంగా పరిశీలిస్తే, సామ్రాజ్యవాదుల విధానాలు ప్రపంచాన్ని వేగంగా అణు యుద్ధం వైపు నెడుతున్నాయనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రపంచం తీవ్ర అశాంతి, అభద్రత, ధరల పెరుగుదల, నిరుద్యోగం, హత్యలు, అత్యాచారాలు, రేసిస్టు దాడులు, విద్వేష విషపూరిత భావజాల వ్యాప్తి మున్నగు అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతూ శాంతి కోసం, యుద్ధ పరిసమాప్తి కోసం డిమాండ్ చేస్తున్నది. కానీ, సామ్రాజ్యవాదులు ఖాతర చేయడం లేదు. వారి యుద్ధోన్మాద విధానాలకు స్వస్తి చెప్పడం లేదు. అందుకే **"సామ్రాజ్యవాదం అంటే యుద్ధం"** అన్నారు.

### నాటో విస్తరణ:

వాస్తవంగా వర్తమాన యుద్ధానికి కారణం అమెరికా ప్రపంచాధిపత్యంలో భాగంగా రష్యాను నియంత్రించే పథకంతో చేపట్టిన నాటో విస్తరణ అని అర్థం చేసుకోవాలి. నాటోలో ఉక్రెయిన్‌ను కలుపుకోవడంతో ఎదురుకానున్న ప్రమాదాన్ని ముందు నుండి శంకిస్తూ వచ్చిన రష్యా అంతిమంగా 2022 ఫిబ్రవరి 24నాడు యుద్ధానికి దిగిన విషయం జగద్విదితమే. దానితో నాటోలో ఉక్రెయిన్‌ను కలుపుకోవడం తాత్కాలికంగా నిలిచిపోయింది. కానీ, తూర్పు యూరప్‌లో నాటో విస్తరణ మాత్రం ఆగలేదు. 2022 ఏప్రిల్‌లో ఫిన్లాండ్‌ను నాటోలో 31వ సభ్య దేశంగా కలుపుకున్నారు. కాగా, జులై 12నాడు లిథ్వేనియా రాజధాని విలినియస్‌లో నాటో వార్షిక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో స్వీడన్‌కు సభ్యత్వం ఇవ్వడంతో నాటో సంఖ్య 32కు చేరింది. కాగా, 19 మాసాలుగా యుద్ధంలో నిండా మునిగిన ఉక్రెయిన్‌కు మాత్రం సభ్యత్వం ఇవ్వడానికి సాహసించలేదు. అందుకు ఏకైక కారణం ఉక్రెయిన్ యుద్ధం ఆపై ఏ ముసుగులు, సాకులు లేకుండా ప్రత్యక్షంగానే సామ్రాజ్యవాద యుద్ధంగా అంటే ఒకవైపు అమెరికా-నాటో కూటమి, మరోవైపు రష్యాల మధ్య యుద్ధంగా మారుతుందనే స్పష్టతతోనే ఆ పని చేయలేదు. నాటో రూపొందినపుడు రాసుకున్న నియమాలలోని 5వ ఆర్టికల్ **"యుద్ధంలో మునిగిన దేశానికి సభ్యత్వం ఇవ్వకూడదనేది"** అడ్డుచెపుతుంది. అయితే, సమావేశానికి దాదాపు సమాన హోదాలో ఉక్రెయిన్ అధ్యక్షున్ని ఆహ్వానించారు.

### ఉక్రెయిన్‌ను బలిపెడుతూ చేరుతున్న సైనిక సరఫరాలు:

ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని అందించడానికి పూర్తిగా కట్టుబడివున్నామన్న విషయాన్ని జపాన్ సహా నాటో సమావేశానికి హాజరైన దేశాలన్నీ ముక్త కంఠంతో మరోమారు స్పష్టం చేశాయి. వాస్తవంగా వీటిని సహాయక చర్యలనడం ప్రపంచాన్ని వంచించడమే అవుతుంది. ఇవన్నీ **యుద్ధ ప్రోత్సాహక చర్యలే.** యుద్ధ ప్రోత్సాహక సైనిక సామగ్రిని అందచేస్తున్న దేశాలలో అమెరికా అగ్రస్థానంలో వుండగా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్‌లు తర్వాతి స్థానాలలో వున్నాయి. ఫ్రాన్స్ లాంగ్‌రేంజ్ క్షిపణులను సమకూరుస్తానంది. జర్మనీ టాంకులను, ఆర్టిలరీ షెల్స్‌ను మరో విడుత అందిస్తానంది. న్యూక్లియర్ సామర్థ్యం కలిగిన ఎఫ్-16 ఫైటర్ జెట్ విమానాలకు అవసరమైన పైలట్ల శిక్షణ ఇస్తామనీ 11 నాటో దేశాలు హామీ ఇచ్చాయి. అమెరికా-నాటో కూటమి అందిస్తున్న యుద్ధ ప్రోత్సాహక సైనిక సామగ్రిలో స్టింగర్ ఆంటీ-ఎయిర్ క్రాఫ్ట్ సిస్టం, జావెలిన్ ఆంటీ-ఆర్మోర్ సిస్టం, 155 యం.యం. హౌట్జర్స్ సహా జైవ, రసాయనిక, రేడియోధార్మిక, న్యూక్లియర్ దాడుల నుండి రక్షణ పొందే అన్ని రకాల ఆయుధాలు వున్నవి. ఇపుడు నూతనంగా ప్రపంచంలో అనేక దేశాలు నిషేధించిన క్లస్టర్ బాంబులను అమెరికా సమకూరుస్తానంది. ఇవి 1950లలో రాల్ఫ్ యం. పర్సన్స్ కంపెనీ అభివృద్ధి చేసిన ఈ86 తరహావి కాకుండా అత్యంత ప్రమాదకరమైన యంకె 20 రాక్యీ 2 తరహావి. ఇవి విస్ఫోటనం చెందినపుడు విడుదలయ్యే వందలాది చిన్నబాంబులు (బాంబులెట్స్) నేలపై బడి ఒక రకమైన మందుపాతరల క్షేత్రంగా అక్కడి ప్రాంతం తయారవుతుంది. ఇవి సైనిక శకటాల నిరోధక ఆయుధంగా పనిచేస్తాయి. యుద్ధం ముగిసినప్పటికీ అనేక సంవత్సరాలు భూమిలో బాంబులు వుండిపోతాయి. యుద్ధానంతరం కూడ ప్రజలను చంపుతునే వుంటాయి. "లాంగ్ రేంజ్ ఆయుధాలు లేకుండా ప్రతిదాడిని కొనసాగించలేకపోవడమే కాకుండా చురుకైన ఆత్మరక్షణా చర్యలను కూడ చేపట్టలేం" అంటూ చాన్నాళ్లుగా స్పష్టం చేస్తున్న జెలెన్‌స్కీ స్వప్నాలను అమెరికా సామ్రాజ్యవాదులు సాకారం చేసి యుద్ధాన్ని

తీవ్ర పరిణామాల వైపు నెట్టారు. నాటో మొడస్ ఆపరెండీ ప్రకారమే ఇవన్నీ జరిగాయి. అక్కడ శాంతి గురించి మాట్లాడుకోగలరని మూర్ఖులు తప్ప మరెవరూ అనుకోరు.

### నియో నాజీల యుద్ధ పిపాసిత:

నాటోలో తమకు సభ్యత్వం దొరుకకపోవడంతో తాము స్వతంత్రంగా తమదైన నూతన రీతిలో దేశం కోసం ప్రతిఘటనా యుద్ధాన్ని కొనసాగిస్తున్నామనీ ఉక్రెయిన్ సైనికులు గర్వపడు తున్నారు. సైన్యంలో ప్రాథమిక సైన్య నిర్మాణం ప్లాటూన్ నుండి జనరల్ స్టాఫ్ వరకు టెక్నాలజీని ఉపయోగించుకుంటూ యుద్ధ భూమిలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటూ రష్యా ఓటమి కోసం తీవ్రంగా పోరాడుతున్నామనీ చెప్పుకుంటున్నారు. 21వ శతాబ్దపు నాటో యుద్ధాలకు ఈ అనుభవం లేదనీ ఉక్రెయిన్ మాజీ రాష్ట్రపతి యులియా టిమోషెంకో విశ్లేషిస్తోంది. తాము అనుసరిస్తున్న ఎత్తుగడలు, శిక్షణ, సైనికులకు ఇస్తున్న వ్యక్తిగత బాధ్యతలు యూరోపియన్లు నేర్చుకోవాలనీ, క్రిమియాను 2014లో రష్యా ఆక్రమించినపుడు ఈ అనుభవం తమకు లేదనీ, అలా మరెన్నటికీ ముమ్మాటికీ జరుగదనీ ఆమె ఘంటాపథంగా చెపుతోంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో 1981లో 102 మీటర్ల అతి ఎత్తైన మాతృభూమి సుత్తీ కొడవలి చిహ్నంతో పాటు మహిళ చేతిలో కత్తీ-డాలు, డాలులో సుత్తీ కొడవలి వున్న చిహ్నం ఆగస్టు 24 నాడు ఉక్రెయిన్ స్వాతంత్ర దిన వేడుకల సందర్భంగా తొలగించి దాని స్థానంలో కోట్ ఆఫ్ ఆర్మ్స్ (యోధ చిహ్నాలున్న కవచం) ను 'మదర్ ఉక్రెయిన్' పేరుతో పెట్టారు. ఇది వారి యుద్ధ పిపాసతకు పరాకాష్ట చిహ్నం.

### ఉక్రెయిన్ ప్రతిదాడులతో యుద్ధంలో మౌలిక మార్పులు:

2023 జూన్ నుండి రష్యాపై ఉక్రెయిన్ ప్రతిదాడులు మొదలయ్యాయి. దీనితో సైనికుల దూకుడు పెరిగిందనీ ఉక్రెయిన్ బలగాల గురించి రాస్తున్నారు. ఫలితంగా యుద్ధంలో మౌలిక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తమ పురోగమన బలగాలపై రష్యా చేస్తున్న ఆకాశదాడులను ప్రతిఘటిస్తున్నామనీ, ఉక్రెయిన్ సైనిక వర్గాలు తెలుపుతున్నాయి. "ఆకాశ దాడులలో ఆధిపత్యం సాధించడం భూమిపై జరుగుతున్న దాడుల విజయానికి కీలకం అవుతుంది" అంటూ జులైలో ఉక్రెయిన్ సైనిక వర్గాలు యుద్ధ సూత్రాన్ని ఉటంకించాయి. కాగా, గతంలో అందించిన 43 బిలియన్ డాలర్ల సహాయం పోగా ఇపుడు ఆగస్టులో అమెరికా మరో విడుత 200 మిలియన్‌ల డాలర్లతో ఒక కొత్త ప్యాకేజీని ప్రకటించింది. ఈ ప్యాకేజీ అంతా వాయుదాడుల నుండి రక్షణను ఇచ్చే ఆయుధాలను, శతఘ్నులను, సైనిక శకటాల నిరోధక సామర్థ్యాన్ని పెంచే ఆయుధాలతో కూడి వుంది. తమ దేశ పైలట్‌లకు శిక్షణ పూర్తయిందనీ, ఈ సంవత్సరం చివరి వరకు అమెరికా నుండి 42 జెట్ విమానాలు, మొదట 6 ఎఫ్-16లు అందుతాయనీ వాటితో రష్యా దాడులను మరింత గట్టిగా ఎదుర్కొంటామనీ అంతిమంగా రష్యాను ఓడిస్తామనీ ఆగస్టు 21నాడు నియో నాజీ జెలెన్‌స్కీ డెన్మార్క్‌లో ప్రకటించాడు. ఈ ఒప్పందం బ్రేక్‌త్రూ నిర్ణయమని పొగిడాడు. ఈ జెట్‌లు అందిన తరువాతి నుండే ప్రతిదాడులు తీవ్రమయ్యాయి. జర్మనీ టావుర్స్ మిస్సైల్స్‌ను సమకూర్చి తాము కోరిన లాంగ్ రేంజ్ మిస్సైల్స్ అవసరాన్ని తీర్చిందని అన్నాడు. వీటితో రష్యా యుద్ధ సామర్థ్యాన్ని తగ్గించివేస్తామనీ జెలెన్‌స్కీ దూకుడు ప్రదర్శిస్తున్నాడు. యుద్ధం మొదలైన 538వ రోజు రష్యాకు చెందిన బెల్గోరాడ్‌లోని వాయు రక్షణ విధానం (ఎయిర్ డిఫెన్స్ సిస్టం)పై గుర్తు తెలియని ఏరియల్ వెహికిల్స్‌తో షట్‌డౌన్ అయిందని రష్యా ప్రకటించింది. రష్యా నగరాలపై వరుసగా ఉక్రెయిన్ డ్రోన్ దాడులు జరుగుతునే వున్నాయి. నియో నాజీ కోరిందే తడవుగా సామ్రాజ్యవాదులు సైనిక సామగ్రిని సమకూరుస్తూ యుద్ధాన్ని పొడగిస్తూ యుద్ధ బెహారిలు తమ లాభాల పంట పండించుకుంటున్నారు.

### ఉక్రెయిన్‌కు అందుతున్న సైనిక సహాయంపై రష్యా వైఖరి:

అమెరికా-నాటో కూటమి జెట్ ఫైటర్ విమానాలను అందచేస్తే యుద్ధాన్ని మరింత పొడగించడమే అవుతుందనీ, ఐదవ వంతు ఉక్రెయిన్ భూభాగాన్ని ఆక్రమించి వుండి ఇపుడు కీవ్ కోసం పోరాడుతున్న రష్యా హెచ్చరించింది. డెన్మార్క్ నుండి మొత్తంగా 19 ఎఫ్-16 అందనున్నాయనీ, నెదర్లాండ్ 42 ఎఫ్-16లను ఇస్తుందనీ, ఆ దేశాలు సైనిక 'సహాయం' అందిస్తూ ఉక్రెయిన్‌ను రెచ్చగొడుతున్నాయనీ, అది శాంతికి సిద్ధపడకుండా అడ్డుకుంటున్నాయనీ, యుద్ధాన్ని పొడగిస్తున్నాయనీ రష్యా విమర్శిస్తున్నది. ఇది ఇలా వుండగా, రష్యాకు సమీపంలోని ఆర్కిటిక్ తీరంలో నార్వేకు చెందిన మిగ్-29 జెట్ చక్కర్లు కొట్టినట్లు రష్యా ఆరోపించింది. బెలరుస్ సరిహద్దులకు పోలాండ్ 10 వేల సైన్యాలను పంపడం యుద్ధ విస్తరణకు అద్దం పడుతుంది. రష్యా సముద్ర జలాల నిఘా బాంబర్ విమానాలు స్కాట్లాండ్‌కు ఉత్తరాన అంతర్జాతీయ వాయు మండలంలో తిరిగినట్లు యూ.కే. ఆరోపించడం గమనార్హం.

### నెత్తురోడుతున్న సైన్యాలు, రక్తసిక్తమవుతున్న రణక్షేత్రాలు:

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యూరప్ ఎన్నడెరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. బాంబుల మోతలతో రెండు దేశాల భూభాగాలు దద్దరిల్లుతున్నాయి. శతఘ్నులు, సైనిక శకటాలు, క్షిపణుల దాడులు, అన్ని రకాల ఆధునిక ఆయుధాలు సైనికులను బలి తీసుకుంటు న్నాయి. రెండు దేశాలలోని పౌరుల జీవితాలను అలారం మోతలు శాసిస్తున్నాయి. ఆకాశ దాడులను పసిగట్టిన రాడార్ సందేశాలతో సైన్యం వినిపించే అలారం మోతలతో దేశవాసులు తల్లడిల్లిపోతూ తలదాచుకోవడానికి బంకర్‌లలోకి పరుగులు పెడుతున్నారు. యుద్ధ రంగం నుండి వాస్తవ లెక్కలు అందడం అనూహ్యం. ఒకరు మరొకరి నష్టాలను అధికం చేసి చెప్పడం యుద్ధంలో సర్వసాధారణం. ఐక్యరాజ్యసమితి (ఐరాస) పక్షపాత రహితంగా వుంటుందని నమ్మలేం. అయినప్పటికీ అది అందిస్తున్న లెక్కలే ప్రపంచం ముందు వెల్లడవు తున్నాయి.

ఐరాస మానవ హక్కుల హై కమిషనర్ అందించిన లెక్కల ప్రకారం, 2023 జులై చివరి నాటికి 9 వేల మంది పౌరులు మరణించి 16 వేలకు పైగా గాయపడినట్లు తెలుపుతూ వాస్తవాలు ఇంతకు అనేక రెట్లు అధికంగా వుంటాయంది. యుద్ధంలో దాదాపు 5 లక్షలకు పైగా సైనికులు గాయపడడమో, ప్రాణాలు కోల్పోవడమో

జరిగిందనీ ఉక్రెయిన్‌ను సమర్థిస్తున్న అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో లక్షా 20 వేల మంది రష్యా సైనికులు, అధికారులు మరణించగా, లక్షా 80 వేల మంది గాయపడ్డారని అమెరికా అంచనా వేసింది. ఉక్రెయిన్ విషయానికి వస్తే 70 వేల మంది ఉక్రెయిన్ సైనికులు, అధికారులు మరణించగా, లక్షా 20 వేల మంది క్షతగాత్రులైనట్లు పేర్కొంది. ఈ వార్తలు నిరాధారమైనవనీ, తమ మరణాలను అధికం చేసి ప్రకటించారనీ రష్యా రక్షణ మంత్రి సర్గోయి షోయిగు ఖండించాడు. యుద్ధ నీతిలో భాగంగానే రష్యా, ఉక్రెయిన్‌లు అధికారికంగా తమ నష్టాలను వెంట వెంట ప్రకటించడం లేదు.

ఉక్రెయిన్‌లోని రష్యా అనుకూల అధ్యక్షుడిని 2014లో అమెరికా ఉక్రెయిన్‌లు కలిసి మైదన్ విప్లవం పేరుతో గద్దె దింపిన తరువాతి నుండి 2021 వరకు తూర్పు ఉక్రెయిన్‌లో నియో నాజీ ఉక్రెయిన్ బలగాలు ఊచకోత కోసిన 14 వేల మరణాలు ప్రపంచం దృష్టిలో వున్నవే.

### యుద్ధంలో అవినీతి, మోసాలు, బర్బర హత్యలు:

యుద్ధంలో అవినీతి, మోసాలు, బర్బర హత్యలు షరా మామూలే. 2022 జులైలో ఒక మిస్సైల్ దాడి జరిపి ముగ్గురు పిల్లలతో పాటు 23 మంది ఉక్రెయినియన్‌ల హత్యకు కారకుడైన రష్యా సబ్ మెరైన్ కమాండర్ స్టనిస్లావ్ ‌జిట్స్కీని 2023 జులై 10 నాడు ఉదయం రన్నింగ్ చేస్తున్న సమయంలో గన్‌మాన్ (అంగరక్షకుడు) కాల్చి చంపినట్లు టాస్ (టీ.ఏ.ఎస్.ఎస్) తెలిపింది. ఉక్రెయిన్ మిస్సైల్ దాడిలో దక్షిణ ఉక్రెయిన్‌లో రష్యా బలగాలకు నాయకత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ఓలెగ్ సోకోవ్ మరణించినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఉక్రెయిన్ సైన్యంలో రక్షణ మంత్రి ఓలెక్సీ రెజినికోవ్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో సెప్టెంబర్ ప్రారంభంలో జెలెన్‌స్కీ అతన్ని తొలగించాడు. ఆయన స్థానంలో రుస్తెం ఉమెరోవ్‌ను నియమించారు. జనవరిలో ఉక్రెయిన్ సహాయ రక్షణ మంత్రి యాచెస్లావ్ షాపోవాలోవ్ అవినీతి ఆరోపణలపై రాజీనామా ఇచ్చిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ భద్రతా దళాలకు చెందిన మేజర్ జనరల్ విశ్వాసఘాతుకానికి పాల్పడుతూ రష్యాకు రహస్యాలు చేరవేస్తూ గూఢచర్యం చేస్తున్నాడనీ 12 సంవత్సరాల జైలు శిక్ష విధించారు.

పై పరిణామాల నేపథ్యంలోనే పుతిన్‌కు అత్యంత సన్నిహితుడైన **ప్రిగోజిన్** నిర్వహిస్తున్న **వాగ్నార్** గ్రూప్ ప్రైవేట్ సైన్యాలు రష్యాపైనే తిరుగుబాటుకు తలపడ్డాయి. ఈ సైన్యాలు ఉక్రెయిన్ కు చెందిన బఖ్ముత్‌ను స్వాధీనపర్చుకోవడంలో కీలక పాత్ర పోషించాయి. ఉక్రెయిన్ యుద్ధ నిర్వహణలో రష్యా సైనిక అధికారులకు, ప్రిగోజిన్‌కు మధ్య తలెత్తిన విభేదాలతో జూన్ 24నాడు తన 25వేల ప్రైవేట్ సైన్యాలతో ప్రిగోజిన్ మాస్కో మార్చ్ తలపెట్టి బెలరుస్ అధ్యక్షుడు లుకాషెంకో మధ్యవర్తిత్వంతో వెంటనే అంతా సద్దుమణిగింది. కానీ, పూర్తిగా రెండు మాసాలు తిరగక ముందే ఆగస్టు 23నాడు ఒక విమాన దుర్ఘటనలో ప్రిగజోన్ మరణించాడు. నమ్మక ద్రోహాలు యుద్ధాలలో కొత్తేమీ కాదు. అందుకే **ఎవ్రీ థింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్** అంటారేమో!

### యుద్ధంలో కాందిశీకులు:

రష్యా దాడులు ప్రారంభమైన తరువాత 4 కోట్ల 10 లక్షల ఉక్రెయిన్ జనాభాలో అంతర్గతంగా నిరాశ్రయులైన 50 లక్షల మందిని కలుపుకొని దాదాపు కోటి 76 లక్షల మంది పౌరులు కాందిశీకులుగా పొరుగు దేశాలకు తరలి వెళ్లారు. వీరిలో యూరప్‌లోనే 63 లక్షల మంది వుంటారు. యుద్ధం ప్రారంభమైన వెంటనే ఉక్రెయిన్ ప్రభుత్వం 18-60 సంవత్సరాల మధ్య వయస్సులు దేశంలోనే వుండి పోరాడాలనీ తాఖీదులు ఇచ్చిన నేపథ్యంలో వలస వెళ్లిన వారిలో స్త్రీలు, పిల్లలే అత్యధికంగా వున్నారు.

రష్యా స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ భూభాగాల విషయానికి వస్తే అమెరికా ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న వివరాల ప్రకారం 11 శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా కైవశం చేసుకుంది. దీనికి 2014లో రష్యా ఆక్రమించిన క్రిమియాను కలిపితే, 17.5 శాతం (లక్షా ఆరు వేల చదరపు కిలోమీటర్లు) అవుతుందని లెక్కలు కడుతున్నారు. సారవంతమైన తీర ప్రాంతం కోల్పోయి, ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై పలు పట్టణాలు బంజరు భూముల్లా మిగిలాయనీ తెలుపుతోన్నాయి.

### డోలాయమానంలో యుద్ధ ఆర్థిక వ్యవస్థలు-అధిక ధరలతో ప్రజల అవస్థలు:

యుద్ధ పీడిత ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ 2022లో 30 శాతం కుంచించుకుపోగా, 2023లో 1 నుండి 3 శాతం మెరుగుపడే అవకాశాలున్నాయనీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి తెలుపుతోంది. ఐ.ఎం.ఎఫ్. అందిస్తున్న లెక్కల ప్రకారమే యుద్ధంతో 2.1 శాతం కుదించుకుపోయిన రష్యా ఆర్థిక వ్యవస్థ ఈయేడు 1.5 శాతం పుంజుకుంటుందని తెలిపింది. యుద్ధం తీవ్రతరం అవుతుండగా ఆర్థిక వ్యవస్థలు పుంజుకోవడం పరస్పర విరుద్ధంగానే వుంటుంది. కానీ, ఉక్రెయిన్ విషయానికి వస్తే సామ్రాజ్యవాదులు అందిస్తున్న పాకేజీలతో కోలుకుంటుండడం వుండగా, రష్యా విషయానికి వస్తే అమెరికా, పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు దానిపై విధించిన ఆంక్షలను లెక్కచేయకుండా లాభాల వేటలో అనేక దేశాలు రష్యాతో చేసుకుంటున్న పీటముడి వ్యాపార ఒప్పందాలే దాని పుంజుకోవడం వెనుక గల అసలు కారణం. ఈ పుంజుకోవడాలు ప్రజల సంక్షేమం కన్నా ఆయా దేశాలు పెంచుతున్న రక్షణ వ్యయాలకే అధికంగా ఖర్చు అవుతున్నాయి. రష్యా 2023లో తన రక్షన వ్యయాన్ని 100 మిలియన్ డాలర్లకు పెంచి గతం కన్నా రెండింతలు చేసింది. 1917నాటి బోల్షివిక్ విప్లవం తదుపరి మొదటిసారి రష్యా విదేశీ ఋణాల చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. 2022 మార్చ్ తదుపరి మొదటిసారి 2023 ఆగస్టులో డాలర్‌తో రూబుల్ మారకం 100కు పడిపోయింది. యూరోతో 17 నెలల అథమ స్థానానికి చేరి 117.73కు దిగజారింది.

ప్రపంచంలోనే ఇంధన ఎగుమతులలో సౌదీ అరేబియా తర్వాతి స్థానం రష్యాదే. గోధుమలు, నత్రజని ఎరువులు, పల్లాడియం (ప్లటినం లాంటి తెల్లని లోహం), సహజ వాయువుల విషయంలో రష్యా

ప్రపంచంలోనే అతి పెద్ద ఎగుమతిదారు. యుద్ధం మూలంగా వీటి ధరలు ఇపుడు 2008 ఆర్థిక సంక్షోభం తరువాతి కాలంలో ఎన్నడెరుగని స్థాయికి పెరిగాయి.

### యుద్ధం వద్దంటూ శాంతి కోరుతున్న చర్చలు:

యుద్ధంలో నిమగ్నమైన ఇరు పక్షాలు సిద్ధపడకుండా శాంతి చర్చలకు అర్థం వుండదు, అవకాశం వుండదు. గత 19 మాసాలుగా యుద్ధంలో మునిగిన రష్యా పక్షాన చైనా, సౌదీ అరేబియా తదితర దేశాలు శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తుండగా, అమెరికా-నాటో కూటమి అందుకు చిత్తశుద్ధితో సహకరించడం లేదనీ, పైన వివరంగా తెలిపిన యుద్ధోన్మాద చర్యలే తేటతెల్లం చేస్తున్నాయి. భారతదేశం యుద్ధంలో మునిగిన దేశాల నుండి లాభాలు పిండుకోవ డానికే తెగపడుతుంది తప్ప నిజాయితీతో శాంతి చర్చలలో 'విశ్వగురువు' పాత్ర పోషించడం లేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆయుధాల దిగుమతిదారైన భారతదేశం ఇప్పటికీ ప్రధానంగా రష్యా టెక్నాలజీపైనే ఆధారపడుతుందనే వాస్తవాన్ని ఈ సందర్భంగ గుర్తుచేసుకోవడం సముచితంగా వుంటుంది. రష్యా నుండి ఎస్-400 ఆంటీ-ఎయిర్ క్రాఫ్ట్ సిస్టంను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి చర్యలతో అది తాను వల్లించే 'వసుధైవ కుటుంబకం' డొల్లతనాన్ని బయటపెట్టుకుంటున్నది.

సౌదీ అరేబియాలోని తీర పట్టణం జిద్దాలో ఆగస్టు 5నాడు జరిపిన శాంతి చర్చలు పై నేపథ్యంలోనే ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఆ చర్చలలో అమెరికా, ఈయూ, చైనా, ఇండియా, బ్రెజిల్ మున్నగు దేశాలు వున్నాయి, కానీ యుద్ధానికి ఒడిగట్టిన రష్యా లేకపోవడం గమనార్హం. అయితే, రష్యా మాత్రం ఆ చర్చలను ఆహ్వానించింది. కాగా, ఉక్రెయిన్ తిరకాసు షరతులతో కాలద్దడంలో విడ్డూరమేమీ లేదు. యుద్ధ బందీలందరినీ విడుదల చేయాలనీ, యుద్ధ నేరాలకు రష్యా బాధ్యత పడాలనీ, యుద్ధ నష్ట పరిహారంగా 150 బిలియన్ డాలర్లను రష్యా చెల్లించాలనీ ఇలాంటివే మరో పుండు మీద కారం చల్లే 10 షరతులను ఉక్రెయిన్ విధించింది. జూన్‌లో కోపెన్‌హగ్‌లో కూడ ఇలాంటి నిష్ఫల శాంతి చర్చలు జరగడం తెలిసిందే. జర్మనీ ఛాన్సలర్ షోల్జ్ మాత్రం ఉక్రెయిన్ నయా నాజీలకు ఆయుధాలు అందిస్తూనే శాంతి చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టకూడదంటూ, ఇలాంటి తప్పుడు మార్గాలు ఎన్నుకోవడం పొరపాటని రష్యా గుర్తించేలా వత్తిడి పెంచాలనీ వక్కాణించడం జర్మనీ నాజీ స్వభావాన్ని బయటపెడుతుంది.

రష్యా సైతం శాంతి చర్చలను స్వాగతిస్తూనే, తాను ఆక్రమించుకున్న తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్స్క్, లుహాన్స్క్, ఝపోరిఝ్ఝియా, కెర్సాన్, క్రిమియాలలో సెప్టెంబర్ 10నాడు ఎన్నికలు నిర్వహించింది. ప్రజాభిప్రాయం తనకు వుందనీ, ఆ భూభాగాలు రష్యా కిందికే వస్తాయనీ ప్రకటించింది. ఈ చర్యను అనేక దేశాలు ఖండించాయి. ఈ చర్య శాంతి చర్యలకు భంగకరమనీ ఉక్రెయిన్ నీతి వాక్యాలు వల్లించింది.

### అణు యుద్ధ ప్రమాద హెచ్చరికలు:

ప్రపంచం మీద అణు యుద్ధం నీడ విస్తరిస్తున్నదని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ హెచ్చరించాడు. అమెరికాలోని శాంతి గ్రూపులు అమెరికా భారీ సైనిక వ్యయాన్ని నిలిపివేయాలనీ, తద్వారా ప్రపంచంపై వేలాడుతున్న అణుయుద్ధ ముప్పును నివారించాలనీ విజ్ఞప్తి చేశాయి. రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వదేవ్ ఇటీవలే, రష్యా బలగాలపై ఉక్రెయిన్ విజయం సాధించనున్న పక్షంలో రష్యా న్యూక్లియర్ ఆయుధాలను వినియోగించాలనీ స్పష్టం చేశాడు. మా దేశ అంతరంగ భద్రతకు బయటి శక్తుల ద్వార ప్రమాదం ఏర్పడినపుడు న్యూక్లియర్ ఆయుధాలను వినియోగించడం అనివార్యం అవుతుందనీ రష్యా విదేశాంగ మంత్రి సర్గెయి లావ్రోవ్ అన్నాడు. అమెరికా-నాటో కూటమి న్యూక్లియర్ శక్తితోనే సాయుధ ఘర్షణకు అంతం పలకదలచుకున్నారనీ అన్నాడు. పొరుగున వున్న నాటో దేశాలైన పోలాండ్, లిథ్వేనియా, లాత్వియా లాంటి విదేశీ శక్తులు దాడి చేస్తే మా దేశంలో రష్యా మొహరించిన న్యూక్లియర్ ఆయుధాలను వినియోగిస్తామని బెలరుస్ అధ్యక్షుడు లూకాషెంకో స్పష్టం చేశాడు.

మరోవైపు అమెరికాలోని యుద్ధ విధానాలను అధ్యయనం చేసే మేధావుల బృందం రష్యా ఉక్రెయిన్‌ను బెదరించడానికి పశ్చిమ దేశాలను నీరు కార్చడానికి న్యూక్లియర్ ఆయుధాల గురించి ప్రస్తావిస్తున్నది కానీ, అది వాస్తవంగా వాటిని వినియోగించలేదనీ జోస్యం చెపుతోంది. చైనా మాత్రం అమెరికా-నాటో కూటమి ఉక్రెయిన్‌ను సైనికీకరిస్తున్నందున శాంతి నెలకొనదని, ఆయుధాలు యుద్ధాలనే వరిస్తాయనీ హితవు పలికింది.

### యుద్ధ వ్యతిరేక శాంతి ప్రియులపై పెరుగుతున్న దాడులు:

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సహ 15 దేశాలలోని మావోయిస్టు పార్టీలు, గ్రూపులు వర్తమాన సామ్రాజ్యవాద ప్రాతినిధ్య యుద్ధానికి (ప్రాక్సీ వార్) వ్యతిరేకంగా నిజమైన శాంతి ప్రియులతో కలిసి ముందు పీఠిన నిలిచాయి. యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చడమే ఆ దేశాల కార్మికవర్గ అగ్రగామి దళాల కర్తవ్యం అని అవి పేర్కొన్నాయి. ఆ అన్ని పార్టీల విప్లవ చర్యలను ఆయా దేశాల ఫాసిస్టు ప్రభుత్వాలు భీషణ అణచివేత చర్యల ద్వార అడ్డుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నిజమైన శాంతి కోసం కృషి చేస్తున్న సంస్థలు, గ్రూపులు మరెన్నో వున్నాయి.

కాగా, ఉక్రెయిన్‌లో అనేక మంది వామపక్షాల నాయకులను, యువ నాయకుడు కొనొనోవిచ్, ఆయన సోదరుడు మైఖేల్‌లను గృహ నిర్బంధంలో వుంచారు. తమకు నియో నాజీల నుండి ప్రాణాపాయం వుందని వారు తెలుపుతున్నారు. వారి అరెస్టును ప్రపంచ వామపక్షాల, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఖండించారు. రష్యాలో ప్రతిపక్ష నాయకుడు నవల్నీ సైబీరియాలో 19 ఏళ్ల ప్రవాస శిక్ష అనుభవిస్తున్నాడు. ఆయనను ఉగ్రవాద సంస్థలు నడుపుతున్నాడనీ ఆయన్ని విచారిస్తున్నారు. రష్యన్ స్ప్రింగ్‌గా ప్రాచుర్యం పొందిన అక్కడి నిఘా విభాగాల అధికారి ఐగోర్ జిర్కిన్ (ఐగోర్ స్ట్రెల్కోవ్) ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడనీ విచారణకు గురయ్యాడు.

ఇటీవల ముగిసిన బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) సభల సందర్భంగా బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ

# ఛత్తీస్‌గఢ్ బూటకపు విధానసభ ఎన్నికలను బహిష్కరించండి

# దేశ ప్రజల ప్రధాన శత్రువైన బ్రాహ్మణీయ హిందుత్వ బీజేపీని తన్ని తరమండి

# సామ్రాజ్యవాద, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించే కాంగ్రెస్‌ను వ్యతిరేకించండి

# మిగితా పార్టీలను ప్రజల సమస్యలపై నిలదీయండి

ఆర్.ఎస్.ఎస్.మోప్లాన్‌ను ఓడిద్దాం, జనతన సర్కార్లను
కాపాడుకుంటూ పటిష్టం చేద్దాం

2023 నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ సమయంలోనే దేశంలోని మిగితా కొన్ని రాష్ట్రాలలో కూడ విధానసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల పార్టీలు అప్పుడే తమ ప్రచార కార్యకలాపాలను, అభ్యర్థుల ఎంపికను ప్రారంభించాయి. ప్రతిపక్ష పార్టీలు "పరివర్తన్ యాత్ర" లు చేపడుతున్నాయి. అధికారం కోసం కుమ్మక్కు, కుమ్ములాటలు, అభ్యర్థిత్వ టికెట్ల కోసం తగువులాటలు తీవ్రమవుతున్నాయి. పాలకపక్షంపై సహజంగానే ప్రజలలో వుండే వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికి ప్రతిపక్షాలు పోటీ పడుతున్నాయి. కులాలు, మతాల ప్రాతిపదికన ప్రజలను చీల్చి ఓట్లు దండుకోవడానికి కావలసిన కసరత్తులు మొదలయ్యాయి. మన దేశంలో ఓటర్లను వశపరచుకోవడానికి, ఓట్లను కొనుక్కోవడానికి కావలసిన డబ్బుల సేకరణ, మద్యం, ఇతర ఉచితాలు కోసం రాజకీయ పార్టీల పెంపర్లాట మొదలైంది. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలతో కూడిన హామీల పత్రాలు (ఎన్నికల ప్రణాళికలు) వెలువడుతున్నాయి. ఓట్లను గెలుచుకునే ఎత్తుగడలలో భాగంగా కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ల ధరలను రూ. 200 తగ్గించింది. వర్షాకాల సమావేశాలలో నూతనంగా పలు తెగలను, కులాలను ఆదివాసీ జాబితాలో చేర్చింది. ఇవన్నీ ఎన్నికల స్టంట్లు తప్ప ప్రజల మేలు కోరి కాదనేది తెలియందెవరికి?

మరోవైపు ఎన్నికల కమిషన్ సకాలంలో ఎన్నికల తంతును పూర్తి చేయడానికి, దానికి ప్రజాస్వామ్య ముద్ర వేసుకోవడానికి అవసరమైన చర్యలకు ఉపక్రమించింది. ఓటర్లు విధిగా ఓట్లు వేయాలనీ, అది ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటర్ బాధ్యత అనే పసలేని ప్రచారాన్ని ప్రచార, ప్రసార మాధ్యమాలలో హోరెత్తిస్తున్నది. ఓటర్ కార్టుకు, ఆదార్ కార్డుకు లంకె పెట్టి కొత్త ఓటర్ల ఓటర్ కార్డుల తయారీకి తేదీలు ప్రకటించింది. ఎన్నికల సక్రమ నిర్వహణ పేరుతో కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీ.ఏ.పీ.ఎఫ్) తరలింపుకు, మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలకు భారీ తరలింపుకు పథకం

---

సిల్వా మాట్లాడుతూ ఐరాస ఉక్రెయిన్ సమస్యను తప్ప మరే అంతర్జాతీయ సమస్యను తీవ్రంగా పరిగణించడం లేదనీ, విమర్శించాడు. హైతీ, యెమన్, సిరియా, లిబియా, సూడాన్, పాలస్తీనాలు ఎదుర్కొంటున్న సమస్యలను, సంక్షోభాలను అంతర్జాతీయ సంస్థ తీవ్రంగా పరిగణించడం లేదన్నాడు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక-ఆర్థిక సంక్షోభం తీవ్రతరం అవుతుంటే, కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా 74 కోట్ల మంది ప్రజలను ఆకలికి మాడుస్తూ రెండు లక్షల కోట్ల డాలర్లను సైనిక రంగంపై ఖర్చు పెట్టారనీ, ఇది ఆమోదయోగ్యం కాదని అన్నాడు. ఆ సమావేశంలోనే పుతిన్ ఉక్రెయిన్ యుద్ధం గురించి మాట్లాడాడు. కొన్ని దేశాలు (అమెరికా-నాటో, దానితో కుమ్మక్కైన తూర్పు యూరప్) ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా ఉక్రెయిన్‌లో సంక్షోభానికి పూనుకున్నాయన్నాడు. డాన్‌బాస్ ప్రజలకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలు వాటి ఉపగ్రహ దేశాలు ఉక్రెయిన్‌లో సృష్టించిన యుద్ధ నిలుపుదలకు మనం అక్కడ ఏం చర్యలు చేపడుతున్నామనే దానిపై ఆధారపడి వుంటుంది అన్నాడు. ఈ సమస్యకు ముగింపు చెప్పడానికి శాంతియుత పద్ధతులలో సమస్య పరిష్కారానికి పాటుపడుతున్న బ్రిక్స్ మిత్రులకు కృతజ్ఞతలు అన్నాడు.

సామ్రాజ్యవాదం వున్నంత వరకు ఈ భూమ్మీద యుద్ధాలు అనివార్యం. ప్రజలు నిరంతరం శాంతిని కోరుకుంటారు. ఆ శాంతి సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడం ద్వారానే సాధ్యం.

★

---

"నేటి సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలనేది ఒక్కటే సరైన కార్మికవర్గ నినాదం. ఇది కమ్యూన్ అనుభవం నుండే నిగ్గు తేలిన నినాదం,........అలా మూర్పు చేయడం ఎంతటి కష్టమైన పనిగా కనిపిస్తున్నప్పటికీ, యిప్పుడిక యుద్ధం వాస్తవంగా వచ్చేసింది కనుక, అలాంటి మార్పు సాధించే దిక్కుగా క్రమబద్ధంగా, నిర్విరామంగా, అచంచలంగా సన్నాహక కృషి జరపడాన్ని సోషలిస్టులు ఎన్నటికీ వదలుకోరు"

"ఆ ఒకే దారిలో మాత్రమే కార్మికవర్గం, దురహంకారపూరితమైన పెట్టుబడిదారులపై ఆధారపడి వుండే స్థితిని విదిలించుకొని, ఏదో ఒక రూపంలో, త్వరితంగానో లేదా మరికొంత నిదానంగానయినా సరే, జాతులకు నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించే దిశగానూ, సోషలిజం దిశగానూ ఖచ్చితంగా అడుగువేయగలుగుతుంది"

(లెనిన్ రచనలు, సంపుటి 21, పేజీ 34)

సిద్ధం చేస్తున్నది.

ఒక వైపు రాజకీయ పార్టీల తయారీలు, మరోవైపు అధికార సంస్థల సన్నాహాలు వేగం పుంజుకుంటుంటే, ప్రజలలో మరో రకమైన వాతావరణం చోటుచేసుకుంటున్నది. ఏ రాజకీయ పార్టీకి ఓటు వేసినా తమ జీవితాలలో మౌలికమైన మార్పు ఏం వుంటున్నదనే ప్రశ్న ఆలోచనా పరులను సతాయిస్తున్నది. ప్రజా సమస్యలు యేటేటా పేరుకుపోతుంటే రాజకీయ పార్టీలు పరస్పరం నిందించుకోవడం తప్ప వాటి పరిష్కారానికి చేసిందేముంది? అనే ప్రశ్న జీవిత ఆచరణ నుండి వారి ముందు తలెత్తుతున్నది. ఇంతకాలం ఎన్నికల పార్టీల జెండాలలో, పేర్లలోనే తేడా తప్ప విధానాలలో తేడా లేదని అర్థమైన ఓటర్ల ముందుకు ఈ మధ్య సంవత్సరాలలో ఒక ప్రత్యేక ఎజండాతో ముందుకు వస్తున్న హిందుత్వ శక్తుల ప్రమాదం తీవ్రంగా సతాయిస్తున్నది.

హిందుత్వ శక్తుల రాజకీయ పార్టీగా బీజేపీ కేంద్రంలో గత పదేళ్లుగా అధికారాన్ని చలాయిస్తున్నది. అనేక రాష్ట్రాలలో ఆ పార్టీ అధికారంలో వుంది. దేశ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్లు, అనేక విశ్వవిద్యాలయాల వైస్-చాన్స్‌లర్లు సహ వివిధ ప్రభుత్వ సంస్థలలో, సైన్యంలో హిందుత్వ భావజాలం నిండిన శక్తులు ప్రాబల్యంలో వున్నాయి. కేంద్రంలో కానీ, విధానసభల ఎన్నికల సందర్భంగా గానీ పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలతో పాటుగా దాని మాతృసంస్థ ఆర్.ఎస్.ఎస్‌కు చెందిన ప్రచారకుల దండు, దాని వందకు పైగా అనుబంధ సంఘాల మంద వచ్చి గ్రామాలను, పట్టణాలను, నగరాలను ఆక్రమించుకుంటాయి. అవి మత విద్వేషంతో, మతోన్మాదంతో ప్రజలను చీల్చి ఓట్లు దండుకోవడానికి అనేక కుట్రలు, కుహకాలకు, భౌతిక దాడులకు పూనుకుంటాయి. దేశంలో బీజేపీని అధికారంలోకి తెచ్చిన బడా కార్పొరేట్ శక్తులు కాసుల వర్షాన్ని గుమ్మరించి ఓట్ల కొనుగోలు బేరానికి కావలసిన సొమ్మును అందిస్తుంటాయి. కేంద్రంలో అధికారాన్ని కలిగివున్న బీజేపీ తమ ఏలుబడిలోని రాష్ట్రాలకు కేంద్రం నుండి కావలసిని నిధులతో పాటు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందిస్తున్నది.

బీజేపీ నిన్నటివరకు రాంమందిర్ నిర్మాణం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ప్రచార అస్త్రాలుగా సంధించి ఓట్లను దండుకుంది. అదే సమయంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విష విద్వేషాన్ని వ్యాపింపచేస్తూ 'హిందువుల' ఓట్లను పొందడానికి అనేక అకృత్యాలకు పాల్పడుతు వస్తోంది. ప్రజల మనోభావాలను ఫణంగా పెడుతూ సమాజాన్ని చీల్చి ప్రజల మధ్య సామరస్యతను దెబ్బ తీస్తూ ముస్లిం సోదరుల జీవితాలలో అభద్రతా భావాన్ని, భయ బీభత్స వాతావరణాన్ని నిరంతరం నింపి వుంచుతుంది. ఇక ఇపుడు లింగ సమానత పేరుతో ఉమ్మడి పౌర చట్టాన్ని (యూనిఫాం సివిల్ కోడ్) సమాజం మీదికి వదలింది. దళితులను, ఆదివాసులను హిందువులుగా వరిగణిస్తూ వారిని అన్ని విధాల లోబరుచుకోవడానికి పూనుకుంటున్నది. మోదీ ప్రవేశపెట్టిన సంస్కరణల పథకాలన్నీ ప్రధాన్ మంత్రి కిసాన్ ఫసల్ బీమా యోజన నుండి ఆయుష్మాన్ వరకు అన్నీ కార్పొరేట్లకు లాభాలు సమకూర్చేవే. ఇక 50 కోట్లకు పైగా నున్న జన్‌ధన్ ఖాతాలన్నీ కార్పొరేట్ల పెట్టుబడి సంచయనానికి ఉపకరిస్తున్నవే.

బీజేపీ తాను కార్పొరేట్ వర్గాలకు ముఖ్యంగా అదానీ, అంబానీ, జిందల్, నెకో, రూఈ, టాటా లాంటి ఘరాన శక్తులకు దేశ సంపదలను దోచి పెట్టడాన్ని, దేశంలోని అమూల్య వనరులను వారు యధేచ్ఛగా కొల్లగొట్టుకు పోవడానికి కావలసిన చట్టాలు చేయడాన్నీ, దేశంలో తమ ప్రజా వ్యతిరేక పాలననూ ప్రశ్నించే బుద్ధిజీవులను, పాత్రికేయులను, హక్కుల కార్యకర్తలను, వామపక్షాలను ఉపేక్షించడం లేదు. దేశంలోని ముఖ్యంగా మూలవాసీ ప్రాంతాల అడవులలోని ప్రకృతి సంపదలను కొల్లగొట్టుక పోవడానికి ఆ ప్రాంతాలను లక్షలాది పోలీసులతో నింపింది. దేశంలో నిరంకుశ పాలనను అమలు చేస్తూ నామమాత్ర ఫెడరల్ విధానాలను సైతం అంతం చేస్తున్నది. బీజేపీ ఒకే నాయకుడు, ఒకే జెండా, ఒకే సిద్ధాంతం పేరుతో ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నది. హిందూ, హిందీ, హిందుస్తాన్ దాని అన్వయింపుగా చెప్పుకోవచ్చు. దాని హిందుత్వ ఎజండా అమలులో విద్యా ప్రణాళిక ప్రాధాన్యతను గుర్తించిన బీజేపీ దేశంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తోంది. మరోవైపు వర్షాకాల సమావేశాలలో గ్రంథాలయాల చట్టం తెచ్చి దేశ ప్రజల మెదళ్లలోకి తన తిరోగమన భావజాలాన్ని నింపడానికి దారులు విశాలం చేసింది. ఇవన్నీ బీజేపీ విశిష్ట లక్షణాలు.

స్థూలంగా చెప్పాలంటే, సామ్రాజ్యవాద కార్పొరేట్ అనుకూల విధానాల అమలులో దూకుడు, దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడానికి 2047 లక్ష్యంగా పని చేయడం, హిందుత్వ ఎజండా అమలుకు కేంద్ర, రాష్ట్రాలలో అధికారాన్ని కైవశం చేసుకోవడానికి శతకోటి విధాల పూనుకోవడం అని చెప్పుకోవచ్చు. వీటిని బహిరంగంగా ఎన్నికల వేళ చెప్పుకొని ఓట్లు దండుకునే విశ్వాసం, సాహసం లేని ఆ శక్తులు, వారి చరిష్మా నాయకుడు మోదీ "సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్"తో తొలుత ఎన్నికల బరిలోకి దిగాడు. ఆ తరువాతి క్రమంలో సబ్ కా విశ్వాస్‌ను జోడించి, దానికి సబ్ కా ప్రయాస్‌ను కలిపాడు. ఇక పోతే మోదీ హైతో ముమ్కిన్ హై అనే నినాదాన్ని జోరుగా ప్రజలలోకి తీసుకెళ్లడం, డబుల్ ఇంజన్ సర్కార్ల గురించి కితాబులు ఇవ్వడం వారి వంచనా శిల్పానికి పరాకాష్ట.

ఇక ఇపుడు కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే, ఒక్క మాటలో చెప్పాలంటే, బీజేపీ అనుసరిస్తున్న విధానాలలో ముప్పాతిక కాంగ్రెస్ సుదీర్ఘ పాలనలో అమలులోకి తేవడానికి చేసిన ప్రయత్నాల కొనసాగింపేనని చెప్పుకోవచ్చు. బీజేపీ ఆ విధానాలకే కొత్తగా తమ నాయకుల పేర్లు పెడుతోంది. ఆ విధానాలనే దూకుడుగా అమలు చేస్తున్నది. దేశంలో ఎల్‌పీజీ (సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలైన భూమండలీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణ) విధానాలను ప్రవేశపెట్టిన ఘనత వారిదే. దాని ఫలితంగా ఛత్తీస్‌గఢ్‌లోని అడవులను వేలాది పోలీసులతో నింపుతూ రక్తసిక్తం చేసింది, చేస్తోంది వాళ్లే. మావోయిస్టు పార్టీని దేశ అంతరంగ భద్రతకు ఏకైన అతి పెద్ద ప్రమాదకారిగా గుర్తించింది ఆ పార్టీ హయాంలోనే. బాబ్రీమసీదు కూల్చివేతకు దారులు సుగమం చేసింది వారి కాలంలోనే! ఆదివాసులకు 32 శాతం రిజర్వేషన్‌లను నాటకీయంగా అడ్డుకుంటున్నది వాళ్లే. తుదకు రాష్ట్రంలోని 32 శాతం ఆదివాసులు తమ జీవిక సముపార్జనలో భాగంగా సేకరించుకునే తునికాకు

కోత కూలీ రేట్లయినా గత నాలుగేళ్లుగా పెంచకుండా తన ఆదివాసీ ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాన్ని చాటుకుంది. దేశంలో ఆదివాసీ ప్రజల హక్కులు, అధికారాలపై మొసలి కన్నీరు కారుస్తూ వారి ప్రగతి పాట పాడుతూ పెసా తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ వారికే దక్కుతుంది. అలాగే, గత 27 ఏళ్లుగా దానిని అమలు చేయకుండా బీజేపీతో పాటు కాంగ్రెస్ పార్టీ భీష్మించుకొని వుంది. కాకపోతే, ప్రజలను తీపి మాటలతో మోసగించడంలో ఆరితేరిన కాంగ్రెసీయులు మూల పెసాను సంపూర్ణంగా పక్కన పెట్టి రాష్ట్రంలో తనదైన పెసాను ముందుకు తెచ్చి మూలవాసీ ప్రజలను మోసం చేసింది.

రాష్ట్రాన్ని బీజేపీ 15 ఏళ్లు పాలించినపుడు ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వ విధానాలనన్నింటినీ వ్యతిరేకిస్తూ, ఎండగడుతూ ప్రజలలోకి వచ్చేది. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామనీ, ఆంగన్‌వాడీ కార్యకర్తల, హెల్పర్ల వేతనాలు పెంచుతామనీ, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపిస్తామనీ, మావోయిస్టుల పేరుతో అమాయక ప్రజలను పోలీసులు కాల్చి చంపడంపై న్యాయ విచారణ కొనసాగిస్తామనీ, ఆదివాసీ మహిళలపై పోలీసుల అత్యాచారాలపై దర్యాప్తు జరిపిస్తామనీ, ఆదివాసీల అడవులను కార్పొరేట్ వర్గాలకు అప్పచెప్పడాన్ని వ్యతిరేకిస్తామనీ, పెసా అమలు చేస్తామనీ అనేకానేక హామీలు ఇచ్చి, తుదకు బీజేపీ ప్రభుత్వంపై పెరిగిన ప్రజల వ్యతిరేకతను సొమ్ము చేసుకొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికార పగ్గాలు అందుకున్న తరువాత అవన్నీ గాలికి పోయాయి. బీజేపీ పాలనలో మావోయిస్టుల పేరుతో సాధారణ పౌరులను కాల్చి చంపిన నరసంహారాలలో ప్రాణాలు కోల్పోయింది మావోయిస్టులు కాదంటూ, వారంతా సాధారణ ప్రజానీకం అంటూ నిజాలను వెల్లడి చేస్తూ ప్రభుత్వ దర్యాప్తు కమిషన్‌లు సమర్పించిన నివేదికలపైన చర్చించి దోషులైన పోలీసు అధికారులను కుంటి సాకులతో కాలయాపన చేసిందే తప్ప శిక్షించ సాహసించలేదు.

కేంద్రంలోని కాంగ్రెస్ నాయకత్వం ముఖ్యంగా రాహుల్‌గాంధీ **"భారత్ జోడో"** నినాదంతో దేశం మొత్తం పాదయాత్ర జరిపి మోదీ విధానాలను, హిందుత్వను నిశితంగా విమర్శిస్తూ ప్రజల మధ్యకు వెళ్లగా, రాష్ట్రంలో మాత్రం మోదీ విధానాలనే మరో రూపంలో బఘెల్ అమలు చేస్తున్నాడు. అడవులకు, ఆదివాసులకు, పర్యావరణానికి నష్టం చేకూర్చే విధంగా హస్‌దేవ్ అడవుల నుండి ఆందాయి కొండల వరకు కార్పొరేట్ వర్గాలకు దారాదత్తం చేశాడు. రాహుల్ గాంధీ తన లోకసభ సభ్యత్వాన్ని లెక్క చేయకుండా, కోర్టు తీర్పులకు బెదరకుండా మోదానీ అవినీతి కుంబకోణాలను, హిందుత్వ విధానాలను ఢీకొంటుంటే, బఘెల్ మాత్రం కార్పొరేట్ వర్గాల సేవలో మునిగి హిందూ ఓట్ల కోసం **రాంగమన్‌పథ్** యాత్రలు నిర్వహిస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్‌లోని పోరాట ప్రజలతో కలిసి కేంద్రంలోని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోవడంలో బఘెల్ తన అసమర్థతను నగ్నంగా చాటుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణిని ఈ ద్వంద్వ నాయకత్వ చర్యలు ఎత్తిపడుతున్నాయి.

గత ఐదేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని సెక్షన్‌ల ప్రజలు తిరిగి అవే సమస్యలతో మరింత సతమతవుతుండడం చూస్తున్నాం. వాళ్లంతా మళ్లీ రోడ్ల మీదికి గతం కన్నా సంఘటితంగా వస్తున్నారు. గతం కన్నా బలంగా తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచుతున్నారు. గతం కన్నా శక్తిమంతంగా సివిల్, పోలీసు అధికారులను నిలదీస్తున్నారు. గతం కన్నా సమైక్యంగా ప్రజా వ్యతిరేక చర్యలను అడ్డుకుంటున్నారు. గతం కన్నా అధిక రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శిస్తూ వివిధ సెక్షన్ల పీడిత ప్రజలు కొత్త రాజకీయ నినాదాలతో తమ డిమాండ్లను ప్రకటిస్తున్నారు. మూలవాసులు స్వపరిపాలనను (అటానమస్ స్టేటస్) కోరుతున్నారు. గతంలో లేని విధంగా తమ గుర్తింపు, అస్థిత్వం, ఆత్మ గౌరవం కోసం, అడవుల కోసం, వనరుల కోసం, అధికారం కోసం పోలీసు కాల్పులను లెక్క చేయకుండా, అంకిత భావంతో నెలలు, సంవత్సరాల తరబడిగా తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై సామూహిక ధర్నాలు కొనసాగిస్తున్నారు. గతంలో లేని విధంగా స్థానిక నాయకత్వం ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నది. వీటన్నిటిని గత ఐదేళ్లలో ప్రజలలో పెరిగిన రాజకీయ పోరాట చైతన్యంగానే గుర్తించాలి.

ప్రజా పోరాటాలతో పెరిగిన ప్రజా చైతన్యాన్ని అనుసరించి బూటకపు విధానసభ ఎన్నికలను బహిష్కరించాలనీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ ప్రజా రాజకీయ పోరాట చైతన్యం ఎన్నికలలో పాల్గొనడం ద్వారా వచ్చింది కాదు. ఎన్నికల పార్టీలు ప్రజా పోరాటాల ముందుండి నడపడం ద్వార ఒనగూడింది కాదు. ఎన్నికల పార్టీలన్నీ ఏదో రూపంలో ప్రజా పోరాటాలను నీరు గార్చడానికే పూనుకున్నాయి. సంస్కరణవాదానికి బలి పెట్టడానికే చూశాయి. కాబట్టి ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలనే మార్గంగా ఎన్నుకోవాలి తప్ప బూటకపు ఎన్నికలలో పాల్గొని ప్రతినిధులను ఎన్నుకోవడం కాదని సీపీఐ (మావోయిస్టు) పార్టీ స్పష్టం చేసింది.

ప్రజలు తమ సమస్యలపై దృఢంగా నిలబడి పోరాడడం, డిమాండ్లు సాధించుకోవడం లేద వాటి కోసం నిరవధిక పోరాటాలు కొనసాగించడం వెనుక రాష్ట్రంలోని అనేక జిల్లాలలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం కొనసాగిస్తున్న గెరిల్లా యుద్ధం ఒక గొప్ప శక్తిగా పని చేస్తున్నది. అలాగే ఆ పార్టీ నాయకత్వంలో పని చేస్తున్న విప్లవ ప్రజా సంఘాల సమరశీల పాత్ర ఆ శక్తికి పెద్ద అండగా వుంది. వాటి సమ్మిళిత కృషి, సమాహిత పాత్ర ఫలితంగా, వాటి అండదండలతో, రక్షణలో అనేక జిల్లాలలో ఏర్పడి పని చేస్తున్న జనతన సర్కార్ల భూమిక ఈ మొత్తం ప్రక్రియలో విశిష్టమైనది. ఇవేవీ లేకుండా ఈ రకంగా ప్రజా పోరాటాలు, ప్రజా పోరాట చైతన్యం పెంపొంది వుండేదికాదనీ ఘంటాపథంగా చెప్పవచ్చు. కాబట్టి ప్రజలు తమ హక్కుల సాధన కోసం, తమ అడవుల కోసం, తమ వనరుల కోసం, తమ గుర్తింపు, అస్థిత్వం, ఆత్మ గౌరవం కోసం విప్లవ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో పోరాడాలి. విప్లవ ప్రజా సైన్యాన్ని పటిష్ఠం చేసుకొని పెంచుకోవాలి. విప్లవ ప్రజా సంఘాలను

బలోపేతం చేసుకోవాలి. కాకపోతే, దోపిడీ ప్రభుత్వాలు వాటిపై నిషేధం విధించిన నేపథ్యంలో ప్రజలు వివిధ మార్గాలలో అందుకు చాకచక్యంగా పూనుకోవాలి. అవే ప్రజా సమస్యల నుండి, దోపిడీ నుండి, అణచివేత నుండి, ఆధిపత్యం నుండి, మతోన్మాదం నుండి, కుల సంకెళ్ల నుండి నిజమైన విముక్తికి బాటలు వేస్తాయి. ఓట్లతో, ఎన్నికల పంథాలో, దోపిడీ పార్టీల నాయకత్వంలో, సంస్కరణవాద చట్టాలతో అయ్యే పని కాదు.

దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను స్థూలంగా పైన పేర్కొన్నాం. ఇలాంటి పరిస్థితులలో ఎన్నికలలో పాల్గొనాల్సిన అవసరం లేదని పార్టీ స్పష్టం చేస్తున్నది. కాగా, ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే ఎన్నికల పార్టీల పట్ల ప్రజలు ముఖ్యంగా విప్లవ ప్రజలు ఏ వైఖరిని అనుసరించాలనే విషయంలో పొరపడకుండా వుండాలి. ఆయా రాజకీయ పార్టీల యెడల స్పష్టమైన రాజకీయ వైఖరితో వ్యవహరించాలి.

బీజేపీ విషయంలో పైన చాలా వివరంగా పేర్కొన్న నేపథ్యంలో ఆ పార్టీని గ్రామాలలోకి రానీయకూడదు. అది మన దేశ ప్రజల ప్రధాన శత్రువు. ఇటీవల అమెరికాలో ఒక రిపబ్లికన్ పార్టీ నాయకుడు మాట్లాడుతూ "మోదీని ముందుకు తెచ్చిన జాతీయ భావజాలాన్ని గుర్తు చేస్తూ "ఇదేదో (మోదీ పాలన) గంపగుత్తగా నిరంకుశంగా వ్యవహరించడం కాదు, హిట్లర్‌ను సంపూర్ణంగా సమర్థించే సంస్థాపకులు చాలా పకడ్బందీగా పొందుపరిచిన సంఘటిత వుద్యమంగా దీనిని చూడాలి" అన్నాడు. అలాగే, "వాళ్లు కేవలం భారతదేశానికి మాత్రమే ప్రమాదంగా భావించకూడదు. వాళ్లు ముస్లింలకు మాత్రమే ప్రమాదం అనుకోకూడదు. వాళ్లు క్రైస్తవులకు ముప్పుగా అర్థం చేసుకోకూడదు. వాళ్లు ప్రపంచ శాంతికి ప్రమాదకారులు" అన్నాడు. అలాంటి హిందుత్వ ఉగ్రవాద శక్తులను ప్రజల వద్దకు రానీయకూడదు. వాళ్లు ఓట్ల కోసం ఎన్నికల వేళ ప్రచారానికి వస్తే తన్ని తరమాలి.

కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వస్తే, ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించారనీ, గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదనీ, భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన వాటిని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో చిత్తశుద్ధితో అమలు చేయలేదని దాని విధానాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. హస్‌దేవ్ అడవుల నుండి రావ్‌ఘాట్, ఆందాయి, నందరాజ్ కొండల వరకు కార్పొరేట్ అనుకూల విధానాలనే అమలు చేస్తూ అడవులను ఖాకీ వనాలుగా మార్చారనీ, అడవులలోని ఆదివాసీలతో పోలీసులు పాశవికంగా వ్యవహరిస్తుంటే బఘెల్ సర్కార్ వారిని సమర్థిస్తూ వచ్చిందే తప్ప దోషులను శిక్షించని దాని విధానాలను వ్యతిరేకించాలి. ఆదివాసీలకు 32 శాతం రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వ వైఖరి మోసపూరితంగానే వుందని దానిని వ్యతిరేకించాలి. హిందుత్వ విధానాలను కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వ్యతిరేకిస్తుంటే, మరో రూపంలో బఘెల్ ప్రభుత్వం వాటిని ఓటు బ్యాంకు రాజకీయాలతో రాష్ట్రంలో ముఖ్యంగా ఆదివాసీల మధ్య అమలు చేస్తున్నది. కోవాసీ లక్మా లాంటి కపట నాయకులు ఓ వైపు ఆదివాసీలు హిందువులు కారంటూనే **రాంవన్‌గమన్ పథ్** ప్రభుత్వ రథయాత్రలను సమర్థిస్తూ ఆదివాసీలకు గైర్ ఆదివాసీలకు మధ్య చిచ్చుపెట్టడాన్ని వ్యతిరేకించాలి. ఈ అన్ని ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ప్రచారానికి వస్తే ప్రజలు దానిని వ్యతిరేకించాలి.

మిగితా ఎన్నికల పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల వేళ ఓట్ల కోసం గ్రామాలలోకి వస్తారు. ప్రజలను ఓట్లు అడుగుతారు. వారిని ప్రజా సమస్యలపై నిలదీయాలి. బీజేపీ విధానాల పట్ల వాటి వైఖరిని కోరాలి. కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాల పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలనీ కోరాలి. ప్రజలపై కొనసాగుతున్న అమానుష అణచివేత చర్యలను ఖండిస్తూ ప్రజా పోరాటాల పక్షం నిలవడం పట్ల వారి వైఖరిని తెలుసుకోవాలి. పైన పేర్కొన్న ప్రజా సమస్యల సాధన కోసం ప్రజలతో దృఢంగా నిలవడంపై వారి వైఖరిని స్పష్టం చేయాలనీ కోరాలి. వాటిని కేంద్రంగా చేసుకొనే తమ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించాలనీ స్పష్టం చేయాలి. ఊపా లాంటి నిరంకుశ చట్టాల ఎత్తివేతకు పోరాడుతామని హామీ ఇవ్వాలనీ ప్రత్యేకించి డిమాండ్ చేయాలి. తప్పుడు ఆరోపణలతో జైలు పాలైన నిర్దోషులైన ఆదివాసీ ప్రజల విడుదల కోసం అన్ని రకాల పోరాటాలను తీవ్రం చేస్తామని, విప్లవ ప్రజా సంఘాల వారిని జైళ్లలో రాజకీయ ఖైదీలుగా గుర్తింపుకు పోరాడుతామని హామీ ఇవ్వాలనీ కోరాలి. విప్లవ బాలల సంఘం సహ రాష్ట్రంలోని విప్లవ ప్రజా సంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయడానికి డిమాండ్ చేయాలనీ కోరాలి.

ఓట్ల ఆశతో ఏ పార్టీ అయినా స్వతంత్ర అభ్యర్థి అయినా ప్రజలు చేసే డిమాండ్లను అమలు చేస్తామనే నక్క వినయం ప్రదర్శిస్తూ ఆమోదిస్తారు. అయితే, గత ఆచరణలో వాళ్ల వైఖరిని ముందుంచాలి. అది ప్రజామోదయోగ్యంగా లేని పక్షంలో విమర్శించాలి. సరిదిద్దుకోవాలని కోరాలి. అదే సమయంలో ఎన్నికలను బహిష్కరించాలి, ఎన్నికలతో దోపిడీ వ్యవస్థలో సమూల మార్పులు ఆశించలేం అనే విప్లవ ప్రచారాన్ని నీరుగార్చకూడదు.

ఎన్నికల సందర్భంగా పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేస్తారు. విప్లవ నిర్మాణాల కార్యకర్తల కోసం ముఖ్యంగా నాయకత్వం కోసం గ్రామాలపై దాడులను ముమ్మరం చేస్తారు. వారి గాలింపు చర్యల సందర్భంగా బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడడానికి అవకాశం లేకపోలేదు. ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టించడానికి గ్రామాలపై, అడవులలో, జన సమూహాలపై కాల్పులు జరపడానికి పూనుకుంటారు. వారి హంతక దాడులకు వ్యతిరేకంగా పి.ఎల్.జి.ఎ. చేపట్టే ప్రజా రక్షణ చర్యలలో క్రియాశీలంగా పాలుపంచుకుంటూ చురుకైన ఆత్మరక్షణా చర్యలకు పూనుకోవాలి. ఎన్నికల బహిష్కరణ ఒక రాజకీయ కార్యక్రమం. ఎన్నికల సక్రమ నిర్వహణ పేరుతో చేపట్టే పోలీసుల గాలింపులలో ప్రజలను వేధించడం, అక్రమ అరెస్టులకు, మహిళలపై అత్యాచారాలకు, చట్టబద్ధ ప్రజా పోరాటాల విచ్ఛిన్నానికి, బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడడం ముమ్మరం పోలీసు చర్యలను చురుకైన ఆత్మరక్షణా చర్యలతో ఎదుర్కోవాలి. ☆

# బాల్యాన్ని చిదిమేస్తున్న పాఠశాలలు మౌనంగా చూస్తున్న భారత రాజ్యాంగం, ఐరాస

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతోనే విద్యార్థుల సమస్యలు గతం కన్నా అధిక సంఖ్యలో, అధిక జుగుప్సాకరంగా, బాధాకరంగా ముందుకు వస్తున్నాయి. అవి సమాజం నుండి స్థాయీ పరిష్కారాన్ని కోరుతున్నాయి. సామాజిక మార్పుల కోసం ఉద్యమిస్తున్న వారంతా విద్యా విధానంలో మార్పుకూ ఉద్యమించాలి. విద్యార్థుల సమ్యల పరిష్కారానికి పూనుకోవాలి.
దేశ వ్యాప్తంగా స్కూళ్లలో పిల్లలకు ఉపాధ్యాయులు విధిస్తున్న శిక్షలు చూస్తుంటే సున్నిత మనస్కులైన తల్లి తండ్రులు తమ పిల్లలను బడికి పంపాలంటే ఒకటికి నాలుగుసార్లు ఆలోచించాల్సి వస్తుంది. స్కూళ్లలో నిర్దాక్షిణ్యంగా ఉపాధ్యాయులు విధిస్తున్న శిక్షలను చూస్తుంటే, చిన్నారులకు బడికి వెళ్లి చదువుకోవాలంటేనే బెదిరిపోయే వాతావరణం ఏర్పడుతుందని చెప్ప వచ్చు. వర్తమాన ప్రపంచంలో పిల్లలను కొట్టడం నిషేధం అన్న ఇంగితజ్ఞానం కోల్పోయిన ఉపాధ్యాయులు చిన్నారులను, వారిలో ముఖ్యంగా దళితులను, ఆదివాసులను, ముస్లింలను కులాల పేరుతో, మతాల పేరుతో అమానవీయంగా శిక్షిస్తున్నారు. ఛాదస్తపు ఉపాధ్యాయుల గురించైతే చెప్పాల్సిన పనే వుండదు. కొన్ని సందర్భాలలో ఉపాధ్యాయుల వ్యవహార శైలి విద్యార్థులను ఆత్మహత్యలకు నెడుతోంది. దేశంలోని అనేక రాష్ట్రాలలో ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి.

రాజస్థాన్‌లో 10వ తరగతి చదువుకుంటున్న ఒక విద్యార్థి, బళ్లో ఇద్దరు ఉపాధ్యాయుల నుండి ఎదురైన కుల వివక్షతతో ఆగస్టులో ఆత్మహత్య చేసుకున్నాడు. మన దేశంలో ఒక మేధావీ విద్యార్థి రోహిత్ వేముల లాంటివారికే ఉన్నత విద్యా సంస్థ ఓపెన్ యునివర్సిటీలో ఎదురైన అమానవీయ పరిస్థితులు ఆత్మ'హత్య'కు నెట్టాయంటే, గ్రామీణ ప్రాంతంలోని బళ్లను, అక్కడి వాతావరణాన్ని అడిగేవాళ్లే వుండరు. ఉత్తరప్రదేశ్‌లో ఏడేళ్ల ముస్లిం విద్యార్థిని హోం వర్క్ చేయలేదన్న కారణంతో సోదర విద్యార్థులతో **"మహమ్మదీయ పిల్లలంటూ", "ఇంకా కొట్టండి"** అంటూ కసితీర కొట్టించిన **ఖుబ్బాపూర్** ప్రాథమిక పాఠశాల మహిళా అధ్యాపకురాలు తృప్తి త్యాగి దారుణాలు ఈమధ్యే వైరలయ్యాయి. అయితే, ఆ ఉపాధ్యాయురాలుకు ఎలాంటి దురుద్దేశాలు లేవనీ పోలీసులంటే, స్థానిక ఎం.పీ సంజీవ్ బాల్‌యాన్ **"ఇదొక చిన్న విషయం"** అంటూ దాటవేశాడు. **"క్షమాపణ అంటే పెద్దమాట, ఆమె పశ్చాత్తాపం వ్యక్తం చేశారు, చాలు"** అన్నాడు రాకేశ్ టికాయత్. ఆయన మీద పెరుగుతున్న వత్తిళ్ల మధ్య బాలుడి తండ్రి న్యాయం కోసం డిమాండ్ చేసే స్థితిలోనే లేడు. ఈ వ్యాఖ్యానాలు మన దేశ పాలకుల నైజానికి ప్రతిబింబాలు.

జమ్మూ కశ్మీర్‌లో ఓ పదేళ్ల విద్యార్థి మతపరమైన నినాదం జై శ్రీరాం అంటూ క్లాస్ బోర్డుపై రాయడంతో ముస్లిం ఉపాధ్యాయుడు ఆ అబ్బాయిని చావబాదాడు. **"ఇంకోసారి అలా చేస్తే చంపేస్తాం"** గుజరాత్‌లో మొదటి శ్రేణిలో వచ్చిన అబ్బాయికి న్యాయంగా రావలసిన బహుమతిని కాదని ఉపాధ్యాయులు మత వివక్షతో రెండవ శ్రేణిలో వచ్చినతనికి ఇవ్వబూనుకోగా ఆయన తీసుకోవడానికి నిరాక రించాడు. కారణం, మొదటి శ్రేణిగా తనను మత ప్రాతిపదికన గుర్తించడాన్ని ఆ విద్యార్థి తృణీకరిస్తూ అందుకు తాను అనర్హుడనని చెప్పి ఉపాధ్యాయులకు 'పాఠాలు' చెప్పాడు.

దేశంలోని ప్రాథమిక, సెకండరీ పాఠశాలలు సహా సంపూర్ణ విద్యా వ్యవస్థలో ఈనాటికి కులం, మతం, లింగ భేదాలతో జరుగుతున్న దారుణాలను కాలం చెల్లిన సామాజిక పరిస్థితుల ప్రాబల్యానికి వ్యక్తీకరణలుగా చూడాలి. వాటిని ఏవో అక్కడక్కడ జరిగిన, జరుగుతున్న యాదృశ్చిక ఘటనలుగా చూడకూడదు. అలా చూస్తే, వాటి పరిష్కారాలకు స్థాయీ మార్గాలను ఆలోచించలేరు.

ముఖ్యంగా మన దేశంలో వూదలుదిగిన కుల వ్యవస్థకు, పాలకవర్గాలు ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా అధికారంలో వున్న హిందుత్వ శక్తులు అనుసరిస్తున్న మతోన్మాదానికి, వందేళ్లుగా అవి పెంచి పోషిస్తూ రెచ్చ గొడుతున్న విష, విద్వేష మత వివిక్షతకు పైన పేర్కొన్న సంఘటనలు కేవలం మచ్చుతునకలు మాత్రమే. వీటినే హిందుత్వ శక్తుల **"అచ్ఛే దిన్"** కు, **"అమృత కాలాలకు"** సంకేతాలుగా చెప్పుకోవచ్చు!

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో పేర్కొన్న ఆర్టికల్ 39 (ఈ), 39 (ఎఫ్) లలో "పిల్లల బాల్యాన్ని మలినపరచకూడదు" అనే రాజ్య విధానాన్ని ఘోషిస్తూ "ఆరోగ్యకర వాతావరణంలో పిల్లల ఎదుగుదలకు అవకాశాలను, సౌకర్యాలను కల్పించాలి. స్వేచ్ఛ, డిగ్నిటీ (హూందా, ఠీవీ) లతో కూడిన బాల్యాన్ని, యుక్త వయసును దోపిడీ, అనైతిక, విశృంఖలత్వాల నుండి కాపాడాలి" అని రాసి పెట్టారు. కానీ, మన దేశంలోని ఉపాధ్యాయుల శిక్షణలో ఆ విషయాలను ఎంతవరకు బోధిస్తున్నారనేది మొదటగా ఆలోచించాలి. అలాంటి విషయాలను మొక్కుబడిగా కాకుండా త్రికరణశుద్ధిగా బోధిస్తే, ఆచరణలో వ్యక్తుల వ్యవహార శైలిలో ఓమేరకు ఉపయోగపడవచ్చు. కానీ, అది ఆయా వ్యక్తులకే పరిమితమయ్యే విషయమే అవుతుంది. సమాజంలో సమూల మార్పు రాకుండా స్థాయీ పరిష్కారం లేద మౌలిక పరిష్కారం వుండదు.

కాబట్టి, ఆ దురాగతాలకు అవకాశం లేకుండా చేయాలంటే, సామాజిక పరిస్థితులలో సమూల మార్పుల దిశలో ప్రభుత్వాల నుండి తీవ్ర కృషి జరుగనపుడు రాజ్యాంగంలో ఏం పేర్కొన్నప్పటికీ అవి అపహాస్యం కావడానికి లేద అమాయకులను దాని పేరుతో మభ్య పరచడానికి తోడ్పడుతాయి. దుశ్చర్యలకు భౌతిక పునాది

సమాజంలోనే వున్నపుడు ఉపాధ్యాయులను నిందించిడంలో ఎంత మాత్రం ఔచిత్యం వుండదు. పిల్లలను ఉపాధ్యాయులు దండించినట్టే వుంటుంది. వ్యక్తులుగా ఉపాధ్యాయులు మంచివారుగా లేద చెడ్డవారుగా వుండడం లేద విద్యార్థులతో ప్రజాస్వామికంగా వుండడం అనేది ఎప్పుడైనా ఒక మినహాయింపు గుణంగానే వుంటుంది. ఉపాధ్యాయులకు వుండవలసిన లక్షణాల గురించి ఏకరువు పెట్టేపుడు మంచి గుణములు కలవారు, నిపుణులు, మార్గదర్శకులు, దూరదృష్టి, అన్వేషకులు, విశ్లేషణ, మృదుభాషి, సహకారతత్వం, క్రమశిక్షణ, వినయం, కర్తవ్యనిష్ఠ, కష్టపడే స్వభావం వుండాలంటారు. ఉపాధ్యాయులు పగ, ద్వేషం, దురాశ, దురభిమానం, పటాటోపం, మత్తు పదార్థాల సేవనం, అవినీతికి దూరంగా వుండాలంటారు. వారిలో కులం, మతం, రంగు భేదం, లింగ భేదం, ఎక్కువ-తక్కువల ప్రస్తావనే వుండకూడదంటారు. విద్యార్థులకు ఆదర్శంగా వుండాలంటారు. ఇవన్నీ నీతి వాచకాలే. కానీ, సమాజంలోనే అవి కరువైనపుడు ఇవన్నీ ఆత్మ వంచన, పర వంచనగానే మిగిలిపోతాయి.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17లో నిర్బంధ విద్య పిల్లల హక్కుగా రాసి పెట్టారు. జాతీయ విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం బడి పిల్లలను "భౌతికంగా శిక్షించడం, మానసికంగా వేధించడం" నిషేధం అన్నారు. పోతే, మన దేశం అతి పెద్ద ప్రజాస్వామిక దేశం అని దేశ పాలకులు ఛాతీ విరుచుకొని సంబరపడి పోవడానికి అంతర్జాతీయ స్థాయిలో ముందు పీఠిన వుంటుంటారు. అందులో భాగంగా, ఐక్య రాజ్య సమితికి చెందిన పిల్లల హక్కుల ఒడంబడికపై సంతకం చేసిన దేశం భారతదేశం. ఆ ఒడంబడికలోని ఆర్టికల్ 19 ప్రకారం రాజ్య వ్యవస్థలు అన్ని రకాల శాసన, పరిపాలన, సామాజిక, విద్యాపర చర్యలను చేపట్టి పిల్లలను "అన్ని రకాల భౌతిక, మానసిక హింస"ల నుండి కాపాడాలి అనే విషయాన్ని భారత పాలకులు ఆమోదించారు. ఈ విషయాలపై మన దేశంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంత మేరకు బోధిస్తున్నారు? అసలు మన దేశ పాలకులు ఇలాంటి ఒడంబడిక మీద సంతకాలు చేసిన విషయం పునాది వర్గాల ప్రజల వరకు తీసుకెళ్లారా అనే దానితో పాటు హింసా, దౌర్జన్యాలకు అవకాశాలు ఉండకూడదన్ని దోపిడీ, అసమాన, నిచ్చెనమెట్ల కుల సమాజంలోనే యధేచ్ఛగా వున్నపుడు అలాంటి దారుణాలను అరికట్టాలనుకోవడం ఎంత వరకు సాధ్యమనే మౌలిక ప్రశ్నను ప్రతి ఒక్కరూ వేసుకోవాలి. మన దేశ పాలకులకు 'ప్రజాస్వామ్యం' అనే మౌలికాంశంపై ఎంత మేరకు ఏకీభావం వుంది? భారత రాజ్యాంగం లౌకిక విధానానికి 'మత ప్రసక్తి లేని రాజ్యం' అని కాకుండా 'సర్వమత సమ భావన అంటూ' తనదైన నిర్వచనం ఇచ్చుకున్న వాస్తవాన్ని చింతనాపరులు ఆలోచిస్తే, 'మెజార్టీ' హిందూ మతస్థులు వున్న దేశంలో ఎన్నికల లబ్ధి కోసం పాలకులు అనుసరించే భారత ప్రజాస్వామ్యం, లౌకికవాదం ఏ కోవలోకి వస్తాయో వారే తెల్పుకోగలరు.

గత దశాబ్ద కాలంగా అధికారంలో వున్న హిందుత్వ శక్తులు మాటి మాటికి సమాజంలో కులాన్ని, మతాన్ని రెచ్చగొడుతూ, వివక్షాపూరిత వాతావరణాన్ని నెలకొల్పుతూ, విష విద్వేషభరిత చర్యలకు పూనుకుంటున్నపుడు ఏ ఒడంబడికను పాలకులు, వారి అధికారులు గౌరవిస్తారు! ఇలాంటి విషయాలు ప్రస్తుత ఆధునిక సమాజంలో క్షణాలలో వైరల్ అవుతుంటే, ఐక్య రాజ్య సమితి ఏమేరకు వాటిని పట్టించుకుంటున్నదనేది కూడ ఆలోచించాల్సిన విషయమే. కానీ, విద్వేష విశ్వగురువుతో 140 కోట్ల ప్రజల మార్కెట్ వ్యాపారానికి ఎక్కడ ప్రమాదం ఏర్పడు తుందోనని ఆ సంస్థ నిర్వాహకులు లెక్కలు వేసుకుంటున్నపుడు ఒడంబడికను గౌరవించని దేశాన్ని తమ సభ్యత్వం నుండి తొలగించే సాహసం అది చేస్తుందని అనుకోగలమా? అయితే, ఆ సంస్థ మాత్రం 'ఉగ్రవాద' ప్రభావిత ప్రాంతాలలో పిల్లల బాల్యం ఎలా హరించవేయ బడుతుందో, సోదాహరణంగా బస్తర్‌లోని పరిస్థితులపై నివేదికలు సమర్పించి అసలు వాస్తవాలను దాచిపెట్టడం జగమెరిగినదే.

దండకారణ్యంలోని జనతన సర్కార్లలో గత రెండు దశాబ్దాలకు పైగా నూతన తరహా విద్యా విధానం అమలవుతోంది. జనతన సర్కార్ల నిర్వహణలో ప్రాథమిక పాఠశాలలు కొనసాగు తున్నవి. ఆ పాఠశాలలలో ఆదివాసీ ప్రజల మాతృభాషలో పాఠాలు చెపుతున్నారు. దోపిడీ రహిత పాఠ్యాంశాలతో, ఉపాధ్యాయులు చేతిలో బెత్తం పట్టుకోకుండా (ఇది నిషేధం) ఒక ప్రజాస్వామిక వాతావరణంలో చదువు చెపుతున్నారు. అక్కడ పరీక్షల బెడద వుండదు. విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలు జనతన సర్కార్లే చూస్తాయి. అయితే, విద్యార్థులు పై చదువులకు వెళ్లి చదువుకోవడంలో చట్టపరమైన అనేక ఇబ్బందులు దోపిడీ ప్రభుత్వాల నుండి ఎదురవు తున్నాయి. వాటిని చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలలలోని ఉపాధ్యాయ మిత్రులే పరిష్కరిస్తున్నారు.

విద్యార్థుల భోజనం, ఉండడానికి వసతితో పాటు బట్టలు, ఇతర దైనందిన అవసరాలు జనతన సర్కార్లే తీరుస్తాయి. జనతన సర్కార్లే ఉపాధ్యాయులకు కనీస వేతనం (నెలకు రూ. 12వేలు) చెల్లిస్తూ పిల్లలతో పాటు వారికి భోజన, గృహ వసతి కల్పిస్తాయి. వారి భూములు దున్ని పెట్టడం, కుటుంబ అవసరాలు తీర్చడానికి గ్రామంలోని జనతన సర్కారే బాధ్యత పడుతుంది.

జనతన సర్కార్ల విధాన కార్యక్రమంలో **విద్యా సంస్కృతి శాఖ** రూపొందించుకున్న 10 నియమాలలో రెండవది ఇలా వుంది: "సార్వత్రిక విద్యాబోధన కోసం ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలనూ, వయోజన పాఠశాలలనూ, గ్రంథాలయాలనూ నడుపుతుంది. నూతన పాఠ్య పుస్తకాలను తయారు చేయడానికి కృషి చేస్తుంది. ప్రాథమిక విద్యను మాతృభాషలో నేర్పడానికి కృషి చేస్తుంది"

**3వ నియమం** ఇలా వుంది: ప్రజలలో ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించటానికి గాను ఫ్యూడల్, సామ్రాజ్యవాద సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తుంది. మూఢ నమ్మకాలకూ, మూఢాచారాలకూ, ఫ్యూడల్, తెగ దుష్ట సాంప్రదాయాలకూ దూరమయ్యేలా ప్రజలను చైతన్య పరుస్తుందది

**8వ నియమం** ఇలా వుంది: "ఆదివాసులను హైందవీకరించే ప్రయత్నాలన్నిటినీ పూర్తిగా వ్యతిరేకిస్తుంది.

**9వ నియమం** ఇలా వుంది: "విద్యా బోధన పేరుతో హిందూ మత భావజాలంతో కూడిన పాఠ్యాంశాల ద్వారా చరిత్ర తదితర విషయాలన్నిటినీ వక్రీకరిస్తున్న సంఘ్ పరివార్ ఆధ్వర్యంలోని సరస్వతి శిశుమందిర్, సేవా భారతి, వనవాసీ కళ్యాణ్ కేంద్ర మొదలైన వాటిని అనుమతించదు".

పై నియమాలను మనం లోతుగా అధ్యయనం చేస్తే జనతన సర్కార్లు ఒకవైపు పిల్లలకు శాస్త్రీయంగా పాఠాలు చెప్పడానికి కృషి సలుపుతూ, మరో వక్క ప్రజలను చైతన్యవరచడానికి పూనుకుంటున్నాయనే విషయం విశదమవుతుంది. సామాజిక సమూల మార్పుకోసం అవి పాటుపడుతున్నాయనే వాస్తవాలు తెలుస్తాయి.

అందుకే ఆ పాఠశాలలపై పోలీసులు దాడులు చేయడం, బోధనా పరికరాలను ధ్వంసం చేయడం, తిండి పదార్థాలను మట్టిపాలు చేయడం, ఉపాధ్యాయులను అరెస్టు చేయడం చివరకు పాఠశాలలకు నిప్పంటించడం 2005నాటి సల్వాజుడుం కాలం నుండి ఈనాటి వరకు పోలీసుల దుశ్చర్యలు కొనసాగుతున్నవి. పిల్లలకు ఊళ్లోని జనతన సర్కార్ పాఠశాలలు రహస్యంగా పాఠాలు చెప్పవలసి వస్తున్నది. బలమైన శతృవును ఎదుర్కొనే విప్లవోద్యమం అన్ని కార్యక్రమాలను తమ బలం సాపేక్షికంగా బలపడేవరకు పాఠశాలలైనా, ఆస్పత్రులైనా రహస్యంగానే నిర్వహించు కోవలసి వుంటుంది. పోలీసుల గాలింపు చర్యల కేంపెయిన్ సందర్భంగా పాఠశాలలు తాత్కాలికం గా మూతపడుతున్నాయి. ఆదివాసీ పిల్లలలో చదువు పట్ల మక్కువ పెరగడం వెనుక విప్లవోద్యమ కృషి, జనతన సర్కార్ల పాఠశాలల భూమిక ఎంతో ముఖ్యమైనది. జనతన సర్కార్ల పాఠశాలలలో ప్రాథమిక విద్య పూర్తి చేసినవారు అనేక మంది ఇవుడు వట్టణాలలో పై చదువులు చదువుకుంటున్నారు. జనతన సర్కార్ల పాఠశాలలలో ఉ పాధ్యాయులుగా చాలా వరకు ఆ పాఠశాలలలో చదువుకున్నవారే వుండడం గమనార్హం. ప్రజాసేవకే తమ జీవితాలు అంకితం అనే చైతన్యం వున్నవారైతే, ఎలాంటి వేతనం తీసుకోకుండా, నిస్వార్థంగానే ఉపాధ్యాయ సేవలు అందిస్తున్నారు.

దేశంలోని ప్రజాహిత మేధావులతో, విద్యావంతులతో ఏర్పడిన "విద్యా పరిరక్షణ కమిటీ"లకు పైన పేర్కొన్న వాస్తవాలు ఏమేరకు తెలుసో చెప్పలేం. ఇటీవల దక్షిణ భారత విద్యా హక్కు పరిరక్షణ సమితి వాళ్లు 2023లో విడుదల చేసిన నివేదికలో విద్యాలయాల సమస్యలను చక్కగా పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన నుండి పాఠశాల ప్రాంగణాభివృద్ధికి చిహ్నంగా ప్రహరీ గోడ నిర్మాణం వరకు అనేక సమస్యలు ఏకరువు పెట్టారు. సామాజిక పరిస్థితులు మెరుగుపడినపుడు అవన్నీ విద్యార్థులు ఉల్లాసకర వాతావరణంలో మెరుగ్గా విద్యను అభ్యసించడానికి తోడ్పడేవేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. కానీ, ముందు ఈ అసమానతల సమాజం గురించి వారంతా ఆలోచించాలి. దాని నుండి విముక్తికి బాటలు వేయగలగడం ద్వారా పిల్లలకు ఒక ప్రజాస్వామిక వాతావరణంలో ప్రగతిశీల, వైజ్ఞానిక విద్యా లభిస్తుంది.

నూతన జాతీయ విద్యా విధానం, 2020 అమలులోకి వస్తున్న వర్తమాన పరిస్థితులలో, అందులో పేర్కొన్న ఒక ప్రాథమిక విషయాన్ని ఉల్లేఖించాలి. "పాఠశాలలలోని ప్రధానో పాధ్యాయుల, ఉపాధ్యాయుల పాత్ర వారి పాఠశాలలలో సంస్కృతి సమ్మిళిత అభివృద్ధికి హామీగా వుండాలనీ, వాటిలోని పిల్లలందరూ ప్రభావవంతంగా నేర్చుకొని ప్రయోజనం పొందడానికి వీలుగా వుండాలనీ" పొందుపరిచారు. ఈ వాక్యం లోని ప్రతి పదం వివక్షను ఎత్తి చూపుతుంది. సంస్కృతి అంటే ఏంటో ముందుగా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. దేశ వైవిధ్యానికి, సోదరభావానికి, సామరస్యతకు అన్ని రకాల ఆటంకంగా మారుతున్న హిందుత్వ విధానాల ఏలుబడిలో 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్' నినాదాల హోరులో, 'హిందీ-హిందూ-హిందుస్థాన్', 'గాయ్-గంగా- గాయత్రి'లకు హారతులు పడుతున్న చోట ప్రజాస్వామిక వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన సాధ్యమా? కులం, మతం, మౌఢ్యం, అలౌకికం అధికారమై ఊరేగుతున్న చోట ఆరోగ్యకర వాతావరణంలో, వివక్షకు తావులేని విధంగా విద్యాబోధన వివేకవంతులైన బడి పంతుళ్ల చేతులలో వుంటుందా? పిల్లల బాల్యాన్ని చిదిమివేస్తున్న పరిస్థితులను మార్చడానికి ఉపక్రమించ కుండా మార్పులను ఆశించలేం.

## ప్రభుత్వ విధానాలతో బడి చదువులకు దూరం అవుతున్న పిల్లలు

మన దేశంలో పాఠశాల విద్య రాష్ట్రాల జాబితాలోకి వస్తుంది. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రజలకు విద్యా, వైద్యం ఉచితంగా అందించడం ప్రభుత్వాల విధి. కానీ, కేంద్రంలో హిందుత్వ శక్తులు అధికారాన్ని కైవశం చేసుక్ను గత దశాబ్ద కాలంలో అన్ని రంగాలలో కాషాయికరణ పెరిగిపోతోంది. న్యాయ వ్యవస్థతో పాటు ప్రభుత్వ సంస్థలన్నీ కాషాయ శక్తులతో నిండిపోతు న్నాయి. వాటిలో విద్యారంగం ఒకటి.

దేశ ప్రధాని మోదీ తన రెండవ విడుత ప్రభుత్వ పాలనలో (2019-24) నూతన జాతీయ విద్యా విధానాన్ని 2020లో ముందుకు తీసుకువచ్చాడు. దాని మీద ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులు, చరిత్రకారులు తీవ్ర అభ్యంతరాన్ని వెలిబుచ్చుతున్నారు. దేశ చరిత్రను, విజ్ఞానాన్ని, ప్రగతిశీల భావాలను, పోరాట సంప్రదాయాలను, స్వతంత్ర సమర యోధుల జీవితాలను పాఠ్యాంశాలలో నుండి తొలగిస్తూ తమ తిరోగమన భావజాలంతో విద్యా విధానాన్ని ప్రవేశపెడు తున్నారనీ, పాఠ్యాంశాలను మార్చేస్తున్నారనీ విమర్శిస్తున్నారు.

గుజరాత్‌లో గత రెండు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీ అధికారంలో వుంది. అక్కడ దాదాపు దశాబ్దకాలానికి పైగా నరేంద్రమోదీ ముఖ్యమంత్రిగా కొనసాగాడు. ఆయన 16 ఏళ్ల ఆర్.ఎస్.ఎస్ ప్రచారక్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన విషయాన్ని గమనంలో వుంచుకోవాలి. ఆయన నరనరాన హిందుత్వ భావజాలం జీర్ణించుకుపోయిన వాస్తవాన్ని తెలుసుకున్నపుడే ఆయన అమలు చేస్తున్న విధానాలు అర్థమవుతాయి.

గుజరాత్‌లోని పాఠశాల విద్యా విధానంలో భాగంగా అక్కడ ఒక సంప్రదాయంగా కొనసాగుతున్న **"శాల ప్రవేశోత్సవ్"** గురించి

చూద్దాం. దీనిని గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ ఏ ఒక్కరూ పాఠశాల విద్య నుండి వంచింపబడకూడదనీ 2003లో ప్రవేశపెట్టాడు. ఆ సందర్భంగా రాజకీయనేతలు, అధికారగణం n+Ô VäÈsÁ äsÁ >Ô&+~ n¿&yÈ] Đq **"శాల ప్రవేశోత్సవ్"** లో దేశంలోని ఉప-కులపతులు కూడ హాజరయ్యారు. ఈ సంవత్సరం జూన్ 12 నుండి 14 వరకు జరిగింది. రాష్ట్రంలోని 27 జిల్లాల నుండి 46 వేల 600 మంది అధికారులు 27 వేల 368 పాఠశాలలు పర్యటించి 2 లక్షల 30 వేల మంది పిల్లలు మొదటి తరగతిలో, దాదాపు 10 లక్షల మంది కిండర్‌గార్టెన్ (శిశు పాఠశాల) లో చేరినట్టు, ఘన విజయం సాధించినట్టు ప్రకటించారు. కానీ, మూడేళ్ల కింద వున్న పాఠశాలల సంఖ్యలో 50 శాతం, వాటిలో ఈయేడు మరో 11 శాతం తగ్గిన విషయాన్ని వారు చెప్పడం లేదు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల విధానాల ఫలితంగా దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నాయి. భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసే ప్రాథమిక విద్యను అభ్యసించాలను కుంటే, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం అనివార్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను నెరవేరుస్తున్నాయి.

ప్రజలను మోసగించడానికి శాల ప్రవేశోత్సవ్‌ను మహా ఆర్భాటంగా కొనసాగించిన గుజరాత్ పాలకులు అక్కడి పాఠశాలల తీరుతెన్నులను దాపరికం లేకుండా ప్రజలకు చెప్పడం లేదు. అయితే, ఆ రాష్ట్రంలోని ఒక ఐఏఎస్ అధికారి **ధావల్ పటేల్** మాత్రం హిందుత్వ శక్తుల నుండి ఎదురయ్యే ప్రమాదాలను పక్కన పెట్టి వాటిని బయటపెట్టడానికి సాహసించాడు. ఆ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలలోని ఆరు ప్రభుత్వ పాఠశాలలను ఆయన పర్యటించి తయారుచేసిన నివేదిక ప్రకారం, వాటిలోని 8వ తరగతిలో విద్యార్థులు గుజరాతీ భాషలో ఒక్క ముక్క చదువలేక పోతున్నారు. వారి స్థాయి ఓనమాల దగ్గరే వుంది. దౌర్భాగ్యకర విషయమేమంటే, ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదివాసీ మంత్రిత్వ శాఖను కూడ వెలగబెడుతున్నాడు. ఆయన ఆదివాసీ ప్రాంతానికే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రధాన మంత్రి స్వ రాష్ట్రంలో 700 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో, 8,500 ఇద్దరు టీచర్లతో నడుస్తున్నాయి. దీనినే గుజరాత్ నమూనా అభివృద్ధిగా అర్థం చేసుకోవాలి.

ఈ సందర్భంగా మనం మన దేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమిక విద్య గురించి ఇంకొంత తెలుసుకుందాం. ఇటీవలే, 'ప్రథం ఫౌండేషన్' అనే సామాజిక సంస్థ "వార్షిక విద్యా నివేదిక, 2022"ను ప్రకటించింది. ఆ నివేదిక గుజరాత్ పరిస్థితికి చక్కగా అద్దం పడుతుంది. ఆ నివేదిక ప్రకారం ప్రభుత్వ పాఠశాలలలోని 8వ తరగతిలో 20 శాతం తగ్గుదల వుందనీ, 52 శాతం విద్యార్థులు రెండవ తరగతి పాఠాలైనా చదువలేకపోతున్నారనీ మరో నాలుగేళ్లు పోతే, అంటే మోదీ మూడవసారి ఎన్నికైతే, ఆయన ఆ పాలనా కాలం కూడ ముగిసేనాటికి వీరి ప్రగతిసూచీ సంఖ్య 72కు చేరుతుందనీ అంచనా వేసింది. అన్ని రాష్ట్రాలలో అధ్వాన్నస్థితే వుంటుందనీ నివేదిక పేర్కొంది. ఐదవ తరగతి చదువుతున్న పిల్లల పఠనా స్థితి కూడ ఈ విధంగానే వుందనీ తెలిపింది. నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్షా ఫలితాలు, 2022 కూడ ఇదే ధోరణిని వెల్లడిచేశాయి.

'ప్రథం ఫౌండేషన్' నివేదిక తెలిపిన విషయాల ద్వారా దేశంలో కోవిడ్-19 అనంతరం పేదరికం పెరిగిందనేది తేటతెల్లమవుతుంది. కోవిడ్‌కు ముందు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పిల్లల సంఖ్య 85.66 శాతం వుండగా కోవిడ్ తరువాత ఆ సంఖ్య 90.9 కి పెరిగింది. గుజరాత్ నమూనా అభివృద్ధిలో బడి పిల్లల దైన్య స్థితికి కారణాలలో అక్కడ 28 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా వుండడం ఒక ప్రముఖ కారణం అని నివేదిక పేర్కొంది. కాలేజీల విషయానికి వస్తే అక్కడ మూడు జిల్లాలలో ప్రభుత్వ కళాశాలలే కరువయ్యాయి. వడోదరా, మోర్బీ, మహిసాగర్ జిల్లాలలోని ప్రభుత్వ కళాశాలలో సైన్స్, ఆర్ట్స్, కామర్స్ విషయాలే లేకపోవడం, 8 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లు లేకపోవడం, సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయానికి అర్హతలు లేని శిరీష్ కులకర్ణిని ఉప కులపతిగా నియమిస్తే యూజీసీ మందలించడం చూస్తే ఆ గుజరాత్ నమూనా విద్యా అభివృద్ధిని అర్థం చేసుకోవచ్చు.

శాల ప్రవేశోత్సవాన్ని ప్రవేశపెట్టిన మోదీ కార్పొరేట్ వర్గాల అండదండలతో కేంద్రంలో అధికారాన్ని కైవశం చేసుకొని అన్నిట్లో "గుజరాత్ నమూనా అభివృద్ధి" అంటూ ఊదరగొడుతూ కార్పొరేట్ వర్గాల ప్రాపకం కోసం ప్రపంచాన్ని పర్యటిస్తున్నాడు. దేశంలో మాత్రం అన్ని రంగాలలో సంక్షోభం తీవ్రతరం అవుతోంది. హిందూ మతోన్మాదానికి, కార్పొరేటీకరణకు బలవుతున్న మణిపుర్‌లో బడిపిల్లల పరిస్థితి దయనీయంగా వుంది. వేలాది పిల్లలు విద్యకు దూరమై, నరకకూపాల్లాంటి సహాయ శిబిరాలలో తమ తల్లి తండ్రులతో పాటు తలదాచుకుంటున్న దారుణ పరిస్థితులను ప్రభుత్వాలు సృష్టించాయి.

కర్ణాటక రాష్ట్రంలోని ప్రాథమిక విద్యా బోధన చూద్దాం. అక్కడ ఇటీవలి ఎన్నికల వరకు అధికారంలో వున్న హిందుత్వ శక్తుల ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఎలా చెలగాటమాడిందో తెలిసిందే. పాఠ్యాంశాల నుండి డ్రెస్ కోడ్ వరకు విద్యార్థుల పట్ల అనుసరించిన వివక్షా ధోరణి అనేక మంది విద్యార్థులను చదువులకు దూరం చేసింది. ఇటీవలే అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న విద్యా సంవత్సరం 2024-25 నుండి పాత సిలబస్‌లో మార్పులు ప్రవేశ పెట్టనున్నట్టు, అందుకు **బారగూరు రామచంద్రప్ప** కమిటీని ఏర్పర్చినట్టు ప్రకటించింది. ఈ మార్పు ఎలా వుంటుందో చూడాల్సిందే. భారతీయ జనతా పార్టీ ఒక పథకం ప్రకారం పాఠ్య ప్రణాళికలలో మార్పులను ప్రవేశపెట్టి విద్యార్థుల జీవితాలతో, దేశ భవిష్యత్తుతో చెలగాటమాడడం తీవ్రమైన నేరంగానే పరిగణించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడి కాలంలోనే ప్రపంచ షరతులకు లోబడి, పాఠశాల విద్యలో పలు మౌలిక మార్పులు జరిగాయి. ఆయన కాలంలోనే డిజిటల్ విద్య, ప్రాథమిక పాఠశాలల్లో కూడ ఆంగ్ల మాధ్యమం మొదలైంది. ఇపుడు జగన్ రెడ్డి యేటో కొత్త విధానాన్ని ముందుకు తెస్తున్నాడు. ప్రపంచ బ్యాంకు షరతులకు అనుకూలంగా రాష్ట్రంలో ఒకటవ తరగతి నుండి 8వ తరగతి

వరకు ఆంగ్లంలో బోధనను తప్పనిసరి చేశారు. మాతృభాషలో బోధన లేదని తేల్చేశారు. కేంద్ర పాలకులు తీసుకువచ్చిన నూతన **"జాతీయ విద్యా విధానం"** (ఎన్.ఈ.పీ) ను అనుసరించి పాఠశాలలను తరలించడం, విలీనం చేయడం, ఏకైక ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేయడం, ఉపాధ్యాయుల రేషనలైజేషన్ విధానాలతో పేద పిల్లలకు విద్య అందకుండా చేస్తున్నారు. రాష్ట్రంలో 37 వేల ప్రాథమిక బడుల నుండి 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోను; ప్రాథమికోన్నత బడుల నుండి 6, 7, 8 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. 4 వేల 234 ప్రాథమిక పాఠశాలలు విలీనమయ్యాయి. 10 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. మరోవైపు 50 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ వున్నాయి. 9 వేల 602 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. సబ్జెక్ట్‌కు ఒక టీచర్ కాకుండా విద్యార్థుల సంఖ్యను బట్టి అంటే 20 మంది విద్యార్థులు వుంటే ఒక టీచర్ 60 మంది వుంటే ఇద్దరు టీచర్లంటూ విద్యార్థి-టీచర్ల నిష్పత్తిని మార్చి వేసింది. కొన్ని చోట్ల తగినంత మంది విద్యార్థులు లేరనీ కొన్ని పోస్టులను రద్దు చేసింది. ప్రభుత్వాల దోపిడీ విధానాలకు ఇవన్నీ వ్యక్తీకరణలు.

రాష్ట్రంలోని దాదాపు 44 వేల ప్రభుత్వ పాఠశాలల సిలబస్‌లో అనేక గందరగోళాలు చోటుచేసుకుంటున్నాయి. 10 వ తరగతిలో సగటు ఉత్తీర్ణత 22 శాతం తగ్గిపోయింది. ప్రభుత్వ బడుల్లో 6-10వ తరగతి విద్యార్థులలో 10 లక్షల 74 వేల 869 మంది మూడు పదాలున్న చిన్న ఆంగ్ల వాక్యాన్ని చదవలేకపోతున్నారనీ, ప్రభుత్వం అనుసరిస్తున్న విపరీత విధానాల దుష్ఫలితమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ నివేదికలో ప్రాథమిక విద్యాభ్యాసంలో ఆంధ్రప్రదేశ్ 39.2% స్కోర్‌తో 29వ స్థానంలో నిలవడం, కేంద్ర విద్యా శాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (2021-22)లో రాష్ట్రం 17వ స్థానంకు చేరడం, మిగితా అనేక నివేదికలలో ఆంధ్రప్రదేశ్ విద్యా ప్రమాణాలు దిగతుడుపు కావడంపై బుద్ధిజీవులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలలో 26 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటుంటే, ప్రైవేట్ పాఠశాలలలో లక్షల రూపాయల డబ్బులు చెల్లిస్తూ 40 లక్షల మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో యేటా ప్రభుత్వ పాఠశాలలలో నాలుగు లక్షల మంది విద్యార్థులు తగ్గుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు తీవ్ర ప్రభుత్వ దుర్లక్ష్యానికి గురవుతున్నాయి. అన్ని చోట్ల వేల సంఖ్యలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల పోస్టులు ఖాళీలు వుంటున్నాయి. వాటిని కావాలనే నింపడం లేదు. దానితో విద్యా ప్రమాణాలు పడిపోతు నాణ్యత తగ్గుతోంది. అక్కడక్కడ గెస్ట్ టీచర్లంటూ, గౌరవ వేతనంపై పని చేసే టీచర్లంటూ, కాంట్రాక్టు ప్రాతిపదికపై పని చేసే టీచర్లంటూ కొలువు చేస్తున్న వారి సంఖ్య గణనీయంగానే వుంటున్నది. వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఇక్కడ పేర్కొనడం లేదు. దేశంలో లక్ష పాఠశాలలు సింగిల్ టీచర్‌తో నడుస్తున్నట్టు, 11 లక్షల 16వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ వున్నట్టు, వాటిలో 69 శాతం గ్రామీణ ప్రాంతాలలోనే వున్నట్టు 2021 యునెస్కో అందించిన విద్యా రిపోర్టు పేర్కొంది.

ఇలాంటి పరిస్థితులలో తల్లి తండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలలో చదివించడానికి అనివార్యంగా నెట్టబడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు నడుపుతున్నది కావలసినంత డబ్బున్న రాజకీయ బడా నేతలు, బడా పెట్టుబడిదారులు కావడంతో వారంతా కుమ్మక్కై ప్రభుత్వ విద్యా సంస్థలను పనికిరానివిగా తయారు చేస్తున్నారు. ప్రభుత్వాలు ఈ విధానాలను ప్రోత్సహిస్తు విద్యా బోధన నుండి క్రమంగా తప్పుకుంటున్నాయి. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతి నుండి అన్ని రంగాలలో ప్రైవేటీకరణ శరవేగంగా జరుగుతున్నట్టే విద్యా రంగంలో కూడ అది అమలవుతోంది. దానికి తోడు విద్య కాషాయికరణ జరిగి సమాజంలో అనేక అనర్థాలకు దారి తీస్తున్నది. పిల్లలకు బాల్యంలోనే అసమానతలు, మత మౌఢ్యం, వివక్షత, కుల మతాల పట్టింపులు, లింగ భేదాలు నూరిపోస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తిరోగమన భావజాలంతో కూడిన విష గుళికలలాంటి పాఠాలను ఈ యేడు పాఠశాలలలో బోధించకుండా పక్కన పెట్టామని కర్నాటక విద్యాశాఖ మంత్రి తెలిపాడు. వైవిధ్యభరితమైన మన దేశంలో హిందుత్వ శక్తులు ప్రవేశపెట్టిన ఏకపక్షత, వివక్షాపూరిత, ఫెడరల్ విధానాలకు గొడ్డలిపెట్టులాంటి విద్యా విధానమైన జాతీయ విద్యా విధానానికి బదులు కర్ణాటకలో 'రాష్ట్ర విద్యా విధానాన్ని' (స్టేట్ ఎడుకేషన్ పాలసీ - ఎస్.ఈ.పీ) ప్రవేశ పెట్టనున్నట్టు చెపుతున్నాడు.

దేశంలో 1947నాటి అధికారమార్పిడి తరువాత 2020 వరకు అమలైంది అభ్యుదయ విద్యా విధానం అని మనం భావించాల్సిన అవసరం లేదు. బ్రిటిష్ వారి పాలనలో మొదలైన మోకాలే విద్యా విధానానికే మెరుగులు దిద్దుతూ అశాస్త్రీయ భావాలను పెంచి పోషిస్తూ వచ్చిన విద్యా విధానమేనన్నది మరిచిపోకూడదు. ఉన్నత విద్యా సంస్థలు కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తున్న తీరు అనుభవిస్తున్నాం. దేశంలో కులతత్వం, మతతత్వం, అసమానత, నిరక్షరాస్యత, పేదరికం, దోపిడీ, పీడన, అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలను రూపుమాపడానికి విశాల ప్రజారాసులకు ఉపయోగపడే విద్య ఈ వ్యవస్థలో ఆశించలేం. అధికారంలో ఏ దోపిడీ పాలక వర్గాలున్నా, ఆ దిశలో పీడిత ప్రజలకు విద్య అందదనేది వాస్తవం.

**"అశాస్త్రీయ, అప్రజాస్వామిక విద్యా విధానం కారణంగా లక్షలాది విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారు. ఫలితంగా, ఈ విద్యార్థుల భవిష్యత్తు దారీ తెన్ను లేని అంధకారంగా వుంది. లేదా వారు నిరుద్యోగులుగా బాధలు పడుతున్నారు. వారు ఒక విప్లవశక్తి. ముందుగా పార్టీ గ్రామీణ, నగర, పట్టణ ప్రాంతాలన్నింటిలోనూ వీరిని సంఘటితం చేయడానికి కృషి చేయాలి. వీరిలో అభివృద్ధి చెందిన వారిని వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలకు పంపి, వారు రైతాంగం, ఆదివాసులు, తదితర సెక్షన్ల ప్రజలతో మమేకం అయ్యేట్లు చూడాలి. విప్లవ విద్యార్థి శక్తులను సంఘటితపరచడం ద్వారా విద్యార్థులలో మన పార్టీని నిర్మించే కర్తవ్యానికి పార్టీ ప్రాధాన్యతను ఇవ్వాలి" - భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వ్యూహం- ఎత్తుగడలు దస్తావేజ్ నుండి**

# విద్యార్థుల జీవితాలను బలిగొంటున్న కేరీర్ ఆశలు

# ఉన్నత పదవుల పందేరంలో బలవుతున్న విద్యార్థుల జీవితాలు

ఇటీవలి కాలంలో ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలంటూ పత్రికలు శీర్ష పతాకాలతో రాస్తున్నాయి. మంచి భవిష్యత్తును కోరుకొని శిక్షణ పొందడానికి వెళ్లిన విద్యార్థులలో నైరాశ్యం, విషాదం ఎందుకు చోటుచేసు కుంటున్నాయనేది ఒక సామాజిక సమస్యగానే చూడాలి. వాస్తవానికి ఆ విద్యార్థులలో అధికశాతం సంపన్న కుటుంబాల నుండి వెళ్లినవారేనన్నది నిర్వివాదాంశం. మధ్య తరగతి కుటుంబాలు కూడ ఆ దారిలో పెంపర్లాడడం చూస్తున్నాం. విద్యార్థులలో నిరాశ-నిస్పృహల వాతావరణం ఎందుకు నెలకొంటున్నది? వారు తమ భవిష్యత్తును ఎందుకు బలిగొంటున్నారు? ఒకప్పుడు ఐఐటీయన్లంటే వున్న 'గుర్తింపు' ఈరోజు ప్రశ్నార్థకంగా ఎందుకు మారిందనేది చాలా మందిని వేధిస్తున్న ప్రశ్న. సివిల్ సర్వెంట్లు, సీఈవోలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ బురాక్రట్లు కావాలని కలల కన్నవాళ్లు ఆత్మహత్యలకు పాల్పడడం వెనుక బలమైన సామాజిక కారణాలు వున్నాయన్నది నిరాకరించలేని నిజం. ఆ మూలాలు అర్థం కావాలంటే, ముందు మన వ్యవస్థ తాలూకు స్వభావం అర్థం కావాలి. ఇది అర్థమైనవాళ్లు తమ పిల్లలు విప్లవకారులు కావాలనీ, దోపిడీ వ్యవస్థ సమూల మార్పుకు అంకితం కావాలనీ తప్పక కోరుకుంటారు.

2014 నుండి ఇప్పటివరకు దేశంలోని 23 ఐఐటీలలో అనేక మంది విద్యార్థులు ఆత్మ హత్యకు పాల్పడ్డారు. గత ఎనిమిది మాసాలలోనే 22మంది విద్యార్థులు కేవలం కోటాలోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బెంగళూరులో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడంపై 'ఐఐటీ కౌన్సిల్ 55' సమావేశంలో మాట్లాడుతూ వారికి మానసిక చికిత్స అవసరం అన్నాడు. ఆయన ప్రసంగించిన మూడు రోజులకే చెన్నైలోని ఐఐటీ విద్యార్థి కేదార్ సురేశ్ చౌగులే, ఐఐటీ ముంబాయి, ఐఐటీ గౌహతిలలో విద్యార్థుల ఆత్మహత్యలు వెలుగులోకి వచ్చాయి. తమ పిల్లల బెస్ట్ కేరీర్ కోసం పరితపించిన తల్లి తండ్రులు తమ బిడ్డలు సుందర్ పిచాయ్‌లో, ఇన్ఫోసిస్ నారాయణ మూర్తులో, ఇస్రో మాజీ చైర్మన్ కే, రాధాకృష్ణన్‌లో, అమిత్ సింఘాల్‌లో, రఘురాం రాజన్‌లో, జైరాం రమేశ్‌లో, అరవింద్ కేజ్రీవాల్‌లో అవుతారనీ కలలు కని వుంటారు. వారి దృష్టిలో వారంతా ఉత్తములు, గౌరవనీయులే. కానీ, వారి పిల్లలు అందుకు పూర్తిగా భిన్నంగా నిర్ణయాలు తీసుకుంటూ ఈ లోకానికే **'విదా'** చెప్పారు. దీనితో ఐఐటీల పని విధానాన్నో లేద దేశంలోని వందలాది కోచింగ్ కేంద్రాలలో ఇస్తున్న శిక్షణా విధానాన్నో సహజం గానే సగటు వ్యక్తులు తప్పు పడుతున్నారు. పాలకులు కావాలనే వాటిపైకి దృష్టి మళ్లిస్తున్నారు. ఇటీవల రాజ్యసభలో విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ ప్రతిపక్షాలకు ఇచ్చిన జవాబు చూస్తే ఆ విషయం అర్థమవుతుంది. ఐఐటీ పని విధానం, కోచింగ్ కేంద్రాల శిక్షణా పద్ధతులు పాక్షిక కారణాలే అవుతాయి తప్ప మూల కారణాలు కావన్నది అర్థం చేసుకోవాలి.

సామ్రాజ్యవాద వలస విధానాలకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం, దోపిడీ రహిత సమాజం కోసం నిస్వార్థంగా తమ నవ యవ్వన జీవితాలను త్యాగం చేసిన భగత్ సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, గణేశ్ శంకర్ విద్యార్థి, రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫుఖుల్లా ఖాన్, టాకూర్ రోషన్ సింగ్, రాజేంద్ర లాహిరి, వసంత్‌రావ్ హెజిస్టే, రజబ్ అలీలు కాకుండా అడ్డుకోవడం చూస్తున్నాం. అక్టోపస్ లా వస్తు వినియోగ సంస్కృతి విస్తరణ మధ్య పుట్టి పెరిగి పెద్దవుతున్నవారికి వారి గురించి తెలవకుండా ప్రభుత్వాలు, విద్యా సంస్థలు పథకం ప్రకారం శిక్షణనిస్తున్నాయి. **"భగత్ సింగ్ పుట్టాలి, కానీ, పక్క ఇంట్లో"** అన్న వాతావరణాన్ని చాలా తెలివిగా నెలకొల్పుతున్నారు.

మన దేశంలో తొలి ఐఐటీ కళాశాల 1950లో పశ్చిం బెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో ఏర్పడింది. గడచిన 'అమృతకాలం'లో వాటి సంఖ్య 23కు పెరిగింది. తమ పిల్లలు గొప్ప అధికారులు కావాలనే ఐఐటీ మానియా (పిచ్చి) సంపన్న కుటుంబాలలో చాలా పెరిగింది. తమ బిడ్డల మీద వారు తీవ్ర వత్తిడి చేయడం వారిని మానసికంగా హింసిస్తున్నది. దీనితో, రాణించలేకపోతున్న విద్యార్థులు విషాదంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రతి రెండు నెలలకు ఒక విద్యార్థి ఆత్మ హత్యకు పాల్పడుతున్నారు. వారు ఎంతో కష్టపడి పరీక్షలలో ఉత్తీర్ణులై కళాశాలలో చేరినప్పటికి తదుపరి జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారి జీవితాలను ర్యాంకులు నిర్ణయిస్తున్నాయి. దేశంలోని సంపన్న కుటుంబాల పిల్లలు కేవలం ఐఐటీలలోనే కాదు, వారు ఎన్ఐటీల్లోనూ, ఐఐఎంల్లోనూ, బలవన్మరణాలకు పాల్పడుతున్న దారుణాలు వెలుగుచూస్తున్నాయి.

విద్యార్థుల బలవన్మరణాలకు అసలు కారణాలను వెలికితీసి పరిష్కరించ పూనుకోని పాలకులు, విద్యా సంస్థలు తరుణోపాయాలుగా కొన్ని చిట్కాలను కనిపెడుతున్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి విద్యార్థులకు మానసిక చికిత్స గురించి మాట్లాడాడు. దేశంలోనే పోటీ పరీక్షలకు అతి పెద్ద కేంద్రంగా నిలిచిన రాజస్థాన్‌లోని కోటా, యేటా అత్యధిక సంఖ్యలో రెండున్నర లక్షల మంది విద్యార్థులను **'నెట్'** (నేషనల్ ఎల్జిబిలిటీ టెస్ట్), **'జీ'** (జేఈఈ), **'నీట్'** (ఎన్ఈఈటీ) లాంటి పోటీ పరీక్షలకు తయారుచేస్తున్నది. నిజంగా చెప్పాలంటే జీవితం అంటే ఏంటో అర్థం కాని వయసులో పోటీ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించలేకపోతున్నవారు ఆత్మహత్యలకు పాల్పడడం వెనుక తమ బిడ్డలు డాక్టర్లు, ఇంజనీయర్లు కావాలన్న బలమైన ఉబలాటం, తపనను తప్పు పట్టలేం. ఆ తపనకు, ఉబలాటానికి మూలం వాటికి నేటి దోపిడీ సమాజంలో ఎనలేని ప్రాధాన్యతను కల్పిస్తున్న ఘోర అంతరాల వ్యవస్థ అన్నది గుర్తించాలి. చదువుకున్న, యోగ్యులైన ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు కల్పించని దోపిడీ వ్యవస్థను తప్పు పట్టాలి. మానసిక శ్రమకు పట్టం కడుతూ శారీరక శ్రమలను కించపరిచే మానసికతను ఈ దోపిడీ వ్యవస్థ పెంచి పోషిస్తున్న ఫలితంగా

ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలు పదవులకుంటున్న గుర్తింపుతో ఉన్నత పదవులలో వుండాలనీ, సీపీఎస్‌యూలో ఉత్తీర్ణులు కావాలనీ సహజంగానే కోరుకుంటారు. నిరుద్యోగం క్యాన్సర్‌లా పట్టి పీడించే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉద్యోగాల కోసం యమయాతనలు పడాల్సివస్తున్న చోట పరీక్షలలో సంపాదించే మార్కులనే ప్రతిభకు ప్రామాణికంగా గుర్తిస్తు పట్టం కట్టే కార్పొరేట్ వ్యవస్థ నేరంగానే ఆత్మహత్యలను చూడాలి.

మన దేశంలో సమాన విద్యా అవకాశాలు లేకపోవడం మరో మాటలో "కామన్ ఎడుకేషన్ సిస్టం" లేని ఫలితంగా, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు గిరాకి పెరగడం, ప్రభుత్వం ఏయేటికి ఆయేడు విద్యను మరింత ప్రైవేట్‌పరం చేస్తూ అది విధిగా తాను చేయాల్సిన బాధ్యతల నుండి తప్పుకోవడం ప్రాణాంతక పరీక్షల పందేరంలోకి యువతను నెడుతుంది. ప్రపంచంలోనే పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాల వ్యాపారానికి మనదేశం మొదటి శ్రేణిలో నిలుస్తుంది. దేశంలో దాదాపు రూ. 60వేల కోట్ల వ్యాపారం జరుగుతుందనే అంచనా వుంది. విద్యను ఒక వ్యాపారంగా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న చోట ఆత్మహత్యల రూపంలో జరుగుతున్న హత్యలను ఏ బెహారిలు వదలుకుంటారు. ఈ వ్యాపారంలో రూ. 5వేల కోట్లతో కోటా సింహభాగంలో వుంది. కోచింగ్ సెంటర్లను మహిమాన్వితం చేయకూడదనీ, కోచింగ్ కేంద్రాలను రిజిష్టర్ చేయాలంటూ రాజస్థాన్ ప్రభుత్వం గతేడు ఒక బిల్లు తయారుచేసింది. దానికి చట్టరూపం ఇవ్వకపోవడం పక్కన పెడితే, నిజానికి అది ఎంతమాత్రం పరిష్కారం కానేకాదు. కోటా నగరానికి పరీక్షలలో ఉత్తీర్ణులు కాని పిల్లల ఆత్మహత్యలు కొత్తేమీ కాదు. కొన్ని సందర్భాలలో యేటా 40కి పైగా ఆత్మహత్యలు నయోదయ్యాయి. ఫలితంగా కోటా నగరం పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత మరణాలకు ఒక పెద్ద అడ్డాగా మారింది.

కోటాలోని 200 గదులతో కూడిన మహిళల **విశాలాక్షి రెసిడెన్సీ** యాజమాన్యం వాళ్లు ఆత్మహత్యలను నిరోధించడానికి బాల్కనీలలో వలలను అమరుస్తున్నట్టు చెప్పగా, మరో హాస్టల్ యాజమాన్యం కిటికీల వద్ద, బాల్కనీలో ఇనుప వలలను అమరుస్తున్నట్టు చెపుతున్నారు. విద్యార్థులు అనేక పైఅంతస్థుల నుండి దూకి లేద ఫ్యాన్‌లకు ఉరేసుకొని చనిపోతున్నందున వాటి నివారణకు ఆత్మహత్యల నిరోధక వలలను అమరుస్తున్నామని తెలపడం క్రూర పరిహాసంగానే వుంది. మరోవైపు, కోటా పోలీసులు 11 మందితో **"స్టూడెంట్ సెల్"** ను సలహా సంప్రదింపుల కోసం ఏర్పర్చారు. విద్యార్థులలోని వత్తిళ్లను, మనో వ్యాకులతను పోలీస్ సెల్ ప్రాథమిక దశలోనే పసిగడుతుందనీ, వారితో అవసరమైన కౌన్సిలింగ్ జరుపుతుందనీ, ఈయేడు ఇప్పటికే 60 వేల మందిని కౌన్సిలింగ్ చేసిందనీ, రోజూ కనీసం 20 మహిళా, పురుషుల హాస్టళ్లను పర్యవేక్షిస్తుందనీ ఏఎస్‌పీ చంద్రశీల్ ఠాకూర్ వివరించింది. క్రౌర్యానికి మారు పేరైన మన దేశంలోని పోలీసులు ఇలాంటి సున్నితమైన విషయాలలో జోక్యం చేసుకోవడం అంటే, అది అంతిమంగా ఎలాంటి దుష్పరిణామాలకు దారి తీస్తుందో వివరించనక్కర లేదు. విద్యార్థుల ఆత్మహత్యలకు చరమగీతం పాడాలంటే, ఈ వ్యవస్థ మారాలి. అనేక సామాజిక రుగ్మతలతో కొనసాగుతున్న దోపిడీ వ్యవస్థను మార్చకుండా వాటిని అరికట్టలేం. ఆ మార్పులో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలి. వారు ముందు వరుసలో నిలవాలి.

## భావి పౌరుల జీవితాలను బలిగొంటున్న లాభాపేక్ష చదువులు

భారత దేశంలో గత రికార్డులన్నింటిని మించిన నిరుద్యోగం ఒక వైపు, ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికే ఉద్యోగాలు ఇచ్చే కార్పొరేట్ సంస్థల ప్రకటనలు మరోవైపు, విద్యార్థులను ర్యాంకులు సాధించే పోటీలో పరీక్షిస్తున్నాయి. ఉన్నత కేరీర్‌ల కోసం పెంపర్లాడుతున్న తల్లి తండ్రుల వత్తిళ్లు వారిని విషమ పరీక్షలకు నెడుతున్నాయి. కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్ద పీట వేసే దేశ ప్రధాని మోదీ యేటా మహా పటాటోపంగా నిర్వహించే **'పరీక్షా పే చర్చ్'** చిట్కాలు విఫల విద్యార్థులకు ఏమాత్రం ఊరటనివ్వడం లేదు. ప్రభుత్వాలు అనుసరించే అర్థం లేని పరీక్షా విధానాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును బలి గొంటున్నాయి. ప్రభుత్వ విధానాలకు బలైన యువ విద్యార్థి కిశోరాల వివరాలు ప్రభుత్వ లెక్కలలోనే ముందు చూద్దాం. ఈ లెక్కలకు అందని బలైన విద్యార్థులు అనేక మంది వుంటారు.

జాతీయ నేరగణాంక బ్యూరో (ఎన్.సీ.ఆర్.బీ.) 2021లో కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే 13 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలియజేసింది. ఇందులో అత్యధికంగా మహారాష్ట్రలో 1,874 మంది, మధ్య ప్రదేశ్‌లో 1,308 మంది, తమిళనాడులో 1,246 మంది, ఒడిశాలో 834 మంది, కర్నాటకలో 855 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎన్.సీ.ఆర్.బీ. 1995-2019 మధ్య 25 సంవత్సరాలలో దేశ వ్యాపితంగా 1 లక్షా డెబ్బైరెండు వేల అరవై మంది (1,72,060) విద్యార్థులు చనిపోయినట్లు పార్లమెంటులో నివేదించింది. నిజానికి ఇవన్నీ దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులు తమ లాభాపేక్షతో బలిగొన్న జీవితాలు లేద హత్యలు అనడమే సరిగా వుంటుంది. దేశంలో ఇంతకు మించిన విషాదం మరేం వుంటుంది? ఈ నేరం పూర్తిగా ప్రభుత్వాలదే.

విద్య వలన సామాజిక ప్రయోజనం, విద్యార్థుల వలన సమాజం ప్రగతి పథంలో పురోగమిస్తుందనే ఆశలు అడుగంటిపోతున్నాయి. వ్యక్తిగతంగా కెరీర్‌కోసం విద్యగా మారింది; పోటీ పరీక్షలలో ర్యాంకులు సాధించడం, విద్య కూడా సరుకు కావడంతో దానిని కొనలేని విద్యార్థులు బలి పశువులు కావడం నేటి ధోరణిగా మారింది. నేటి దోపిడీ వ్యవస్థలో సామాజిక ప్రయోజనం పక్కకు పోవడమే కాదు, ఈ సమాజాన్ని పూర్తిగా వెనక్కి నడిపించే విధంగా పాలకులు పాఠ్యాంశాలను మార్చి వేస్తున్నారు. శాస్త్రీయ, ప్రజాస్వామిక, ప్రగతికాముక ఆలోచనలకు భిన్నంగా కాలం చెల్లిన భూసామ్య సమాజపు విలువలను, హేతు విరుద్ధమైన మూఢ విశ్వాసాలను, దోపిడీ పద్ధతులను లాభ-నష్టాల

దృష్టితో పాఠ్యాంశాలు మారుస్తున్నారు.

విశ్వవిద్యాలయాలు వివక్షకు నిలయాలుగా మారుతున్నాయి. కులం క్రూర పరిహాసన్వై జీవితాలను బలిగొంటుంది. అధికారవర్గాల నిరంకుశ విధానాలను ప్రశ్నిస్తే భవిష్యత్తు బందీఖానాలో గడపాల్సివస్తుందా లేక అపహరణలతో జీవితమే అంతం అవుతుందా తెలియని హిందుత్వ దాడులు కాటువేస్తున్నాయి. భవిష్యత్ ఆకాంక్షలు అంతటితో సమాధి కాగా అన్ని చంపుకొని విద్యనభ్యసిస్తే యంత్రాల్లాగా, గుమాస్తాల్లాగ తయారయ్యి బయటకు వస్తున్నారు.

ఈ అన్యాయమైన, అసమానమైన అంతరాల దోపిడీ వ్యవస్థను కాపాడే లక్ష్యంతో విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని, హేతుబద్ధంగా ఆలోచించే విధానాన్ని తప్పుపడుతూ, విద్యార్థుల మెదళ్లలో బాల్యం నుండే అంధ భక్తి విశ్వాసాలను, మూఢ దేశభక్తిని నింపుతున్నారు.

ర్యాంకులు సాధించడంలో ప్రాచుర్యం పొందిన విద్యా సంస్థలలో, కోచింగ్ సెంటర్‌లలో చేరిన మెరికల్లాంటి విద్యార్థినీ, విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. లెక్కల్లోకి వెడితే ఐ.ఐ.టీ.లలో 39 మంది, ఎన్.ఐ.టీ.లో మరో 25 మంది, కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 25 మంది, ఐ.ఐ.ఎమ్.లలో 4గురు, బాసరలో ముగ్గురు, త్రిపుల్ ఐ.ఐ.టీ.లలో ఇద్దరూ ఆత్మహత్యలు చేసుకున్నారు. చదువులో ర్యాంకులు సాధించలేకపోయిన వారు నిరుద్యోగ జీవితాన్ని ఊహించుకొని తట్టుకోలేక, తమపై ఆశలు పెంచుకున్న తల్లి తండ్రులకు ముఖం చూపించలేక, బాల్యం నుండి చదువు అనే వ్యాపకం తప్ప మరోటి తెలియని పిల్లలు బతుకు పందేరంలో ఓడిపోయామని భావిస్తూ జీవితాలు కడతేర్చుకుంటున్నారు.

ఉదాహరణకు బాసరలో విద్యార్థినీ విద్యార్థులపై విద్యా సంస్థల యాజమాన్యం అనుసరించిన నిరంకుశ విధానాల లోతుపాతులు అర్థం చేసుకోలేని విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాసర ట్రిపుల్ ఐ.ఐ.టీ.లో అర్హతలకు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పెరుగుతున్న సాంకేతిక విశ్వ విద్యాలయం. అక్కడ వరుసగా విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత సంవత్సరం ఇక్కడ జూన్–జులై మాసాలలో ఆత్మహత్యలు వరుసగా జరిగాయి. ఇక్కడి విద్యార్థుల ఆందోళనలు తెలంగాణ విద్యా వ్యవస్థ తీరుతెన్నులను ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం, విద్యా సంస్థల యజమాన్యాల పట్ల పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఈ యాత్రా స్థలం హిందూ ముస్లిం ఘర్షణలకు కేంద్రంగా మారడం గమనార్హం.

విద్యార్థులపై అధికారుల వేధింపులు, నియంతృత్వ ధోరణులు పెరిగాయి. జూన్ 20న దీపిక ఒక ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకున్నది. ఫస్టియర్ విద్యార్థిని బూర నిఖిత జూన్ 21న అర్ధరాత్రి 4వ అంతస్థు నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రతి చిన్న పొరపాటుకు విద్యార్థులను పోలీసు అవుట్ పోస్టుకు తీసుకువెళ్ళడం, వేధించడం, నిర్బంధించడం అక్కడ సర్వసాధారణం అయ్యింది. ఇది విద్యాలయమా? లాకప్ సెంటర్లా, జైళ్లా అని విద్యార్థులు వాపోతున్నారు. దీపిక వ్యక్తిగత జీవితంపై నిందారోపణలు చేయడం యాజమాన్య నిరంకుశ వైఖరి అని దానిని మానుకోవాలనీ విద్యార్థులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల సమస్యపై తమకు వంతపాడే వారితో త్రిసభ్య విచారణ కమిటీపై తమకు నమ్మకం లేదని విద్యార్థులు తెలిపారు.

గతంలో బాసర విద్యాక్షేత్ర సమస్యలపై పోరాటాలు అనేకం జరిగాయి. వాటికి నాయకత్వం వహించిన విద్యార్థి నాయకులపై అనేక కేసులు పెట్టి, వారికి నరకం చూపించారని, భవిష్యత్‌లో పోరాటాలు చేయకుండా తరచూ వారిపై పోలీసులు వేధింపులను పెంచుతున్నారని చెబుతున్నారు.

విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా విద్యా వ్యాపారం చేస్తున్నాయి. కెరీరిజాన్ని పెంపొందిస్తున్నాయి. కెరీరిజం పరుగులో పడిపోయి, నిరాశ, నిస్పృహల్లో పడి ప్రాణాలు తీసేసుకుంటున్నారు. వీటికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి.

విద్యార్థులు భావిభారత పౌరులు. వారికి మంచి భవిష్యత్ ఉంది. సమాజాభివృద్ధికి వారెంతో చేయగలరు. అటువంటి విద్యార్థులలో విద్యాసంస్థలు ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. అది నూతన ప్రజాస్వామిక సమాజంలోనే, శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయడం ద్వారానే సాధ్యం.

## 152 మందిపై మోపిన తప్పుడు కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలి

తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో దశాబ్దకాలనికి ముందు ఎప్పుడో మావోయిస్టులతో జరిగిన ఒక పోలీసు ఎన్‌కౌంటర్‌లో డైరీలు దొరికాయంటూ, వాటిలో పేర్లున్నాయంటూ 152 మందిపై ఉగ్రవాద (నిరోధక) చట్టం సహా ఆయుధాల చట్టం తదితర చట్టాల కింద జూన్ 17నాడు పోలీసులు తప్పుడు కేస్ పెట్టారు. వారంతా సమాజంలో వివిధ రంగాలలో ప్రజల కోసం పని చేస్తున్నవారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను చట్ట బద్ధంగా ప్రశ్నిస్తున్న ప్రజాస్వామిక ప్రియులు. వారిలో విద్యావేత్తలు, సామాజిక రాజకీయ కార్యకర్తలు, కార్మిక సంఘాలవారు, మహిళా సంఘాల నాయకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ కార్యకర్తలు వున్నారు. ఆ కేసును ఖండిస్తూ తక్షణం ఉపసంహరించుకోవాలనీ దేశ వ్యాప్తంగా బుద్ధిజీవులు, విద్యార్థులు, హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, ప్రజాహిత ఉన్నత ప్రభుత్వాధికారులు, వకీళ్లు, అనేక సెక్షన్లకు చెందినవారు డిమాండ్ చేయగా 6గురిపై ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అంటే, ఆ కేసు ఎంత బూటకమైందో, ఎలాంటి పక్షపాతంతో కూడుకుందో చెప్పకనే చెపుతోంది. మొత్తం మందిపై నుండి ఆ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్న వారిని అభినందిస్తూ వారితో మా మధ్య రీజినల్ బ్యూరో భుజం భుజం కలిపి నడుస్తుంది. వారితో గొంతెత్తి నినదిస్తున్నది. అన్ని రాజకీయ పక్షాలు తమ ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే ఊపా ఎత్తివేస్తామని హామీ ఇవ్వాలని వారు చేస్తున్న డిమాండ్‌ను సీఆర్‌బీ నిర్ద్వంద్వంగా సమర్థిస్తున్నది. ★

---

**డా.కొఠారీ కమిషన్ 'ఒక గ్రామంలోని, ఒక ఆవాసంలోని బాలబాలికలందరూ వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులతో నిమిత్తం లేకుండా ఒకే పాఠశాలలో చదువుకున్నప్పుడే అది కామన్ స్కూల్ అవుతుంది' అంటూ 'తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది' అంది.**

# బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం - దేశ వైవిధ్యానికి గొడ్డలిపెట్టు

2025 అక్టోబర్ నాటికి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తికానున్నది. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా వున్న రాజకీయ పార్టీ బీజేపీ సహా వందకు పైబడిన సంఖ్యలో వున్న అనుబంధ సంఘాలన్నింటిని కలిపితే సంఘ్ పరివార్.

ఆర్ఎస్ఎస్ తన రాజకీయ అనుబంధ విభాగంగా 1951 అక్టోబర్‌లో భారతీయ జన సంఘ్ పార్టీని ఏర్పర్చినప్పటికీ 1980 ఏప్రిల్‌లో భారతీయ జనతా పార్టీగా మారిన తర్వాతే అనేక సంవత్సరాలుగా అనేక రాష్ట్రాల్లో, కొంతకాలం కేంద్రంలో ఆ తర్వాత ఇప్పుడు గత 9 సంత్సరాలుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని ఉపయోగించుకొని రానున్న 25 సంవత్సరాల పాటు (2047 వరకు) అధికారంలో కొనసాగేలా అది వ్యూహాత్మక పథకాన్ని రూపొందించుకుంది.

దీనికి హిందూ సాంస్కృతిక జాతీయవాదం, అఖండ భారత్; కమ్యూనిస్టు వ్యతిరేకత, ముస్లిం, క్రిస్టియన్ వ్యతిరేకత; ఘర్ వాపసీ (ముస్లింలను, క్రిస్టియన్లను తిరిగి హిందు మతంలోకి తీసుకరావడం), ఒకే దేశం (వన్ నేషన్) అనే దాని సిద్ధాంత భావజాలం, ఒకే దేశం పేరుతో అది నిర్మించ తలపెట్టిన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాజ్యం భావన, ప్రపంచ కార్మికవర్గ-శ్రామిక జనావళి సైద్ధాంతిక ఆయుధమైన మార్క్సిజాన్ని, ప్రపంచంలో దోపిడీ, పీడనలను రూపుమాపే కమ్యూనిజాన్ని వ్యతిరేకించే సిద్ధాంత, రాజకీయ వైఖరులున్నాయి.

దాని సిద్ధాంత, రాజకీయాలు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (సీబీబీ), భూస్వామ్య వర్గాల సిద్ధాంత, రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి, ఇవి వాటి దోపిడీ, పీడనల్ని సుస్థిరం చేయడానికి ఉద్దేశించినవే.

గత 98 సంవత్సరాలుగా అది చేసిన ప్రజా వ్యతిరేక, దళిత, ఆదివాసీ, ముస్లిం, క్రిస్టియన్ వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ట చర్యలు అన్నీ దాని పీడిత వర్గ, పీడిత సాంఘిక సముదాయాల, పీడిత జాతుల వ్యతిరేక కార్యకలాపాలే. దాని సిద్ధాంత భావజాలం, రాజకీయాలు, ఆచరణ అన్నీ ప్రజా వ్యతిరేక, లౌకికవాద వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, బహుళత్వ వ్యతిరేక, మహిళ వ్యతిరేక, దళిత, ఆదివాసీ, ముస్లిం, క్రిస్టియన్, కమ్యూనిస్టు వ్యతిరేక, నిరంకుశపూరితమైనవే. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో అది పాల్గొనకుండా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు మద్దతుగా నిలిచిన దాని దేశద్రోహం, అధికార మార్పిడి అనంతర కాలంలో అది అనుసరించిన దేశద్రోహకర విధానాలు అందరికి తెలిసినవే.

ఈ కాలమంతా అది హిందుమతాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నది. హిందుత్వ విధానాలతో అది హిందుమతంలోని అత్యధికులైన పేదలకు, పీడితులకు వ్యతిరేకంగా అనేక ఫాసిస్టు కార్యకలాపాలను చేపట్టింది.

గత 9 సంవత్సరాలుగా అది దేశంలోని సకల సంపదలను సామ్రాజ్యవాద, సీబీబీ కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మివేసిన చరిత్రనూ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను దూకుడుగా అమలుచేస్తూ దేశంలోని ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటికరించిన దేశద్రోహకర, కార్మిక వ్యతిరేక దుష్ట చర్యల్ని చూడవచ్చును..

దేశ వ్యవసాయరంగాన్ని పూర్తిగా కార్పొరేటీకరించడానికి అది రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి, రైతుల పోరాటాల ఫలితంగా వాటిని వెనక్కు తీసుకున్నప్పటికీ అది కేంద్రంలో మళ్లి అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తీసుకవస్తుంది.

గత 98 సంవత్సరాల్లో అది దేశంలోని మత మైనారిటీలైన ముస్లింలకు, క్రిస్టియన్లకు వ్యతిరేకంగా మత కల్లోలాల్ని సృష్టించి చేసిన నరమేధాన్ని, ఘర్ వాపసీ పేరుతో ముస్లిం, క్రిస్టియన్ మత సముదాయాలపై చేసిన దాడులను, హిందు మతాంతరీకరణలను చేపట్టింది.

దేశంలోని మత మైనారిటీల అస్థిత్వాన్ని, అస్మితను, ఆత్మగౌరవాన్ని మొత్తంగా వాటి వునికినే రూపుమాపే కుట్రతో రూపొందించినదే ఉమ్మడి పౌరస్మృతి.

దళిత, ఆదివాసీ, ముస్లిం, క్రిస్టియన్ సముదాయాల ఆహారపుటలవాట్లను, వేషధారణ తదితర సంస్కృతి, సంప్రదాయాలపై అది చేస్తున్న భావజాల, సాంస్కృతిక, భౌతిక దాడులు, సమానత్వం పేరుతో ముస్లిం విద్యార్థినుల హిజాబ్ ధారణపై బీజేపీ ప్రభుత్వాలు విధిస్తున్న ఆంక్షలు, 'లవ్ జిహాద్' పేరుతో అది ముస్లిము యువతపై చేస్తున్న దాడులు ఎన్నో.

విద్యారంగ కాషాయీకరణ, ప్రైవేటీకరణను, సరుకీకరణ (కమర్షియలైజేషను), కేంద్రీకరణను వేగవంతం చేయడానికి ఉద్దేశించిన జాతీయ విద్యావిధానానికీ హిందూమత భావనలతో చరిత్ర పాఠ్య పుస్తకాలను మార్చివేయడానికీ, తప్పుడు చరిత్రను ప్రచారం చేయడానికి, చరిత్ర వక్రీకరణకు పూనుకున్నది.

ప్రజాభిప్రాయాన్ని తమ కాలంచెల్లిన, తిరోగమన సిద్ధాంత, రాజకీయాలకు అనుకూలంగా మార్చడానికి అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారాల్ని ఉపయోగించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ప్రచార, ప్రసార, వార్త మాధ్యమాలన్నింటిని తమ గుప్పిట్లో పెట్టుకుని చేస్తున్న విద్వేషపూరిత ప్రచార, ప్రసారాల్ని చూస్తున్నాం.

2024 పార్లమెంటరీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలిస్తే అది తిరిగి ఎన్‌పీఆర్, ఎన్ఆర్సీ, సీఏఏలను అమలు చేస్తుంది. దీంతో దేశంలోని అన్ని మతాలకు చెందిన పేదలకు, పీడిత సాంఘిక సముదాయాలకు, పీడిత జాతులకు చెందిన అత్యధికులు భారత నాగరికత నుండి వంచించబడతారు.

తరువాయి 16వ పేజీలో

# కార్పొరేట్ వర్గాల ప్రయోజనమే చట్టసభల లక్ష్యం చట్టాల రూపకల్పన

మోదీ అధికారంలోకి వచ్చిన గడచిన దశాబ్ద కాలంలో ఆయన రెండు రంగాలపై పూర్తిగా కేంద్రీకరించి పని చేస్తున్నాడు. ఒకటి. దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేయడం, రెండు. దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడం. మొదటిదాని కోసం ఆయన **"మేక్ ఇన్ ఇండియా"**ను తన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంగా కొనసాగిస్తున్నాడు. రెండవదాని కోసం ఆయన **"ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్"** నినాదంతో కృషి చేస్తున్నాడు.

పై రెండు రంగాలలో జరుగుతున్న కృషిని మళ్లీ రెండుగా విభజిస్తే ఒకటి. చట్టసభలలో జరుపుతున్న కృషి, కాగా రెండవది లీగలేతరగా (చట్టాలకు బయట) జరుగుతున్నది. ఈ సందర్భంగా తన లక్ష్యాల సాధనలో భాగంగా ఆయన ప్రభుత్వ మీడియాను విస్తృతంగా వినియోగించుకుంటు వున్నాడు. ఇక్కడ మోదీ అని వ్యక్తిని సంబోధించడం దేశంలో అమలవుతున్న ఫాసిస్టు లక్షణాలను తెలపడానికేనన్నది అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, ఆయన మాతృసంస్థ ఆర్.ఎస్.ఎస్. మన దేశంలో దీర్ఘకాలికంగా దాదాపు వందేళ్లుగా హిందుత్వ ఎజండాతో పనిచేస్తున్న ఏకైక అతి పెద్ద సంస్థ. దాని సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతం. అది ఒకే పార్టీ, ఒకే జెండా, ఒకే నాయకుడు అనే సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా నమ్ముతుంది. అందుకే ఇక్కడ వ్యక్తిని సంబోధించాల్సి వస్తుంది.

ఆయన యావత్తు కృషి వెనుక ప్రపంచ పెట్టుబడి, కార్పొరేట్ రంగం నిలిచింది. ప్రపంచ పెట్టుబడికి మన దేశ వనరులు, మార్కెట్ కావాలి. కార్పొరేట్ రంగానికి భారతదేశ వనరుల దోపిడీతో పాటు ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో వినియోగదారులు వున్న మార్కెట్ కావాలి. వాళ్లకు కులాలు, మతాలు, వాటి ఉన్మాదాలు, అసమానతలు, అంధ విశ్వాసాలు, జింగోయిజం సదా వర్ధిల్లడం కావాలి. అందుకు కాలం చెల్లిన సంస్కృతికి, సనాతన వాదానికి తగిన సాధనం హిందుత్వ. కాబట్టి వారు దానిని అన్ని విధాలుగా ప్రమోట్ చేస్తారు.

ఈ సందర్భంగా మనం చట్టసభలలో జరుగుతున్న కృషినే ప్రత్యేకంగా చెప్పుకుందాం. ఆయన లోకసభలోకి తొలిసారి అడుగిడే ముందు సాష్టాంగ ప్రణామం చేసి ఆ దేవాలయంలోకి ప్రవేశించాడు. అప్పటినుండి మోదీ తన దశాబ్ద కాల పాలనలో సులభ వ్యాపారం కోసం 1,800 చట్టాలను రద్దు చేశానని చెప్పుకుంటాడు. ఆ చట్టాలకు కాలం చెల్లిందనీ, మారిన పరిస్థితులలో దేశంలో సులభ వ్యాపారానికి ఆ చట్టాలు ఆటంకాలు కల్పిస్తున్నాయనీ వాటిని రద్దు చేసినట్టు చెప్పుకునే మోదీ, మరోవైపు పార్లమెంటులో అనేక కొత్త చట్టాలను, పాత చట్టాలకు సవరణలను చేస్తూ వస్తున్నాడు. ఆయన చేసే ప్రతి చట్టం లేద చట్ట సవరణ వ్యాపార దృష్టితో లేద దేశాన్ని హిందూ రాష్ట్రంగా (దేశం) మార్చే ఎజండాతో చేస్తున్నాడనేది చట్టాల స్వభావాన్ని అర్థం చేసుకోవడం ద్వార తేలిపోతుంది. చట్టాలలో ఈ రెండు రకాల మార్పులకు తోడు, వీటిని దేశంలో అమలు చేయడాన్ని ఏ శక్తి అడ్డగించకుండా, కనీసం ప్రశ్నించకుండా వుండడానికి ప్రగతిశీల, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను, వామపక్షాలను నియంత్రించడానికి నిరంకుశ చట్టాలను రూపొందించడం లేద పాతవి సవరించడం చేస్తున్నారు. వీరిలో విప్లవకారులను నిర్దిష్టంగా మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని వారి సమూల నిర్మూలనకు సైనిక అణచివేత చర్యలకు వాటి సాధికారత కోసం ఇతరత్ర పద్ధతులను అవలంబిస్తున్నారు. చట్టసభలలో లేద పార్లమెంటులో రూపొందుతున్న చట్టాల నేపథ్యం ఇది.

పై నేపథ్యంలోనే 2023 వర్షాకాల సమావేశాలలో చట్టాలు రూపొందాయి. 17వ లోకసభలో 12వ సమావేశాలు జులై 20 నుండి ఆగస్టు 11 వరకు 23 రోజులలో 17 సార్లు సమావేశం అయ్యాయి. మొత్తంగా ఈ సమావేశాలలో 20 బిల్లులు లోకసభలో ప్రవేశపెట్టగా 5 బిల్లులు రాజ్యసభలో ప్రవేశపెట్టారు. వాటిలో 22 బిల్లులు లోకసభలో, 25 బిల్లులు రాజ్యసభలో ఆమోదం పొంది ఉభయ సభల ద్వార 23 బిల్లులు ఆమోదం పొంది చట్టరూపం ధరించాయి. ప్రతి చట్టం అత్యంత ప్రజాస్వామికంగా, ప్రజల కోసమే రూపొందించినట్టు దాని అసలు లక్ష్యాన్ని దాచిపెడుతూ విస్తృతంగా ప్రచారం చేయడం ఒక కళగానే వారు అభ్యసిస్తున్నారు. ప్రజల ప్రయోజనాలను బలిపెడుతూ కార్పొరేట్ ప్రయోజనాలను నెరవేర్చడంలో చౌకిదార్‌ను మించిన ప్రజాసేవకుడు కాషాయ ఫౌజ్‌లోనే మరొకరు లేరంటే అతిశయోక్తి కాదేమో! పార్లమెంటు ఆమోదించిన బిల్లులలో ముఖ్యమైనవి చూద్దాం.

**సినిమాటోగ్రాఫ్ (సవరణ) బిల్, 2023**: ఇది పరిస్థితులలో వచ్చిన మార్పులకు అనుగుణంగా సినిమాల విడుదలలో ఇది మెరుగుదలను తీసుకువస్తుంది. సినిమాలకు సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో ప్రమాణాలను పాటిస్తుంది. గత చట్టంలోని శ్రుతిమించిన నిబంధనలను తొలగిస్తుందని పాలకపక్షం తెలుపుతోంది. ఔను, మరి, హిందుత్వ శక్తులు ప్రజల మెదళ్లలో తమ భావాలను చొప్పించడానికి ఒక శక్తిమంతమైన సాధనంగా సినిమాలను ఎంచుకొని మోదీ బయోపిక్ నుండి **కశ్మీర్ ఫైల్స్, ద కేరళా స్టోరీ, ఆదిపురుష్** వరకు తీయడంలో ఎదురైన సమస్యలను పరిష్కరించుకోవడానికే ఈ చట్టం అని వివేచనాపరులకు తెలియనిది కాదు.

**రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) వ్యవస్థ (మూడవ సవరణ) బిల్లు, 2023:** ఈ చట్టం ద్వారా హిమాచల్ ప్రదేశ్ లోని సర్మౌర్ జిల్లా ట్రాన్స్ గిరి ప్రాంతానికి చెందిన హత్తీ కమ్యూనిటీని ఆదివాసీలుగా గుర్తించారు. నిజానికి దురదృష్టకరమైన విషయం ఏమంటే మన దేశంలో ఎవరు ఆదివాసులో, కొత్తగా ఎవరు ఆ జాబితాలో చేరుతారో, ఎవరు ఏ రాష్ట్రంలో ఆదివాసీ జాబితా నుండి మినహాయించబడుతారో అంతా దేశ దగుల్బాజీ రాజకీయ నాయకుల ఓటు బ్యాంకు రాజకీయాలపై ఆధారపడి వుంటుంది. అలాగే ఆయా జన సముదాయాలకు ఆ గుర్తింపు ఇవ్వడం ద్వార కార్పొరేట్ వర్గాలకు ఒనగూడే ప్రయోజనాలు అధిక ప్రాధాన్యతను సంతరించు కుంటున్నాయి. ప్రస్తుతం వున్న చట్టాల ప్రకారం ఆదివాసుల భూములను

గైరాదివాసులు కొనలేరు. వారి పేరు మీద మార్చలేరు. కాబట్టి ఈ అడ్డంకులను తొలగించు కోవడంలో భాగంగా సమూహాలకు సమూహాలనే ఆదివాసీ జాబితాలో చేర్చి ప్రయోజనాలను నెరవేర్చు కుంటున్నారు. అందుకు పెద్ద ఉదాహరణ మణిపుర్‌లోని హిందువులైన మైథేఈలను ఆదివాసీ జాబితాలో కలుపడానికి జరుగుతున్న 'యుద్ధం'.

**రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) వ్యవస్థ (ఐదవ సవరణ) బిల్లు, 2023:** దీని ప్రకారం ఛత్తీస్‌గఢ్ లోని భారియా భూమియాకు పర్యాయ పదాలైన బూయిన్యా, బుయియాన్, బూయాన్ తెగలను వీటిని దేవనాగరిలో పాండో జన సముదాయంగా వ్యవహరిస్తున్నారనీ ఈ చట్టం ద్వార ఈ తెగలు ఆదివాసీ జాబితాలో చేరుతున్నాయి. నూతనంగా ఆదివాసులుగా గుర్తింపు పొందే తెగల విషయంలో తెగల మధ్య రిజర్వేషన్‌ల కోసం అంతర్గత ఘర్షణలకు తెర లేపడమే అవుతుందనీ వర్తమాన రిజర్వేషన్‌ల అమలు నేపథ్యంలో అర్థం చేసుకోవచ్చు. మిగితా అవగాహన పై చట్టం సందర్భంగా రాసిందే దీనికీ వర్తిస్తుంది.

**రాజ్య బహుళ సహకార సంఘాల (సవరణ) బిల్, 2023:** రాజ్యాంగంలోని 97వ సవరణకు మరిన్ని సవరణలు చేస్తూ సహకార సంఘాలలో జరుగుతున్న అవకతవకలను నియంత్రించే ఉద్దేశ్యంతో ఈ చట్టం రూపొందించినట్టు పాలకులు తెలుపుతున్నారు. వీటి నిర్వహణలో లోపం జరుగకుండా, సులభ వ్యాపారానికి దారులు విశాలం అవుతాయనీ పేర్కొంటున్నారు. బ్యాంకు వ్యవహారాలన్నీ అంతిమంగా ఘరానా కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలనే నెరవేరుస్తాయనీ, మోదానీ పాలన లోతులు తెలిసిన ఆలోచనాపరులకు సుబోధకమే. 542 మంది గల లోకసభలో ఈ బిల్లుపై అక్షరాల ముగ్గురే చర్చలో పాల్గొనడం పార్లమెంట్ ప్రజాస్వామ్య వైచిత్రి.

**జీవ వైవిధ్య (సవరణ) బిల్లు, 2023:** అడవులలోని ఔషధ మొక్కలపై పెరుగుతున్న రద్దీని తగ్గించడానికి వాటిని సాగు చేసే లక్ష్యంతో ఈ చట్టం రూపొందింది అంటున్నారు. ఈ వ్యవస్థలో మనిషే సరుకు అయినపుడు, మోదీ పాలనలో సులభ వ్యాపారానికి పెద్ద పీట వేస్తున్న సందర్భంలో ఔషధ మొక్కలైతేనేమీ, ఆవు పేడైతేనేమీ, గో పంచకం అయితేనేమీ అన్నీ సరుకులే అయిపోతా యనడానికి ఈ చట్టాన్ని మించిన ఉదాహరణ అవసరమే వుండదు.

ఈ చట్టం ద్వార భారతీయ వైద్యాన్ని ప్రోత్సహిస్తామంటున్నారు. ఇంకేం, పతంజలులు మరింత వర్ధిల్లుతాయి. ఎందుకంటే, జీవ వైవిధ్యంపై ఐరాస కన్వెన్షన్, నగోయా ప్రొటోకాల్‌తో రాజీపడకుండా భారతీయ వైద్యాన్ని ప్రోత్సహిస్తామంటున్నారు, వసుదైక కుటుంబకం కోరుకునే విశ్వ గురువులు.

**గనులు, ఖనిజాల (అభివృద్ధి, హేతుబద్ధీకరణ) సవరణ బిల్, 2023:** ఈ సవరణలు 1957 నాటి గనులు, ఖనిజాల (అభివృద్ధి, హేతుబద్ధీకరణ) చట్టానికి సవరణలు. గనుల పేల్చివేతకు లైసెన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టడంతో పాటు కొన్ని ఖనిజాలను ఆణ్వీక ఖనిజాల జాబితా నుండి తొలగిస్తారు. దీని వెనుక ఇపుడు ఎక్కడికక్కడే చిన్న చిన్న వ్యాపారులు చేస్తున్న గనుల విస్ఫోటనాన్ని నిర్దాక్షిణ్యంగా నిలిపివేసి బడా వ్యాపారవేత్తలకు లైసెన్స్‌లు మంజూరు చేసి వారి అభివృద్ధికి బాటలు సుగమం చేయడంతో పాటు, కొన్ని ఖనిజాలను ఆణ్వీక ఖనిజాల జాబితా నుండి తొలగించడం అంటే, వాటిని చౌకగా కార్పొరేట్ వర్గాలకు సమకూర్చడంతో పాటు వాటి ప్రాధాన్యతను ప్రజల దృష్టిలో నుండి తొలగించి వ్యాపార వర్గాలకు సులభతరం చేస్తున్నారు.

**సముద్ర గర్భంలోని ఖనిజాల (అభివృద్ధి, హేతుబద్ధీకరణ) సవరణ బిల్, 2023:** ఈ చట్టం ద్వార కేవలం ప్రైవేట్ వ్యక్తులకే సముద్ర గర్భంలోని ఖనిజాల తవ్వకాలకు పారదర్శిక వేలం పద్ధతులలో అనుమతులు ఇస్తారు. ఎవరికైనా ఏకరీతిలోనే అనుమతులు ఇవ్వడానికి 50 ఏండ్లకు మించకుండా గుత్తాకు (లీజ్) ఇవ్వడానికి ఈ చట్టం దోహదపడుతుంది. నిజానికి సముద్ర గర్భ జీవ వైవిధ్యాన్ని నాశనం చేయడానికి ఈ చట్టం దారులు తెరుస్తున్నది. దీనిని పర్యావరణవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అపార వ్యాపార లాభాల ముందు ఎవరి వ్యతిరేకతను రాజ్యం లెక్క చేయదు. మోదీ ఆ విషయంలో అందరి కన్నా ముందుంటాడు.

**అటవీ (సంరక్షణ) సవరణ బిల్, 2023:** ఇది అటవీ (సంరక్షణ) చట్టం, 1980కి సవరణ ద్వార రూపొందినది. దేశ వ్యాపితంగా దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆదివాసీ సంఘాలు, వారి శ్రేయోభిలాషులు, పర్యావరణవాదులు సహ అనేక మంది దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ చట్టం ద్వార విశాలమైన భూఖండాలు కార్పొరేట్ వర్గాలకు దారాదత్తం అవుతాయనీ, గ్రామసభలు, పెసా నిష్క్రియమవుతాయనీ స్పష్టం చేస్తున్నారు.

**జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్, 2023:** ఈ చట్టం ద్వార ఆర్థిక లావాదేవీలలో జరుగుతున్న అవకతవకలను అరికట్టడానికి స్వల్ప నేరాలకు భారీ శిక్షలు విధించడం కాకుండా దండుగలతో సరిపుచ్చే విధంగా సవరణలు చేశారు.

**జనన మరణాల నమోదు బిల్, 2023:** నిజానికి ఇందులో ఏముంది? అనే సందేహం కలిగితే ఆశ్చర్యం వుండదు. కానీ, ఏ ప్రభుత్వమైనా తాను చేపట్టే చర్యలలో చట్టాలే కావచ్చు, విధానలే కావచ్చు, నియమ నిబంధనలే కావచ్చు అవి ఏవో ప్రయోజనాలను నెరవేర్చే లక్ష్యంతోనే ముందుకు వస్తాయి. లేకపోతే, ఆ అవసరమే రాదు. మోదీ అధికారానికి వచ్చిన గత పదేళ్లలో కరుడుగట్టిన హిందుత్వ శక్తులు మన దేశంలో ముస్లిం జనాభా పెరిగిపోతుందనే వాదనలు ముందుకు తెస్తూ (దేశంలో కడు పేదరికాన్ని అనుభవిస్తున్నది వాళ్లే) మేమిద్దరం, మాకు 10 మంది అంటూ హిందూ మహిళలను పిల్లలు కనే యంత్రాలుగా భావించి నినాదాలు ఇవ్వడం చూస్తున్నాం. ఇలాంటి చట్టాలు అలాంటి వాదనలకు, నినాదాలకు ఎంతైనా ఉపకరిస్తాయి. పైగా ఎన్.ఆర్.సీ., ఎన్.పీ.ఆర్., సీ.ఏ.ఏలతో దేశం ముఖ్యంగా ముస్లిం జనాభా అతలాకుతలం అవుతున్న పరిస్థితులలో ఈ చట్టం హిందుత్వ శక్తుల అమ్ముల పొదిలో ఒక ఆయుధంగానే వుంటుంది.

**మధ్యవర్తిత్వ బిల్, 2023:** తగువుల పరిష్కారంలో ముఖ్యంగా సంస్థల మధ్యవర్తిత్వాన్ని నెరపి అంగీకారాన్ని కుదర్చడానికి ఉ

ద్దేశించిన చట్టం. ఆన్‌లైన్ మధ్యవర్తిత్వం కూడ అనుమతిస్తారు. దేశంలోని న్యాయవ్యవస్థ ముందు 5 కోట్ల కేసులు పెండింగ్‌లో వున్న మాట ఎంత నిజమో, ఇప్పటికీ మన దేశ ప్రత్యేకతలో భాగంగా అనేక కేసులు గ్రామాలలో, కుల కట్టుబాట్లతో, ఇతర పద్ధతులలో పరిష్కరించుకోవడం పరిపాటి. అయితే, ఎక్కడికక్కడే హిందుత్వ దాడులు బెదిరింపుల నుండి మూక హత్య (లించింగ్) వరకు ఇష్టారాజ్యంగా జరుగుతున్న వర్తమాన ఫాసిస్టు పాలనలో ఈ చట్టం ఉపయోగించుకొని కోర్టుల వరకు కేసులు వెళ్లకుండా బాధితులను నియంత్రించవచ్చు.

**ఇంటర్-సర్వీస్ ఆర్గనైజేషన్స్ (కమాండ్, కంట్రోల్ అండ్ డిసిప్లిన్) బిల్, 2023:** ఇది సైన్యంలో విధులు నిర్వహించడంలో క్రమశిక్షణ తప్పిన వారిపై చేపట్టే చర్యలకు సంబంధించిన చట్టం. ఇది సైన్యంలోని త్రివిధ బలగాలలో సైనికుల మధ్య వివక్షను పెంచడానికి దురుపయోగానికి పాల్పడడానికి కావలసిన స్వేచ్ఛనిస్తుంది. సైన్యంలో పెరుగుతున్న హిందుత్వ శక్తుల ప్రాబల్యాన్ని ఈ చట్టం తెలుపుతుంది.

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజిమెంట్ (ఐఐఎం) బిల్ 2023:** చట్టంగా రూపొందింది. ఈ బిల్లును ప్రవేశపెడుతూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఐఐంల యాజమాన్యాలకు వారి విద్యా సంస్థలకు ఎలాంటి నష్టం వుండదనీ చాలా స్పష్టంగా హామీ ఇస్తూ కేవలం వాటి నిర్వహణ జవాబుదారీతనాన్ని దేశ అధ్యక్షులకు అందిస్తున్నాం అన్నాడు. నిజానికి ఈ అవసరం ఏం వచ్చిందనే చిన్న ప్రశ్న వేసుకుంటే, దేశంలో విద్య ప్రైవేటీకరణ చేశాక చోటుచేసుకుంటున్న వైపరీత్యాలు ముఖ్యంగా విద్యార్థుల ఆత్మహత్యలు, అందులో ఇంజనీయరింగ్, వైద్యం, యూపీఎస్‌సీ తదితర వృత్తి విద్యా కోర్సులకు తయారయ్యే యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో వాటిపై విశ్వాసాన్ని పెంచడానికే ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందనేది వాస్తవం. భారత రాష్ట్రపతికే జవాబుదారీగా వుండాలనడంతో అమాయక తల్లి తండ్రులు ఇకపై తమ పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడరనే నమ్మకంతో కోచింగ్ సెంటర్లకు పంపుకుంటారనీ, అవి తమ వ్యాపారాన్ని మరింత పెంచుకుంటాయనేదే చట్టం రూపకల్పనలో అసలు కిటుకు.

**జాతీయ దంత కమిషన్ బిల్లు, 2023:** చట్టంగా రూపొందడంతో దంత వైద్యుల చట్టం 1948 రద్దయింది. ఈ చట్టం ఆరోగ్య పరిరక్షణ విషయంలో విద్యను మరింత మెరుగు పరుస్తుందని తెలుపుతున్నారు. కానీ, ఇప్పటికే, ఇంజనీయరింగ్, వైద్య విధానాలను ప్రైవేట్‌పరం చేసిన ప్రభుత్వాలు మెరుగుదల పేరుతో ఎవరి ప్రయోజనాలు నెరవేర్చనున్నాయో ఆలోచనాపరులకు విడిగా చెప్పాల్సిన అవసరం వుండదు.

**జాతీయ నర్సింగ్ మరియు మిడ్‌వైఫరీ కమిషన్ బిల్, 2023:** ఇది కూడ ప్రజలను మభ్య పెడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల సేవలలో లాభార్జనకు ఉపయోగ పడేదే.

**రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) వ్యవస్థ (సవరణ) బిల్, 2023:** ఛత్తీస్‌గఢ్‌లోని షెడ్యూల్డ్ కులాలలో మహరా, మహారా సమూహానికి పర్యాయ పదాలైన మహర్, మెహరా, మెహర్‌లను చేరుస్తూ రూపొందిన చట్టం ఇది. పైన ఆదివాసుల విషయంలో రాసిందే దీనికీ వర్తిస్తుంది. కుల విముక్తికి బాటలు వేయాల్సిన ప్రభుత్వాలు సమాజాన్ని ఇంకా కులాల కింద విభజిస్తూ కులాల కుంపటి రగల్చడానికి ఇది ఒక మచ్చు తునక చట్టం. అంబేద్కర్ కుల నిర్మూలన కోసం పోరాడితే, మన మనువాద పాలకులు కర్మభూమిలో కులాల వికాసానికి పాటుపడుతున్నారు. అంబేద్కర్‌ను మనువాదులు ఎందుకు కొలుస్తారో అర్థం చేసుకోవచ్చు.

**జాతీయ పరిశోధనా సమన్వయ సంస్థ బిల్, 2023:** గణిత శాస్త్రం, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ, పర్యావరణం, పృథ్వీ శాస్త్రం, ఆరోగ్యం వ్యవసాయం, మానవ శాస్త్రం, సాంఘిక శాస్త్రంలో శాస్త్రీయ టెక్నాలజీల అంతర్‌తలం సహ సామాన్య శాస్త్రాలను అభివృద్ధి చేయడం, పరిశోధనలో, అన్వేషణలో వ్యూహాత్మక దిశా నిర్దేశం చేసే చట్టం. ఈ చట్టం హిందుత్వ శక్తుల తిరోగమన భావజాలానికి ఒక ఆయుధాన్ని సమకూరుస్తుంది.

**"డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్" (డీపీడీపీ) బిల్, 2023:** ఇది నిరంకుశంగా రూపొందిన బిల్లు అంటూ ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. దీనితో 2005నాటి సమాచార హక్కు సవరించారు. ప్రతిపక్షాలు పెట్టిన సవరణలను తమ బలంతో పాలకపక్షం ఓడించింది. దేశ ప్రజలు పోరాడి సాధించుకున్న సమాచార హక్కుకు వర్తమాన చట్టం చరమగీతం పాడింది. దీనితో అవకతవకలకు పాల్పడుతున్న వ్యక్తుల గురించి, ప్రభుత్వ లోటుపాట్ల గురించి, పెద్ద మొత్తంలో బ్యాంకులను ముంచుతున్న వాళ్ల గురించి ఇకపై ఏ సమాచారం ముందరిలా పౌరులకు దొరికే అవకాశం వుండదు. అంటే, కార్పొరేట్ వర్గాలకు ప్రభుత్వం అందించే ప్రజా సొమ్ము, దేశ వనరుల వివరాలేవీ బయటకు రావు. పోతే, ఈ బిల్లుతో ప్రజల ప్రైవేసి అంతమవుతుంది. ప్రజల ప్రైవేసితో ప్రభుత్వాలు చెలగాటమాడుతాయి.

**కోస్తా రొయ్యల పెంపక గుర్తింపు (సవరణ) బిల్లు, 2023:** రొయ్యల పెంపకంతో తీర ప్రాంత రైతులు ఎదుర్కొన్న సమస్యలతో ఎదురైన పర్యావరణ సమస్యలు లోక విదితమే. అయితే ఇపుడు మోదీ ఈ చట్టం ద్వార రొయ్యల సులభ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నాడు.

**ఫార్మసీ (సవరణ) బిల్, 2023:** ఇది కశ్మీర్‌కు వర్తించే చట్టం. ఆర్టికల్ 370 రద్దు చేశాక జమ్మూ కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తూ అనేక చట్టాలు రూపొందిండంలో భాగంగా ఇదో చట్టం.

**జాతీయ రాజధాని ఢిల్లీ ప్రభుత్వ ప్రాదేశిక (సవరణ) బిల్లు, 2023:** దీనిని 102 మంది లోక్‌సభ సభ్యులు వ్యతిరేకించారు. తమకు మెజార్టీ వుండడంతో బిల్లును చట్టంగా రూపొందించారు. దీనితో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం తన ఉద్యోగుల నియామకాలు, బదిలీలపై ఎలాంటి అధికారాన్ని కలిగివుండదు. కేంద్ర ప్రభుత్వమే ఆ వ్యవహారాలన్నీ నడుపుతుంది. ఇది ఫెడరల్ విధానానికి గొడ్డలి పెట్టు లాంటిది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్‌ను తన చెప్పుచేతలలో పెట్టుకొని ఢిల్లీ వ్యవహారాలను నడుపుతుంది. శాంతి, భద్రతలు కేంద్రం చేతిలోనే వున్నాయి. ప్రస్తుత చట్టంతో అధికారుల నియామకాలు, బదిలీలు కూడ కేంద్రమే చూస్తుందంటే,

ఇక ఆ రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తూ వుండాల్సిందే. ఈ చట్టం కేంద్రాన్ని మరింత బలోపేతం చేస్తూ భారత కార్పొరేట్ వర్గాలకు అనుకూల నిర్ణయాలు తీసుకోవడానికే తోడ్పడుతుంది.

పైన మనం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో రూపొందిన ముఖ్య చట్టాల గురించి చూశాం. ఆ చట్టాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే గెజిట్‌లలో వాటి పూర్తి వివరాలు లభ్యమవుతాయి. వాటిని అధ్యయనం చేయడం ద్వార చట్టం పూర్తి పాఠం అర్థమై అవి రూపొందడం వెనుక గల ఉద్దేశాలు, వాటి ప్రయోజనాలు సమగ్రంగా తెలుస్తాయి. ఇక్కడ నూతన చట్టాలను స్థూలంగా మాత్రమే పరిచయం చేశాం. మన దేశ చట్టసభలలో రూపొందుతున్న చట్టాల స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఈ స్థూల పరిచయం తోడ్పడవచ్చు. వాటిని తెలుసుకోవలసిన ఆవశ్యకత ఏంటంటే మారుతున్న భారత వ్యవస్థ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి అవి ఒక సూచికలా తోడ్పడుతాయి.

చట్టాల రూపకల్పన సందర్భంగా పాలక పక్షం లేద బిల్లులను ప్రవేశపెడుతున్న విభాగాల మంత్రులు చాలా సందర్భాలలో దాపరికం లేకుండా కూడ సులభ వ్యాపార అవశ్యకతను నొక్కి చెపుతూ చట్టాలు రూపొందాల్సిన అవసరాన్ని తెలుపుతున్నారు. మరోవైపు భారతదేశ సంస్కృతిని ఉటంకిస్తూ దాని పరిరక్షణ గురించి మాట్లాడుతుంటారు. వాటిని కాపాడడానికి దేశాన్ని ఉగ్రవాద బెడద నుండి రక్షించాల్సిన ఆవశ్యకత అందుకు అవసరమైన చట్టాల రూపకల్పన గురించి కూడ చెపుతారు. కాబట్టి చట్టాల గురించి అధ్యయనం చేయకుండా ప్రజలను చట్ట పోరాటాలలో సమీకరించి ప్రజాస్వామ్య సాధన దిశలో సంఘటితపర్చలేం.

సెప్టెంబర్ 17 నుండి లోకసభ ప్రత్యేక సమావేశాలు జరుగనున్నాయి. ఇందులో 6 బిల్లులను ప్రవేశ పెడుతారని అంచనా వేస్తున్నారు. వాటిపై వచ్చే సంచికలో తెలుసుకుందాం.

## ఆదివాసీ ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టివేస్తూ పార్లమెంటులో ప్రజావ్యతిరేక అటవీ బిల్లులు ఆమోదం

అటవీ సంరక్షణ చట్టం – 2023, గనులు, ఖనిజాలు అభివృద్ధి నియత్రణ చట్టం ( ఎమ్.ఎమ్.డీ.ఆర్. ) ఈ రెండు చట్టాలు అమలు జరిగితే అడవుల వినాశనానికి దారి తీయడంతో పాటు పర్యావరణ సమతుల్యం దెబ్బతినిపోతుంది. కొండల్లోని సంపద కార్పొరేట్‌లకు తరలిపోతుంది. అక్కడి స్థానిక ఆదివాసులు నిర్వాసితులు అయిపోతారు.

ఇది 1980 అటవీ సంరక్షణ చట్టాన్ని, 2006 అడవుల నియంత్రణ చట్టాన్ని (ఎఫ్.ఆర్.ఏ.), అలాగే గ్రామ సభల అనుమతి తప్పనిసరి అని చెప్పిన చట్టాలు, 1996 పెసా, సుప్రీంకోర్టు తీర్పులు, ఉత్తరువులు ఇక చెల్లవు. దీనితో పాటు జీవ వైవిధ్యంపై కూడా చట్ట సవరణను తెచ్చింది. ఎఫ్.సీ.ఏ., ఎమ్.ఎమ్.డీ.ఆర్ రెండింటినీ విలీనం చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. దీనివలన కార్పొరేట్ ఔషధ సంస్థలకు అదుపులేని అధికారాలు వస్తాయి. దేశ సరిహద్దులలో 100 కి.మీ పరిధిలో కూడా వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం ఆ భూములను వాడుకోవచ్చు. అంటే ఈశాన్య రాష్ట్రాలలోని మణిపూర్, మిజోరం లాంటి రాష్ట్రాలలో మయన్మార్, బంగ్లాదేశ్‌లు సరిహద్దు ప్రాంతాలలో భూములను కార్పొరేట్ శక్తులకు ఒప్పగించే పథకాలు కూడా ఈ బిల్లులలో ఉన్నాయి.

ప్రాథమిక సర్వే క్రమంలో గుంతలు, కందకాలు తవ్వడం, డ్రిల్లింగ్ ఇక ముందు నేరంగా పరిగణించబడదు. లిథియం, కోబాల్ట్, నికిల్, పొటాష్, తగరం, ఫాస్పేట్ వంటి వ్యూహాత్మక ఖనిజాలకు సంబంధించిన హక్కులను కేంద్రీకృతం చేసింది. అదనంగా బంగారం, వెండి, రాగి తదితర 29 ఖనిజాలకు సంబంధించిన తవ్వకాల లైసెన్స్‌లు జారీ చేసే అధికారాన్ని కొత్త చట్టం కేంద్ర ప్రభుత్వానికి దారాదత్తం చేసింది.

ఆటోమేటిక్ మినరల్స్ జాబితా నుండి ఆరు లోహాలు లిథియం, బెరీలియం, నియోబియం, టైటానియం, టాంటాలం, జిక్రోనియమ్‌లను తొలగించారు. ఇప్పటి నుండి వీటికి అనుమతి తీసుకోనవసరం లేదు.

ధరల నియంత్రణ, సుంకాలు, లెవీలు అన్నీ మినహాయింపే. రాష్ట్రాల హక్కులను కుదించడం, ఫెడరల్ విధానాన్ని కాలరాసి కాదనడంతో పాటు నిబంధనల సడలింపు వలన కార్పొరేట్ల తవ్వకాలు, దోపిడిపై నియంత్రణ లేకుండా చేయడం అంటే ఏమిటి? కార్పొరేట్ సంస్థలు వివిధ పేర్లతో అడవిని గుల్ల చేసి అటవీ సంపదను, భూములను కొల్లగొట్టి ఆ ప్రాంతాల నుండి ఆదివాసులను పారదోలి దోపిడీని తీవ్రతరం చేయడం, పర్యావరణాన్ని ధ్వంసం చేయడం తప్ప మరొకటి కాదు.

ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీసి, కార్పొరేట్లకు దేశ అటవీ సంపదను కొల్లగొట్టి పెట్టడమే మోదీ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాల ఉద్దేశ్యం.

ఆదివాసులకు అండగా, దేశ సంపదను, అడవులను పర్యావరణాన్ని కాపాడుకోవడానికి యావత్ భారత ప్రజలు ఐక్యంగా పోరాడాలి. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలను ఓడించాలి.

☆

---

**గమనిక: జూన్ ప్రత్యేక సంచిక పేజీ 7లో మొదటి పేరా మొదటిలైన్‌లో నవంబర్ 2023 పొరపాటుకు చింతిస్తున్నాం. నవంబర్ 2022గా చదువుకో మనవి. అలాగే రెగులర్ సంచికలో కామ్రేడ్ ఆనంద్ జీవిత చరిత్రలో 1984లో ఆయన దండకారణ్య జైజాన్ కమిటీలో వున్నాడని రాశాం, కానీ ఆయన అందులో లేడు, 1992లో సీసీఎంగా బాధ్యతలు చేపట్టాడని రాశాం. దానిని 1995గా చదువు కోమనవి. ఈ ఫ్యాక్చువల్ తప్పులకు చింతిస్తున్నాం.**

# హిందుత్వ ప్రపంచానికే ప్రమాదం
# అమెరికా హక్కుల కార్యకర్తల ఆందోళన

అమెరికాలోని 'క్యాపిటల్ సందర్శకుల కేంద్రం'లో అంతర్జాతీయ ధార్మిక స్వేచ్ఛపై అమెరికా కమిషన్‌లోని ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు జిం మాక్‌గోవర్న్, ఇల్హన్ ఒమర్, రషీదా తయ్యుబ్‌లు భారత-అమెరికా సలహా గ్రూప్‌కు చెందిన మానవ హక్కుల నిపుణులతో కలిసి సమావేశం అయ్యారు. వారు భారతదేశంలో నిరంకుశ మోదీ ప్రభుత్వం మానవ హక్కుల దుర్వినియోగానికి పాల్పడుతున్నది అంటూ గుర్తించాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం మోదీ అత్యంత అట్టహాసంగా కాంగ్రెస్‌లోని రెండు సభలను ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో కావడం మోదీ వాచాలతను, భారత బడా ప్రజాస్వామ్య డొల్లతనాన్ని వెల్లడిచేసింది.

భారత ప్రభుత్వ విధానాలను విమర్శించేవారు, పాత్రికేయులు వారి కుటుంబాలు హింస దౌర్జన్యాలకు లక్ష్యంగా మారుతున్నారనీ, రాజకీయ వేధింపులకు గురవుతున్నారనీ రిపబ్లికన్ సభ్యురాలు ఇల్హన్ ఒమర్ తెలిపింది. విదేశాలలోని వారు కూడ లక్ష్యంగా మారుతామని మాట్లాడడానికి జంకుతున్నారంది. అమెరికా విదేశీ విధానంలో మానవ హక్కులను కేంద్రంగా చేసుకొని వ్యవహారాలు వుండాలని వున్నప్పటికి, భారతదేశంలోని నిర్బంధాన్ని పట్టించుకో కూడదని, అమెరికా అధికార వర్గాలు అంటున్నట్టు ఆమె చెప్పింది. భౌగోళిక కూటమిలో ప్రధాన మంత్రి మోదీ నమ్మదగిన వాడేమీ కాదంది. భారత ప్రజలతో మైత్రికి మనం ప్రాధాన్యతను ఇవ్వాలనీ, భారతదేశంలో జరుగుతున్న మానవ హక్కుల హననం గురించి వాస్తవాలను వెల్లడించాలనీ రిపబ్లికన్ సభ్యుడు జిం మాక్‌గోవర్న్ అన్నాడు.

నేను ముస్లింల గురించి మాట్లాడుతున్నాను. అలాగే, సిఖ్ఖులు, క్రైస్తవులు, దళితుల గురించి కూడా.....మేం భారత ప్రభుత్వాన్ని ప్రస్తుత చిత్రాన్ని, దురదృష్టకర ధోరణులను తిరగమార్చాలనీ భారత రాజ్యాంగ విలువలను పునఃనెలుకొల్పుతామని హామీ ఇవ్వాలని కోరుతున్నామనీ, ఈ విషయాలను తొలుత మా గమనంలోకి తెచ్చింది వాస్తవంగా ఒక హిందువేనని రిపబ్లికన్ సభ్యురాలు రషీదా తయ్యుబా అంది. భారతదేశాన్ని ఒక వివక్షాపూరితమైన దేశం శ్రేణిలో చేర్చాలనీ ఆ సమావేశం అభిప్రాయపడింది. ఆ సమావేశంలో పాల్గొన్న భారత-అమెరికా ముస్లింల కౌన్సిల్ సలహాదారు అజిత్ సాహి మాట్లాడుతూ "నేనొక స్వయాన హిందువును, మీకు నేను ఒక భారీ మార్పును చెప్పాలనుకుంటున్నాను. నేను చూసినంత వరకు హిందువులలో చాలా లోతుగా విద్వేష విషం చోటుచేసుకుంది" మోదీని ముందుకు తెచ్చిన జాతీయ భావజాలాన్ని గుర్తు చేస్తూ సాహి "ఇదేదో గంపగుత్తగా నిరంకుశంగా వ్యవహరించడం కాదు, హిట్లర్‌ను సంపూర్ణంగా సమర్థించే సంస్థాపకులు చాలా పకడ్బందీగా పొందుపరిచిన సంఘటిత వుద్యమంగా దీనిని చూడాలి" అన్నాడు. అలాగే, వాళ్లు కేవలం భారతదేశానికి మాత్రమే ప్రమాదంగా భావించకూడదు. వాళ్లు ముస్లింలకు మాత్రమే ప్రమాదం అనుకోకూడదు. వాళ్లు క్రైస్తవులకు ముప్పుగా అర్థం చేసుకోకూడదు. వాళ్లు ప్రపంచ శాంతికి ప్రమాదకారులు. అమెరికా తన జాతీయ భద్రతా లక్ష్యాలు, భౌగోళిక రాజకీయాల గురించి గంభీరంగా వుంటే, తను (బైడెన్) శాంతికి పెను ముప్పును కొనితెస్తున్నాననే విషయాన్ని, ప్రధాన మంత్రి మోదీని సమర్థిస్తూ స్థిరతకు ప్రమాదాన్ని కలిగిస్తున్నానని అర్థం చేసుకొని సరైన వైఖరిని చేపట్టాలి అన్నాడు.

### సర్కార్ తేరీ డిక్టేటర్‌షిప్ నహీం చలేగీ
### మాధురీ బెహన్ జిల్లా బహిష్కరణ ఆదివాసీలపై దాడి

మధ్యప్రదేశ్ లోని బురహన్‌పుర్ జిల్లాలో ప్రభుత్వం 15,000 ఎకరాల అటవీ భూమిలో చెట్లు నరకడాన్ని స్థానిక ఆదివాసీ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ అడవిలో నుండి ఆదివాసులను బేదఖల్ చేయిస్తూ ఖాళీ చేయిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఆదివాసులు 'జాగృత ఆదివాసీ దళిత్ సంఘటన్' (జెఏడీఎస్)

తరువాయి 24వ పేజీలో





# ఉద్యోగాలకు స్వస్తి చెపుతున్న పోలీసులు

53 వేలకు పైగా కేంద్ర సాయుధ పోలీసు ఫోర్స్ (సీఏపీఎఫ్) ఉద్యోగాలకు స్వస్తి చెప్పారు. 658 మంది తమ ప్రాణాలు తామే తీసుకున్నారు. ఇది కేవలం ఐదేళ్ల అంకెలే. 2018-2022 మధ్య సరిహద్దు భద్రతా దళం (బీ.ఎస్.ఎఫ్) జవాన్‌లు 23,553 మంది ఉద్యోగాలు వదిలేశారు. వీరిలో 21,692 మంది జవాన్‌లు స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు అంటూ కేంద్ర పోలీసు డిప్యూటీ మినిష్టర్ నిత్యానంద్‌రాయ్ లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు మణికం టాగోర్ అడిగిన ప్రశ్నకు జులై చివరి రోజు లిఖితపూర్వక జవాబు చెప్పాడు. ఆయన వెల్లడించిన అంకెల ప్రకారం మొత్తంగా 53,336 మంది ఉద్యోగాలు వదిలితే, వారిలో 47 వేల మంది స్వచ్ఛంద పదవీ విరమణ చేసినవారు కాగా మిగితా 6,336 మంది ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. ఐదేళ్ల వివరాలకు వస్తే 2018లో 10,940మంది; 2019లో 10,323 మంది; 2020లో 7,690 మంది; 2021లో 12,003 మంది; 2022లో 12,380 మంది అంటూ మంత్రి గణాంకాలు చూపాడు. వీరిలో సీ.ఆర్.పీ.ఎఫ్ వాళ్లు 13,640 మంది ఉద్యోగాలు వదిలారు. అసోం రైఫిల్స్‌కు చెందిన వారు 5,393 మంది; సీఐఎస్ఎఫ్ వాళ్లు 5,151 మంది; ఐటీబీపీ వాళ్లు 3,165 మంది; ఎస్ఎస్‌బీ జవాన్‌లు 2,434 మంది ఉద్యోగాలు వదిలారు. ప్రాణాలు తీసుకున్న వారిలో సీఆర్‌పీఎఫ్ వాళ్లే అధికంగా వున్నారు. మంత్రివర్యులకు గణాంకాలపై శ్రద్ధ వుంది కానీ, అంతమంది 'వీరజవాన్'లు తమ ఉద్యోగాలకు స్వస్తి చెప్పడానికి కారణాలు ఏంటో వివరించడం లేదు. ఆత్మహత్యలకు పాల్పడడం వెనుక కల బలమైన కారణాలు కూడ ప్రకటించలేదు. నిజానికి ఉద్యోగాలలో ఎదురవుతున్న పై అధికారుల దబాయింపు, వత్తిళ్లు, అవమానాలు సెలవులు లేని కొలువులు, కుల వివక్ష, మతోన్మాద దాడులు, విష విద్వేషభరిత వ్యవహారాలు కారణాలుగా వుంటాయి. పోతే, మావోయిస్టు ప్రాంతాలైతే కొన్ని అదనపు కారణాలు తప్పక వుంటాయి. కుటుంబాలకు దూరంగా ప్రాణ భయంతో జీవించడంతో పాటు ప్రజల నుండి ఎలాంటి సహకారం వుండకపోవడమే కాకుండా, ప్రజలతో ఖాకీబలం ప్రదర్శిస్తూ పాశవికంగా వ్యవహరించడం కూడ వారిని ప్రభావితం చేస్తుంది. ఏమైనా ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వదలడం, గణనీయమైన సంఖ్యలో తమ ప్రాణాలు తీసుకోవడం చింతాజనకమే. ఈ వార్త రాస్తున్న సమయంలో కూడ కాంకేర్ జిల్లాలో ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్ తన సర్వీస్ తుపాకితో కాల్చుకున్న వార్త అందుతోంది. తూర్పు సింహ్‌భూంలో శిక్షణ పొందుతూ గుండెపోటుతో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు (మణిపుర్‌కు చెందిన ప్రేం కుమార్, బిహార్‌కు చెందిన శంభూరాం గౌడ్) ప్రాణాలు కోల్పోయారు. అందుకే ప్రభుత్వాలు చాలా తెలివిగా, ఉద్యమ ప్రాంతాలలో స్థానికులతోనే బలగాలను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పోలీసులు ఈ అంకెలను చూసైనా తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలి. తమ కోసం, ఉద్యోగం వదిలి, ప్రజా సేవలో మరే ఉద్యోగం చేసినా మంచిదే. అంతకన్నా ఈ దోపిడీ వ్యవస్థను కూల్చడానికి సాయుధంగా పోరాడుతున్న ప్రజా విముక్తి గెరిల్లా సైనికులతో భుజం భుజం కలిసి నడవడం ఉత్తమమైనది.

## కొల్హాన్, సారండా గెరిల్లాలకు, వీర ప్రజలకు విప్లవ జేజేలు

15 ఆగస్టు రోజు పశ్చిం సింహ్‌భూం జిల్లా చాఈబాసా జిల్లా తుంబాహాకా, సర్జోంబురు రోడ్డుపై రాత్రి గస్తీ చేస్తున్న పోలీసులపై పీ.ఎల్.జీ.ఏ గెరిల్లాలు జరిపిన మాటుదాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు, ఇద్దరు ఝార్ఖండ్ జగ్వార్‌లు తప్పిపోగా, తరువాత సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు క్యాంపుకు చేరుకున్నారు. కానీ ఇద్దరు ఝార్ఖండ్ జగ్వార్‌లు అమిత్ తివారి, గౌతం కుమార్ గెరిల్లాల కాల్పులలో చనిపోయారు. మూడు రోజుల ముందు 11 ఆగస్టు రోజు టోంటో పోలీసు స్టేషన్ పరిధిలో హస్పీ-తిలాయ్‌బేడా అడవిలో గెరిల్లాలతో జరిగిన ఎదురుకాల్పులలో ఒడిశాకు క్యోంఝర్‌కు చెందిన సుశాంత్ కుమార్ ఖుంటియా సీఆర్‌పీఎఫ్ జవాన్ చనిపోయాడు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మున్నాలాల్ యాదవ్ గాయపడ్డాడు. ఆ ప్రాంతంలోనే పాటాతోరబ్ గ్రామ సమీపాన అడవిలో గాలింపు జరుపుతున్న సమయంలో మందు పాతర పేలి సీఆర్‌పీఎఫ్ సహాయక కమాండెంట్ సమాదెప్త చంద్ర ప్రతాప్ తివారీ గాయపడ్డాడు. ఇదే జిల్లాలో కొల్హాన్ అడవిలో గోఇల్‌కేరా అడవిలో మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ దేవేంద్ర కాకోటీ గాయపడ్డాడు. జులై 11, 12 తేదీలలో జరిగిన ఎదురుకాల్పులలో 5గురు పోలలీసులు చనిపోగా, 7గురు గాయపడ్డారు. మరోవైపు లోహార్‌దగాలో కేక్‌రంగ్‌లో ఉద్యోగ నిర్వహణలో వున్న యువ సీఆర్‌పీఎఫ్ జవాన్ జగదీష్ ప్రసాద్ మీనా (39) ఆగస్టు 20 నాడు సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకొని చనిపోయాడు. మరోచోట అసోం కు చెందిన ప్రాంజల్ నాథ్ తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకొని చనిపోయాడు.

మొత్తంగా గత డిసెంబర్ నుండి ఎడతెరిపి లేకుండా కొల్హాన్, సారండా అడవులలో వేలాది పోలీసులు బలగాలు కేంద్రీకరించి జరుపుతున్న గాలింపు చర్యలలో 25 మంది పోలీసులు చనిపోగా, 90 మంది గాయపడ్డారు. పోలీసులు 81 యంయం షెల్స్ కొండలను టార్గెట్ చేసి విస్తృతంగా కాలుస్తున్నారు. నిరంతరం అర డజన్ హెలీకాప్టర్లు ఈ ప్రాంతంలో చక్కర్లు కొడు తుంటాయి. డ్రోన్‌లు విచ్చిలవిడిగానే నిఘా నేత్రాలతో సంచరిస్తుంటాయి. అక్కడ అమర్చిన మందుపాతరల పేలుళ్లలో పొరపాటున 10 మంది గ్రామస్తుల మరణం బాధాకరం. ★

" అత్యంత శ్రద్ధగా అధ్యయనం చేసి సమస్యల లోతుపాతులను అర్థం చేసుకొని స్వతంత్రంగా వాటిని పరిష్కరించడం, తమ పార్టీ భవితవ్యాన్ని నిర్ణయించగలిగే వారినే పార్టీ సభ్యులు, శ్రామిక వర్గ పార్టీ నిర్మాతలంటాం" - లెనిన్



SIR PUTTANNACHETTY TOWNHALL
JUSTICE FOR MANIPUR
WE WANT PEACE NOT VIOLENCE
SAVE MANIPUR WOMEN
SAVE MANIPUR
మణిపూర్ హిందుత్వ శక్తుల దోష్టీక దృశ్యాలు
END VIOLENCE IN MANIPUR!
ENSURE PEACE AND JUSTICE FOR
aisa
मणिपुर हिंसा व 4 मई को दो म




ఉక్రెయిన్ యుద్ధ బీభత్స దృశ్యాలు
VILNIUS